


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 104 | శనివారం | 14-03-2026 | కరీంనగర్

Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar**

పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## మార్పుకు గెలుపు నాంది పలకాలి

సమాజ వికాసం కోసం ప్రజాప్రతినిధులు పనిచేయాలి శిక్షణా తరగతుల్లో ప్రొఫెసర్ కోదండరామ్

03




### సిఇసి అభిశంసనకు ఉభయ సభల్లో

## విపక్షాలు నోటీసులు

- పార్లమెంటులో నోటీసు ఇవ్వడం ఇదే ప్రథమం
- జ్ఞానేశ్‌కుమార్‌పై పక్షపాతం, ఓట్ల తొలగింపుసహా ఏడు అభియోగాలు

**న్యూఢిల్లీ :** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించడానికి ప్రతిపక్షాలు పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చాయి. శుక్రవారం లోక్‌సభ, రాజ్యసభకు అభిశంసన తీర్మాన నోటీసులు అందజేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపారు. 130 మంది లోక్‌సభ ఎంపిలు, 63 మంది రాజ్యసభ సభ్యులు నోటీసుపై సంతకం చేసినట్లు పేర్కొన్నారు. అయితే సిఇసిపై పార్లమెంటులో నోటీసు ఇవ్వడం ఇదే మొదటిసారి. జ్ఞానేశ్‌కుమార్‌పై పక్షపాతం, ఓట్ల తొలగింపు, అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించడం వంటి 7 అభియోగాలను విపక్షాలు మోపాయి. ఇండియా కూటమిలోని అన్ని పార్టీల ఎంపిలు నోటీసుపై సంతకం చేశారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే కూటమిలో లేని ఆప్, కొంతమంది స్వతంత్ర ఎంపిలు కూడా సంతకం చేశారని పేర్కొన్నాయి. మరికొంత తరువాయి 12లో



# ఆందోళనొద్దు

## గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్ సరఫరా చేస్తాం

- రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవం
- సిఎస్ ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ ఏర్పాటు చేస్తున్నాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎల్‌పిజి గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని, గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్‌ను సరఫరా చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసానిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్‌పిజి కనెక్షన్లు ఉండగా, రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని వివరించారు. అమెరికా—ఇరాన్ యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్టుగా జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని తరువాయి 2లో



గ్యాస్ సంక్షోభం తలెత్తడంతో సిలిండర్లు వీడి రెస్టారెంట్లలో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న దృశ్యం



### గ్యాస్ సిలిండర్లు ఎక్కడికి పోయాయి?

ప్రధాని మోదీ అదృశ్యమయ్యారు ప్రతిపక్షాల విమర్శ పార్లమెంట్ వెలుపల నిరసన ప్రదర్శన

05



### ఆర్గానిక్ ఫార్మింగ్‌లో

## ఎస్‌హెచ్‌జిల భాగస్వామ్యం

- అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశం
- వ్యవసాయ సంస్థలపై సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేయాలని సూచన
- వ్యవసాయ శాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో శాఖ ప్రతిపాదనలపై భట్టి, మంత్రులు తుమ్మల, ఉత్తమ్ చర్చ

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, ఆర్గానిక్, నేచురల్ ఫార్మింగ్‌లో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) ను భాగస్వాములుగా చేయాలని వ్యవసాయ అధికారులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఎస్‌హెచ్‌జిల ద్వారా కూరగాయలు, పూల సాగు చేయించి ఆ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిలతో కలిసి ప్రీ బడ్జెట్ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ రైతు వేదికలు, వ్యవసాయ మార్కెట్ గోదాములు, వేర్ హౌసింగ్ గోదాములపై సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు. ఈ వ్యవస్థ ద్వారా వ్యవసాయ శాఖకు విద్యుత్ ఖర్చులు మిగలడంతో పాటు అదనంగా ఉత్పత్తి చేసిన విద్యుత్తును విక్రయించుకునే అవకాశం, ఆర్థికంగా బలపడే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యవసాయ శాఖ సంస్థలపై సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటుకు సంబంధించి రెడ్కో సంస్థను సంప్రదించి అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో చేపట్టని అనేక సంక్షేమ పథకాలను రైతుల కోసం ప్రత్యేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు పెద్ద సంఖ్యలో పంపిణీ చేస్తుందని, విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నామని, ఈ విషయాలను రైతులకు వివరించాలని తరువాయి 2లో

## సెలవులు తప్పనిసరి చేస్తే ఎవరికీ ఉద్యోగాలు ఇవ్వరు

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

05

## నేటి నుంచి టెన్త్ పరీక్షలు

- ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహణ
- ఐదు నిమిషాల గ్రేస్ పీరియడ్
- అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని విద్యాశాఖ సూచన



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఉదయం 9:30గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష జరగనుంది. పరీక్ష సమయానికి ఐదు నిమిషాల గ్రేస్ పిరియడ్‌తో (9:35 గంటల వరకు) పరీక్ష కేంద్రంలోనికి అనుమతినిస్తారు. ట్రాఫిక్,ఇ తరాత్ర కారణాల నేపథ్యంలో విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలని, తద్వారా ఒత్తిడి తరువాయి 2లో



## తక్షణమే భూదాన యజ్ఞ బోర్డు

- భూదాన భూములను పేదలకు పంపిణీ చేయాలి
- ప్రభుత్వానికి తెలంగాణ సర్వోదయ మండలి సలహాదారు సయ్యద్ అజీజ్ పాషా విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో వెంటనే భూదాన యజ్ఞ బోర్డును ఏర్పాటు చేసి, భూదాన భూములను పేదలకు పంపిణీ చేయాలని తెలంగాణ సర్వోదయ మండలి సలహాదారు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, నాంపల్లిలోని తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర కార్యాలయంలో మండలి రాష్ట్ర అధ్యక్షులు ఆర్. శంకర్ నాయక్ అధ్యక్షతన శుక్రవారం సర్వోదయ మండలి రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సయ్యద్ అజీజ్ పాషా ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఆచార్య వినోబా భావే భూస్వాముల నుండి సేకరించిన దాదాపు 1,79,000 ఎకరాల భూమిని అప్పట్లో కొద్దిమంది నిరుపేదలకు పంపిణీ చేయగా, మిగిలిన వేలాది ఎకరాల భూమి అన్యాక్రంతమైందని వివరించారు. భూదాన యజ్ఞ బోర్డ్‌ను 2014 లోనే గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కొంతమంది పదవిలో లేకపోయినప్పటికీ అనధికారికంగా నకిలీ ప్రొసీడింగ్స్ జారీ చేసి భూదాన భూములను అమ్ముకుంటున్నారని, అలాంటి వారిపైన కఠినంగా క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. అన్యాక్రాంతమైన భూదాన భూములను తిరిగి ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని, వాటిని తమ ఆధీనంలో తరువాయి 12లో

### టిజిఎస్ ఆర్‌టిసిలో

## సమ్మె సైరన్

- జాయింట్ లేబర్ కమిషనర్‌కు నోటీసు అందజేసిన జెఎసి నేతలు
- ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసి కార్మికులు సమ్మె సైరన్ మోగించారు. ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు కార్మికుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ టిజిఎస్‌ఆర్‌టిసి ఇడిఇ వెంకన్న, జాయింట్ లేబర్ కమిషనర్ సునీతా గోపాల్‌దాస్‌లకు శుక్రవారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని బస్‌భవన్ దగ్గర జెఎసి నాయకులు సమావేశం నిర్వహించి, తమ సమస్యల పరిష్కారం కోసం ఆర్‌టిసి యాజమాన్యానికి, ప్రభుత్వానికి ఎన్ని మెమోరాండమ్‌లు సమర్పించినా స్పందన లేకపోవడంతో విధిలేని పరిస్థితిలో సమ్మె నోటీస్ ఇవ్వాల్సి వచ్చిందని తెలియజేశారు. ఈ సందర్భంగా టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2017 వేతన సవరణ ఇచ్చారని, కానీ ఆ వేతన సవరణకు సంబంధించిన ఎరియర్స్ నేటివరకు చెల్లింపు కాలేదన్నారు. వేతన సవరణలో జరగాల్సిన అలవెన్స్‌లు, ఫ్రింజ్ బెనిఫిట్స్ పెంచకపోవడం చాలా విచారకరమన్నారు. పాత అలవెన్స్‌లే ఇవ్వటం వలన ఆర్‌టిసి కార్మికులకు ఆర్థిక నష్టం జరిగిందని, తరువాయి 12లో

## బకాయిల్లో సగం చెల్లించండి

రాష్ట్రానికి హైకోర్టు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్



మిషన్ భగీరథ పనులకు సంబంధించి ఎన్‌సీసీ లిమిటెడ్‌కు చెల్లించాల్సిన బిల్లుల్లో కనీసం 50 శాతం మొత్తాన్ని ఈనెల 26లోగా చెల్లించాలని రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానియాకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. చెల్లింపులు జరగకపోతే ఈనెల 30న కోర్టుకు వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూరు, మహేశ్వరం నియోజకవర్గాలకు మిషన్ భగీరథ కింద చేపట్టిన తాగునీటి పథకాల నిర్మాణం, నిర్వహణ పనులకు సంబంధించిన రూ.180.17 కోట్ల బిల్లులు చెల్లించలేదని ఎన్‌సీసీ లిమిటెడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ టి.మాధవీ దేవి విచారణ జరిపి ఈ ఆదేశాలు ఇచ్చారు.

## దాడులు.. ప్రతిదాడులు..



అట్టుడుకుతున్న పశ్చిమాసియా

**వాషింగ్టన్:** అమెరికా—ఇరాన్ యుద్ధం మరింత తీవ్ర రూపం దాలుస్తోంది. ఒకవైపు అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ఇరాన్‌పై కొనసాగుతుండగా, మరోవైపు ఇరాన్ కూడా పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలోని నౌకాశ్రయాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై ప్రతి దాడులు చేస్తోంది. ఈ యుద్ధ ప్రభావంతో ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు మళ్లీ బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా పెరిగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తామని, పని పూర్తయ్యే వరకు ఆగబోమని ప్రకటించారు. ఇటీవలే తమ లక్ష్యాలను నెరవేరాయన్న ట్రంప్ హఠాత్తుగా ఇంకా చేయాల్సింది మిగిలే ఉందంటూ, యుద్ధం నిలిచిపోయే అవకాశాలు లేవని పరోక్షంగా పేర్కొన్నారు. కాగా, యుద్ధం మొదటి వారంలోనే అమెరికాకు సుమారు 11.3 బిలియన్ డాలర్లు ఖర్చయినట్లు పెంటగాన్ తెలిపింది. ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థ అంచనా ప్రకారం, ఇరాన్‌లో సుమారు 32 లక్షల మంది ప్రజలు తమ ఇళ్లను విడిచి వెళ్లాల్సి వచ్చింది. మరోవైపు లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైన్యం హెజ్బొల్లాకు సంబంధించిన భవనాలను ధ్వంసం చేయడంతో సుమారు 8 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. యుద్ధంలో ఇప్పటివరకు లెబనాన్‌లో 600 మందికి పైగా, ఇరాన్‌లో 1,300 మందికి పైగా మరణించారు. ఇజ్రాయెల్‌లో కూడా కొంత మంది ప్రాణాలు కోల్పోయారు. అమెరికా సైనికులలో కూడా కనీసం ఏడుగురు మరణించినట్లు సమాచారం. ఇక సౌదీ అరేబియాలో పరిస్థితి కూడా ఉద్రిక్తంగా ఉంది. దేశ రక్షణ శాఖ ప్రకారం తరువాయి 12లో

## భారీ జిఎస్‌టి కుంభకోణం

నకిలీ ఇన్వాయిస్‌లతో రూ.84.15 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసం – వ్యాపారి అరెస్ట్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో భారీ జిఎస్‌టి కుంభకోణం వెలుగులోకి వచ్చింది. నకిలీ ఇన్వాయిస్‌ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయల నష్టం కలిగించిన కేసులో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారిని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. అధికారుల వివరాల ప్రకారం, ఎస్‌కెజి ట్రేడింగ్ కంపెనీ యజమాని సందీప్‌కుమార్ గోయల్ అసలు సరుకు సరఫరా చేయకుండా కేవలం కాగితాలపై నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి భారీగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటిసి) పొందినట్లు దర్యాప్తులో తేలింది. ఈ విధంగా మొత్తం రూ.84.15 కోట్ల మేరకు పన్ను మినహాయింపులు పొందుతూ తరువాయి 2లో

## కామ్రేడ్ కొండిగారి రాములు కన్నుమూత



ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యేకు సిపిఐ నాయకుల ఘన నివాళి



03

## ఇరాక్‌లో కూలిన
# అమెరికా విమానం



**వాషింగ్టన్ :** అమెరికా సైన్యానికి చెందిన ఒక ఇంధన సరఫరా విమానం బోయింగ్ కెసి 135 స్ట్రాటోటాంకర్ ఇరాక్‌లో కూలిపోయింది. ఈ విషయం గురించి యునైటెడ్ స్టేట్స్ సెంట్రల్ కమాండ్ (సిఇఎన్‌టిసిఒఎం) అధికారికంగా ప్రకటించింది. ఈ విమానం ఇరాన్‌పై జరుగుతున్న సైనిక చర్యల్లో భాగంగా పనిచేస్తోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఈ ఘటన పశ్చిమ ఇరాక్‌లో చోటు చేసుకుంది. రెండు విమానాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొనగా, వాటిలో ఒకటి సురక్షితంగా ల్యాండ్ అయింది. మరో విమానం మాత్రం కూలిపోయింది. ఆ విమానంలో కనీసం ఐదుగురు సిబ్బంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. అయితే ఎవరైనా మరణించారా లేదా గాయపడ్డారా అనే విషయం ఇంకా స్పష్టంగా తెలియలేదు. సైన్యం ఇచ్చిన సమాచారం ప్రకారం, ఈ ప్రమాదం శత్రు దాడి వల్ల లేదా తమ సైన్యం పొరపాటుగా చేసిన కాల్పుల వల్ల జరగలేదు. ఇది యుద్ధ చర్యల సమయంలో జరిగిన విమాన ప్రమాదంగా భావిస్తున్నారు. ఈ విమానం అమెరికా వైమానిక దళానికి చాలా కాలంగా ఉపయోగంలో ఉన్న ట్యాంకర్ విమానాల్లో ఒకటి. ఇది బోయింగ్ 707 విమాన నమూనా ఆధారంగా తయారైంది. దాదాపు 60 సంవత్సరాలుగా సేవలందిస్తోంది. దీని ప్రధాన పని గాల్లోనే యుద్ధ విమానాలకు ఇంధనం నింపడం. ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత అమెరికా సైన్యానికి ఇది నాలుగో విమాన ప్రమాదం. గత వారం ఎఫ్15ఇ స్ట్రయిక్ ఈగిల్ యుద్ధవిమానాలు మూడు పొరపాటున మిత్రదేశమైన కువైట్ జరిపిన కాల్పుల్లో కూలిపోయాయి. అయితే ఆ ఘటనలో ఆరు మంది పైలట్లు సురక్షితంగా బయటపడ్డారు. ఇప్పటివరకు ఈ యుద్ధంలో అమెరికాకు కూడా నష్టాలు జరిగాయి. పెంటగాన్ సమాచారం ప్రకారం, కనీసం ఏడుగురు అమెరికా సైనికులు మరణించగా సుమారు 140 మంది గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైన తర్వాత పరిస్థితి మరింత తీవ్రమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఈ యుద్ధం కొనసాగితే ఇంకా ప్రాణనష్టం జరిగే అవకాశముందని ఇప్పటికే ప్రకటించారు. కాగా, ప్రస్తుతం తాజా విమాన ప్రమాదంపై దర్యాప్తు కొనసాగుతోంది

# విస్తరిస్తున్న ఇరాన్ యుద్ధం!

**దుబాయ్:** ఇరాన్ యుద్ధం మరింత విస్తరిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేయడం ఇందుకు ప్రధాన కారణం. ఇదే సమయంలో, గల్ఫ్ ప్రాంతంలోని అనేక దేశాలపై ఇరాన్ డ్రోన్ దాడులు జరిపిందని సమాచారం. ఇరాన్ శుక్రవారం ఉదయం సౌదీ అరేబియాపై డజన్ల కొద్దీ డ్రోన్లతో విరుచుకుపడింది. సౌదీ అధికారులు వాటిలో సుమారు 50 డ్రోన్లను కూల్చివేసినట్లు తెలిపారు. అలాగే ఒమాన్‌లోని సోహార్ పరిశ్రమ ప్రాంతంలో రెండు డ్రోన్లు పడిపోవడంతో ఇద్దరు మరణించారు. దుబాయ్‌లో కూడా దాడుల ప్రమాదాన్ని సూచించే అలారం సైరన్లు మోగాయి. దుబాయ్ శివార్లలోని ఒక పరిశ్రమ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. కూల్చివేసిన డ్రోన్ అవశేషాలు ఢీకొనడంతో దుబాయ్ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సెంటర్ భవనాన్ని కొంత నష్టం జరిగింది. ఈ ప్రాంతం అంతర్జాతీయ బ్యాంకులు, పెట్టుబడి సంస్థలు ఉన్న కీలక ఆర్థిక కేంద్రం. ఇక మధ్య ప్రాచ్యంలో యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చింది. ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంలో హెజ్బొల్లా రాకెట్లతో దాడిఉ చేసింది. ఈ ఘటనలో దాదాపు 60 మంది గాయపడ్డారు. అదే సమయంలో బీరూట్‌లో ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఒకరు మరణించారు. ఈ దాడుల మధ్య ఆయతుల్లా మొజ్తాబా ఖమేనీ గల్ఫ్ దేశాలకు హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా సైనిక స్థావరాలను తమ దేశాల్లో నిల్వ చేయవద్దని, లేకపోతే ఇరాన్ ప్రతీకారం తప్పదని స్పష్టం చేశారు. ఈ పరిణామాలకు ప్రతిస్పందనగా ట్రంప్ సోషల్ మీడియాలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఇప్పటికే ఇరాన్‌పై వేల సంఖ్యలో లక్ష్యాలను ధ్వంసం చేసిందని, ఇంకా భారీ ప్రతీకారం ఉండబోతుందని హెచ్చరించారు. ఇలావుంటే, యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి మార్గాన్ని ఇరాన్ అడ్డుకుంటుండటంతో అంతర్జాతీయ చమురు ధరలు భారీగా పెరిగాయి. ఈ ఈ యుద్ధం కేవలం ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య పరిమితం కాకుండా గల్ఫ్ దేశాలు, యూరోప్ సైనిక బలగాలు కూడా ఇందులో చిక్కుకునే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో మధ్యప్రాచ్యంలో పెద్ద ప్రాంతీయ యుద్ధం ప్రమాదం పెరుగుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.




ఇరాన్‌పై యుద్ధానికి వ్యతిరేకంగా అమెరికాలోని పలు రాష్ట్రాల్లో నిరసన జ్వాలలు ఎగసిపడుతున్నాయి. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై యుద్ధం ప్రకటించిన అధ్యక్షుడు ట్రంప్‌కు వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు 'యుద్ధం వద్దు' అని ప్లకార్డులు పట్టుకొని ర్యాలీలు నిర్వహిస్తున్నారు. నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు.

## టెహ్రాన్‌లో భారీ పేలుడు



**దుబాయ్:** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు చోటుచేసుకున్నట్లు ప్రభుత్వ టెలివిజన్ వెల్లడించింది. ఈ ఘటన నగరంలోని ప్రముఖ ప్రదేశమైన ఫిర్దౌసీ స్క్వేర్ వద్ద జరిగింది. ఆ సమయంలో అక్కడ వేలాది మంది ప్రజలు, ప్రతి సంవత్సరం మాదిరిగానే 'కుద్స్ డే' ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. కుద్స్ డే రోజును సాధారణంగా పాలస్తీనా ప్రజలకు మద్దతు ప్రకటించే కార్యక్రమంగా ఇరాన్‌లో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహిస్తారు. ఫిర్దౌసీ స్క్వేర్ ప్రాంతం యూనివర్సిటీ ఆఫ్ టెహ్రాన్ సమీపంలోని ఎంగెలాబ్ వీధికి దగ్గరగా ఉండటం వల్ల ఆ ప్రాంతం ఈ ర్యాలీల ప్రధాన కేంద్రంగా మారింది. కాగా, అక్కడ తాజాగా జరిగిన పేలుడుకు గల కారణం వెంటనే స్పష్టంగా తెలియలేదు. కానీ, పేలుడు జరగడానికి కొద్ది సమయం ముందు ఆ ప్రాంతంపై దాడి చేసే అవకాశం ఉందని ఇజ్రాయెల్ హెచ్చరించినట్లు సమాచారం. అదే సమయంలో టెహ్రాన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్ర వైమానిక దాడులు కూడా కొనసాగుతున్నాయి. ఈ దాడులు జరుగుతున్నప్పటికీ వేలాది మంది ప్రజలు ర్యాలీల్లో పాల్గొన్నారు. వారు ఇజ్రాయెల్, అమెరికా వ్యతిరేక నినాదాలు చేస్తూ వీధుల్లోకి వచ్చారు. యుద్ధ పరిస్థితుల్లో కూడా ఈ ప్రదర్శనలు ఆగకపోవడం, ఇరాన్‌లో ఉన్న రాజకీయ, భావోద్వేగ వాతావరణాన్ని చూపుతోంది. అయితే ఈ ఘటనకు అసలు కారణం ఏమిటి అనే విషయం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఇది వైమానిక దాడి ఫలితమా, లేక ఇతర కారణాల వల్ల జరిగిన పేలుడా అనే దానిపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం టెహ్రాన్ నగరంలో భద్రతా పరిస్థితులు అత్యంత ఉద్రిక్తంగా ఉన్నాయని సమాచారం.

## యూదుల ప్రార్థనా మందిరంపై దాడి
### మిచిగన్ రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు

**మిచిగన్:** అమెరికాలోని మిచిగన్ రాష్ట్రంలో ఒక సైనాగాగ్ (యూదుల ప్రార్థనా మందిరం)పై దాడి జరిగింది. తుపాకీతో వచ్చిన ఒక వ్యక్తి తన కారును నేరుగా భవనంలోకి ఢీకొట్టడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటన వెస్ట్ బూమ్‌ఫీల్డ్ టౌన్‌షిప్‌లో చోటు చేసుకుంది. అక్కడి ప్రముఖ యూదుల ప్రార్థనా మందిరం 'టెంపుల్ ఇజ్రాయెల్'లోకి ఒక వ్యక్తి చొరబడ్డాడు. కారులో వచ్చి, సైనాగాగ్ ప్రధాన ద్వారాలను ఢీకొట్టి లోపలికి వెళ్లాడు. కారు హాల్‌లోకి ప్రవేశించిన వెంటనే మంటలు చెలరేగాయి. భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి కాల్పులు జరిపారు. చివరకు ఆ దాడి చేసిన వ్యక్తి తన కారులోనే మృతిచెందాడు. ఈ ఘటనలో సైనాగాగ్‌లో ఉన్న సిబ్బంది లేదా అక్కడ చదువుతున్న చిన్నారులకు ఎలాంటి గాయాలు కాలేదు. అక్కడ ఉన్న బాలల కేంద్రంలో సుమారు 140 మంది పిల్లలు ఉన్నారు. వారిని ఉపాధ్యాయులు ప్రశాంతంగా ఉంచి సురక్షితంగా బయటకు తరలించారు. ఈ సంఘటనను భయంకరమై దాడిగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ అభివర్ణించారు. కాగా, దాడి చేసిన వ్యక్తిని లెబనాన్‌లో జన్మించిన ఐమన్ మ హమ్మ్ ఘజాలీగా పోలీస్ అధికారులు గుర్తించారు. వారి అందించిన సమాచారం ప్రకారం, అతను గతంలో అమెరికా సైన్యంలోని నేషనల్ గార్డ్‌లో సభ్యుడిగా పనిచేశాడు. 2016లో అతను ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్)కు మద్దతు ఇవ్వడానికి ప్రయత్నించిన కేసులో దోషిగా ఒప్పుకొని శిక్ష అనుభవించాడు. ఆ కేసులో అతనికి 11 సంవత్సరాల జైలు శిక్ష పడింది. 2024 డిసెంబరులో అతను జైలు నుంచి విడుదలయ్యాడు.

## ఇరాన్ నాయకుల సందేశాలు ప్రసారం చేస్తారా?
### సిఎన్‌ఎన్‌పై అమెరికా ప్రభుత్వ ఆగ్రహం




**వాషింగ్టన్:** అమెరికా–ఇరాన్ యుద్ధ ఉద్రిక్తతల మధ్య మీడియా పాత్రపై కొత్త వివాదం మొదలైంది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం, ప్రముఖ వార్తా ఛానల్ సిఎన్‌ఎన్‌పై తీవ్ర విమర్శలు చేసింది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ చేసిన ప్రసంగంలోని ఒక భాగాన్ని సిఎన్‌ఎన్ ప్రసారం చేయడమే ఇందుకు కారణం. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ఒక వైమానిక దాడిలో మరణించిన తర్వాత, ఆయన స్థానంలో మొజ్తబా ఖమేనీ బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన చేసిన తొలి ప్రజా సందేశంలో అమెరికా దాడులను తీవ్రంగా విమర్శిస్తూ ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించారు. ఈ సందేశంలో కొంత భాగాన్ని సిఎన్‌ఎన్ ప్రసారం చేసింది. దీనిపై వైట్ హౌస్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ ప్రభుత్వ టివి ప్రసారాన్ని నాలుగు నిమిషాల పాటు ఆపకుండా ప్రసారం చేయడం తప్పని సోషల్ మీడియాలో విమర్శించింది. సిఎన్‌ఎన్‌పై అమెరికా ప్రభుత్వం ఈ విధంగా స్పందించడం ఇదే మొదటిసారి కాదు. రెండు రోజుల ముందు కూడా ట్రంప్ ప్రభుత్వ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చెవాంగ్ సిఎన్‌ఎన్‌పై విమర్శలు చేశారు. ఆ ఛానల్ యాంకర్ ఎరిన్ బర్నెట్, మాజీ ఇరాన్ అణు చర్చల ప్రతినిధి హొస్సేన్ మొసవియన్‌తో ఇంటర్వ్యూ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇరాన్ వాదనలను సిఎన్‌ఎన్ పునరావృతం చేస్తోందని ఆరోపించారు. అయితే సిఎన్‌ఎన్ తమ చర్యను సమర్థించుకుంది. యుద్ధ పరిస్థితుల్లో ప్రత్యర్థి దేశ నాయకులు ఏమి చెబుతున్నారో తెలుసుకోవడం ప్రజలకు అవసరమని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు యుద్ధం ఎటువైపు సాగుతుందో అర్థం కావడానికి ఈ సమాచారానికి వార్తా విలువ ఉందని పేర్కొంది. అంతేగాక, అసోసియేటెడ్ ప్రెస్, ది న్యూయార్క్ టైమ్స్ వంటి ఇతర మీడియా సంస్థలు కూడా ఖమేనీ వ్యాఖ్యలను ప్రచురించాయని గుర్తుచేసింది. కాగా, ఈ సంఘటన, యుద్ధ సమయంలో జర్నలిజం పాత్ర ఏమిటి? అనే ఒక పెద్ద ప్రశ్నను తెరపైకి తెచ్చింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ రెండింటి మధ్య సమతౌల్యం పాటించాల్సిన క్లిష్ట బాధ్యతను మీడియా ఎదుర్కొంటోంది.

## హెచ్‌సిఎ నిధుల దుర్వినియోగంపై మంత్రి రాజీనామా చేయాలి : టిసిఎ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ క్రికెట్‌లో పెద్ద ఎత్తున నిధుల మళ్లింపు జరిగిందని ఆరోపిస్తూ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) సంచలన ఆరోపణలు చేసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)తో పాటు మంత్రి జి.వివేక్‌ల మధ్య సంబంధం ఉందని పేర్కొంటూ, క్రికెట్ నిధుల వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ టిసిఎ చేసింది. టిసిఎ ప్రధాన కార్యదర్శి ధర్మా గురువారెడ్డి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో, జిల్లాల్లో క్రికెట్ మౌలిక సదుపాయాల కోసం రూ.64 కోట్లు ఖర్చు చేస్తానని మంత్రి చేసిన వ్యాఖ్యలు ఆ డబ్బు అక్రమంగా తీసుకున్నట్టు పరో క్ష అంగీకారమేనని ఆరోపించారు. క్రికెట్ అభివృద్ధి కోసం బిసిసిఐ ఇచ్చిన నిధులను రాజకీయ విరాళాలుగా చూపలేమని స్పష్టం చేశారు.ఈ మేరకు మంత్రి జి.వివేక్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ పూర్తయ్యే వరకు ఆయన రాజీనామా చేయాలని ఆయ న డిమాండ్ చేశారు.

**రూ.64 కోట్లు తిరిగి ఇవ్వాలని డిమాండ్**

హెచ్‌సిఎ నుంచి తీసుకున్నట్లు ఆరోపిస్తున్న రూ.64 కోట్లను వెంటనే తిరిగి సంస్థ ఖా తాలో జమ చేయాలని టిసిఎ డి మాండ్ చేసింది. అనంతరం ఆ నిధులను బిసిసిఐ పర్యవేక్షణలో పారదర్శకంగా జిల్లాల క్రికెట్ అభివృద్ధికి వినియోగించాలన్నారు. మొదట డబ్బు తిరిగి ఇవ్వాలి, తరువాత అభివృద్ధి గురించి మా ట్లాడాలని ఆయన పేర్కొన్నారు.

**ఆర్బిట్రేషన్ కేసులో రూ.69 కోట్ల నష్టం**

విశాఖ ఇండస్ట్రీ, హెచ్‌సిఎ మధ్య జరిగిన ఆర్బిట్రేషన్ కేసు ఉద్దేశపూర్వకంగా తప్పుగా నిర్వహించబడిందని ఆయన ఆరోపించారు. దీని వల్ల క్రికెట్ అభివృద్ధి కోసం వినియోగించాల్సిన సుమారు రూ.69 కోట్ల నష్టం జరిగిందని తెలిపారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు నియమించిన కమిటీలైన జస్టిస్ ఎన్.ఎ.కక్రూ, జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు తమ నివేదికల్లో ప్రస్తావించారని ఆయన పేర్కొన్నారు. సంస్కరణలు అమలు చేయాలని సూచించినప్పటికీ హెచ్‌సిఎ వాటిని కోర్టులోనే సవాలు చేసిందని విమర్శించారు. అలాగే బిసిసిఐ నిబంధనలకు విరుద్ధంగా హెచ్‌సిఎ అనుమతి లేని టీ20 లీగ్ నిర్వహించిందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారం ప్రస్తుతం హైకోర్టులో విచారణలో ఉందని తెలిపారు.

## భవిష్యత్ తరాలకోసమే

(మొదటి పేజీ తరువాయి)

(ఎంఆర్‌డిసిఎల్) ఎం.డి నర్సింహారెడ్డి పవర్ పాయింట్ ప్రజెంషన్ ద్వారా వివరించారు. అనంతరం సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన వాళ్లు ఎందుకు మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటున్నారన్నారు. అభివృద్ధిని అడ్డుకోవడం సమస్యకు పరిష్కారం కాదని, ఎందుకు అడ్డుకుంటున్నారో కారణం చెప్పాలన్నారు. పాలకులు మారినా నగర అభివృద్ధి ఆగలేదని, 1994 నుంచి ఇప్పటి వరకు పరిపాలనలో పాలసీ పెరాలసిస్ ఎప్పుడూ రాలేదని, మంచి పాలసీలను తమ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని వివరించారు. మూసా, ఈసా నదుల సంగమం వద్ద మహాత్మా గాంధీ ఆనాడు అస్థికలు కలిపారని, అంతటి చరిత్ర ఉన్న బాపూ ఘాట్‌ను ఎంతమంది పర్యాటకులు సందర్శిస్తున్నారని ప్రశ్నించారు. కాలుష్యంతో మూసీ నది విషతుల్యంగా మారిందని, మానవ తప్పిదాలతో నల్లగొండ జిల్లా ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**అడ్డుకునేవారు 'మూసీ' వద్ద మూడునెలలు ఉండండి**

మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకుంటున్న వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి మూడు నెలల పాటు మూసీ పరీవాహక ప్రాంతంలో నివసించగలరా? అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అలా నివాసం ఉంటానంటే వారికి అన్ని సౌకర్యాలతో కూడిన కంటైనర్ హౌస్‌ను నిర్మించి ఇస్తామన్నారు. మూసీకి, హైదరాబాద్ నగరానికి ఎంతో గొప్ప చరిత్ర ఉందని, రాజకీయ ప్రయోజనాల కోసం ఆ చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా?, లేదా మూసీనదితో పాటు హైదరాబాద్ నగరాన్ని పునరుజీవింపజేసుకుందామా అని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవనం అంటే తమ సంస్కృతిని, చరిత్రను కాపాడుకోవడమన్నారు. మూసీ పునరుజ్జీవం జరిగితే కాంగ్రెస్‌కు, రేవంత్ రెడ్డికి మంచి పేరు వస్తుందని, తద్వారా వారికి అధికారం అనేది ఒక కల గానే మిగులుతుందనే ఉద్దేశంతోనే ఈ ప్రాజెక్ట్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని సిఎం అన్నారు. అందుకే వారి కడుపులో కుళ్ళు, మాటల్లో విషం, చూపుల్లో పగతో ఈ ప్రాజెక్ట్‌ను అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు.

**పేదల పట్ల శత్రుత్వంగా ఎందుకు ఉంటాం?**

జన ఆందోళన్ సంఘంతో డిప్యూటీ సిఎం మాట్లాడారని, నిర్వాసితులకు తమ ప్రభుత్వం ఇండ్లు నిర్మించే ప్రయత్నం చేస్తోందని వారికి వివరించినట్టు సిఎం తెలిపారు. పేదలకు మేలు చేయడానికే తమ ప్రభుత్వం ఉందన్నారు. తాము పేదలతో ఎందుకు శత్రుత్వంగా ఉంటామని, వారు ఎన్నుకుంటేనే తాను సిఎం అయ్యానన్నారు. తనకు మరోసారి సిఎం కావాలని, కాంగ్రెస్ మరోసారి అధికారంలోనికి రావాలనే ఆలోచనఉండదా?, పేద వర్గాలతో శత్రుత్వం పెంచుకుంటే అధికారంలోనికి తిరిగి వస్తామా? అని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రభుత్వం రియల్ ఎస్టేట్, పర్యాటకం అభివృద్ధి చేస్తే తప్పు ఏముందని ప్రశ్నించారు. ప్రపంచమంతా హైదరాబాద్ వైపు చూస్తోందన్నారు. యుద్ధం నేపథ్యంలో దుబాయిలో ఉండే తెలంగాణ వారు తిరిగి హైదరాబాద్‌కు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి నర్సింహ, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లితో పాటు ఎంఐఎం, కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు, ఎంపిలు, మేధావులు, పర్యావరణ నిపుణులు, అర్బన్ ప్లానర్లు, ఆర్కిటెక్టులు, వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. కాగా ఈ సమావేశంలో మూసీ నది పునరుజ్జీవనం,రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదిత ప్రణాళికలను ఆవిష్కరించారు.

**'మూసీ' నిర్వాసితులు అభివృద్ధి చెందొద్దా..?**

ఇప్పటికే ఎఐ రాకతో వైట్ కాలర్స్ ఉద్యోగాలు పోతున్నాయని,అలాంటిది పేదలకు సరైన మౌలిక వసతులు కల్పించి, వారికి బ్లూ కాలర్ జాబ్స్‌ను సృష్టించొద్దా?, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించొద్దా?, 'మూసీ' వద్ద పర్యాటక అభివృద్ధి , నైట్ ఎకానమి అభివృద్ధి జరుగొద్దా అని సిఎం ప్రశ్నించారు. అభివృద్ధిని అడ్డుకుని ఇంకా వెనక్కి రాతి యుగాల వైపు వెళ్ళిపోదామాఅని నిలదీశారు. బ్యూటిఫికేషన్,లూటిఫికేషన్ అని కొందరు మాట్లాడుతున్నారని,రూ 5 వేల కోట్లతో గాంధీ విగ్రహం అంటూ సొంత తెలివి ప్రదర్శిస్తున్నారని సిఎం మండిపడ్డారు. లోకకళ్యాణం కోసం చేసే పనులకు సహకరించకపోయినప్పటికీ అడ్డుకునే ప్రయత్నం చేయవద్దని సూచించారు.

## సమాధానాలు సమర్పించాలి: సిఎస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈ నెల 16 నుండి అసెం బ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నందున ఇప్పటి వరకు వచ్చిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు వెంటనే సమర్పించాలని అన్ని విభాగాల ఉన్నతాధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు రావాల్సిన సమాధానాలు, సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులతో సిఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ శాసన మండలి, శాసనసభ సమావేశాల నేపథ్యంలో సభ్యులు అడిగిన ప్రశ్నలన్నింటికీ ఈ నెల 14లోగా సమాధానాలు పంపించాలన్నారు. ప్రధానంగా, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ పరిపాలన, ఇంధనశాఖ, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించి అధికంగా ప్రశ్నలున్నాయని, వీటన్నింటికీ వెంటనే సమాధానాలు పంపాలన్నారు. బడ్జెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమవుతాయన్నారు. బడ్జెట్ సమావేశాల నిర్వహణపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆవిష్కరణలు, పెట్టుబడులకు
# 'గ్లోబల్ హబ్'గా హైదరాబాద్
### మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాలతో పాటు ఫార్మా, డిఫెన్స్, ఏవియేషన్ పరిశ్రమలకు కూడా నగరం కీలక వేదికగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణలకు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందని చెప్పారు. బ్రిక్స్ దేశాల్లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులకు అనువైన వాతావరణం, ఆధునిక సాంకేతికతల ప్రభావంపై అధ్యయనం చేయడానికి విచ్చేసిన జర్మన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసింది. 'గ్లోబల్ బ్రిడ్జెస్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. తెలంగాణలో ఉన్న పారిశ్రామిక అవకాశాలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి వారితో చర్చించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా సవాళ్లను ఎదుర్కొనేందుకు వినూత్న విధానాలను అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే ముందంజలో ఉందని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు తెలిపారు. పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా, నీటి లభ్యతలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వాల మార్పుతో సంబంధం లేకుండా మెరుగైన పారిశ్రామిక విధానాలను కొనసాగిస్తూ పరిశ్రమలకు స్థిరత్వాన్ని కల్పిస్తున్నామని వివరించారు. భౌగోళికంగా భారతదేశం నడిబొడ్డున ఉన్న హైదరాబాద్ ఏడాది పొడవునా ఆహ్లాదకర వాతావరణం, విభిన్న సంస్కృతుల సమ్మేళనంతో కూడిన కాస్మోపాలిటన్ జీవనశైలితో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే వారికి 'సొంత ఊరు' అనే భావన కలిగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. నగరం దక్షిణ భాగంలో ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు వేగంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటవుతున్న ఎఐ సిటీ, నెట్ జీరో సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నా రు. తెలంగాణలో అపారమైన మానవ వనరులు, టాలెంట్ పూల్ అందుబాటులో ఉండటంతో పరిశ్రమలకు నిపుణుల కొరత తలెత్తే సమస్యే ఉండదని స్పష్టం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

ఈ సమావేశంలో జర్మన్ ప్రతినిధి బృందం సభ్యులు డా.స్టెఫాన్ ట్రేగర్, డా.క్రిస్టియన్ అల్టెన్ హోఫెన్, ఫ్రాంక్ బీర్ హోస్ట్, అలెగ్జాండర్ వాన్ క్రామ్, మాల్టె హోహ్ ఫీల్డ్ ఫిలిప్ మేయర్ హోఫర్, మ్యాక్స్ మిల్లన్ వ్యాన్ లెయర్ తదిరులు పాల్గొన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి కూడా హాజరయ్యారు.

## భారీ జిఎస్‌టి కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి భారీ నష్టం కలిగించినట్లు అధికారులు వెల్లడించారు.

**నకిలీ లావాదేవీలతో మోసం**

కమర్షియల్ ట్యాక్సెస్ శాఖకు వచ్చిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా అధికారులు లావాదేవీలను పరిశీలించారు. సరుకుల అసలు సరఫరా లేకుండానే ఇన్వాయిస్‌లు జారీ చేసి వాటి ఆధారంగా ఐటిసి క్లెయిమ్ చేసినట్లు గుర్తించారు. ఈ నకిలీ లావాదేవీల ద్వారా పెద్ద మొత్తంలో పన్ను మినహాయింపులు పొందినట్లు విచారణలో బయటపడింది. దర్యాప్తులో గోయల్ మరికొన్ని సంస్థల పేర్లతో కూడా ఇదే తరహా మోసాలకు పాల్పడ్డాడని అధికారులు తెలిపారు. హెచ్‌ఎఫ్‌సి స్టీల్ ట్యూబ్స్, వాల్యూ విజయ్ ఇండస్ట్రియల్ నీడ్ ఎల్‌ఎల్‌పి సంస్థల పేర్లతో కూడా సరుకులు అందుకోకుండా ఐటిసి క్లెయిమ్ చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో సంబంధిత సంస్థల జిఎస్‌టి రిజిస్ట్రేషన్లను రద్దు చేశారు.ఈ అక్రమాలపై కేసు నమోదు చేసి సందీప్ కుమార్ గోయల్‌ను అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం అతడిని జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు అధికారులు తెలిపారు.ఈ కేసులో మరికొందరు వ్యక్తులు లేదా సంస్థల ప్రమేయం ఉందా అనే కోణంలో అధికారులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. నకిలీ ఇన్వాయిస్‌లు, ఫేక్ ఐటిసి క్లెయిమ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని వాణిజ్య పన్నుల శాఖ స్పష్టం చేసింది.

## నేటి నుంచి టెన్త్ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఉండబోదని పాఠశాల విద్యాశాఖ సూచించింది. శనివారం ప్రారంభంకానున్న పరీక్షలు ఏప్రిల్ 16వ తేదీన ముగియనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 2,676 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలకు మొత్తం 5,28,239 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 5,17,727 మంది, ఒకసారి ఫెయిల్ అయిన వారు 10,512 మంది ఉండగా, ప్రభుత్వ పాఠశాల నుంచి 2,07,573 మంది, సంక్షేమ పాఠశాలల నుంచి 60,139 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 2,50,015 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల్లో ఎటువంటి కాపీయింగ్ జరగకుండా ఉండేందుకు 144 ఫ్లయింగ్ స్క్వాడ్లను, వాటితో పాటు సిట్టింగ్ స్క్వాడ్లను కూడా నియమించారు. పరీక్ష కేంద్రంలోనికి ఫోన్లను, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతిచించబోమని ఇది వరకే విద్యాశాఖ వెల్లడించింది.

**ఆందోళన..ఒత్తిడి వద్దు : సిఎం రేవంత్ రెడ్డి**

రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలకు హాజరుకాబోతున్న లక్షలాది మంది విద్యార్థులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తుకు తొలిమెట్టుగా ఈ పరీక్షలను ప్రతి విద్యార్థి ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని కోరారు. భయం, ఆందోళన, ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన మనసుతో పరీక్షలు రాస్తే, తప్పకుండా మంచి ఫలితాలు సాధించవచ్చని, విద్యార్థులలో ఉన్న ప్రతిభను నమ్ముకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సిఎం విద్యార్థులకు పిలుపునిచ్చారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయిన నేపథ్యంలో ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి ఉజ్వలమైన భవిష్యత్తుకు ముందడుగు వేయాలని ఆయన ఆకాంక్షించారు.

**ప్రశాతంగా పరీక్షలు రాయండి: మహేష్ కుమార్ గౌడ్**

పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పదవ తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి విద్యా ప్రస్థానంలో కీలకమైన మైలురాయిగా అభివర్ణించారు. భయం, ఆందోళనలకు లోనుకాకుండా ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు.

**పరీక్ష షెడ్యూల్..**

మార్చి 14 ప్రథమ భాషా.
మార్చి 18 సెకండ్ లాంగ్వేజ్.
మార్చి 23 థర్డ్ లాంగ్వేజ్
మార్చి 28 గణితం.
ఏప్రిల్ 2 సైన్సు పార్ట్1 ఫిజిక్స్
ఏప్రిల్ 7 బయాలజీ.
ఏప్రిల్ 13 సాంఘిక శాస్త్రం.
ఏప్రిల్ 15 ఒకేషనల్ కోర్సు (వృత్తివిద్యా కోర్సు)
పేపర్1 భాషా పరీక్ష.
ఏప్రిల్ 16 ఒకేషనల్ కోర్సు (వృత్తి విద్యా కోర్సు)
పేపర్2 లాంగ్వేజ్ పరీక్ష.

## ఆందోళనొద్దు

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.రాష్ట్రంలో ఎల్‌పిజి గ్యాస్ సరఫరా అంశంలో గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లాల కలెక్టర్లు, ఎస్.పిలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో లేని పోనీ అపోహలను సృష్టించి వారిని గందరగోళంలో పడేసే విధంగా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులకు, విద్యా సంస్థలకు,వృద్ధాశ్రమలకు,ప్రభుత్వ సంస్థలకు ప్రాధన్యత క్రమంలో గ్యాస్‌ను సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో 810 ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్టు ఎక్కడా నమోదు కాలేదన్నారు. కృత్రిమంగా గ్యాస్ కొరతను సృష్టించేందుకుసోషల్ మీడియా వేదిక ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజువారిగా 72 శాతం బుకింగ్స్ జరుగుతున్నాయని, అయినప్పటికీ గృహ, విద్యా సంస్థలకు, ఆస్పత్రులకు, వృద్ధాశ్రమలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

**బ్లాక్ చేస్తే కఠిన చర్యలు :**

అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే, ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించబోదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. తాజగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేసి, మళ్లించడం ,బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడినందుకు ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు.ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్లు ఇదే విదంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు,ఎస్.పిలకు,పోలీస్ కమిషనర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

**'కంట్రోల్ సెంటర్'..కలెక్టర్ల అధ్యక్షతన ప్రత్యేక కమిటీలు**

రాష్ట్ర వ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆయా జిల్లాల్లో కలెక్టర్ల అధ్యక్షతన ప్రత్యేక అధికారుల కమిటీ ఏర్పాటు చేసి, రోజువారీ నిల్వల సరఫరా, వాటి పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి ఎల్‌పిజిని బుక్ చేసుకోవాలని ఆయన గ్యాస్ వినియోగదారులకు సూచించారు. అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవొద్దని,గృహా వినియోగ దారులకు సరిపడా గ్యాస సరఫరా చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

# మార్పుకు గెలుపు నాంది పలకాలి

## సమాజ వికాసం కోసం ప్రజాప్రతినిధులు పనిచేయాలి
## శిక్షణా తరగతుల్లో ప్రొ.కోదండరామ్



ప్రజాపక్షం/ఖమ్మం/భద్రాద్రి కొత్తగూడెం : ప్రజాస్వామిక పద్ధతుల్లో సాధించిన గెలుపు సమాజ మార్పుకు నాంది పలకాలని ప్రొ.కోదండరామ్ అన్నారు. రాజ్యాంగానికి లోబడి జవాబుదారీ పాలనను అందిస్తూ ప్రజల హక్కులను రక్షించడంతో పాటు పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భారతకమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పక్షాన గెలుపొందిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఉపసర్పంచుల రెండు రోజుల రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరం పాల్వంచ సుగుణా గార్డెన్స్‌లో ప్రారంభమైంది. సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ గణేష్ అధ్యక్షవర్గంగా వ్యవహరించిన శిక్షణా తరగతుల్లో కోదండరామ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు ముఖ్యంగా కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులకు రాజకీయ దృక్పథంతో పాటు ప్రత్యేక లక్ష్యం ఉండాలని, కమ్యూనిస్టు ప్రజాప్రతినిధుల పనితీరు ఉద్యమాన్ని నిలబెట్టాలని సూచించారు. ఒకప్పుడు ప్రజాప్రభుత్వాలు ఉండేవి కావని, దేవుని అనుగ్రహం ఉన్న వారు మాత్రమే పాలకులు అవుతారని నమ్మేవారని, కానీ రానురానూ వచ్చిన మార్పుతో దేవునితో సంబంధం లేని మానవతావాదంతో ఒక వ్యవస్థ రూపుదిద్దుకుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం పనిచేసే విధంగా స్థానిక ప్రభుత్వాలు రూపుదిద్దుకున్నాయని కోదండరామ్ తెలిపారు. మనల్ని మనమే పరిపాలించుకునే విధానంతోపాటు అధికారమార్పిడి కూడా ప్రారంభమైందన్నారు. ఓట్లు వేసే అధికారం రావడం, అన్నింటికీ మించి సార్వజనీన వయోజన ఓటు హక్కుతో మార్పులు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. రాజ్యాంగానికి లోబడి పాలన జవాబుదారీతనంతో కూడిందై ఉండాలన్నారు. కీలక నిర్ణయాల్లో ప్రజలకు భాగస్వామ్యం కల్పిచడం ద్వారా ఓ మంచిపాలన అందించొచ్చని ఆయన సూచించారు. ప్రజలను భాగస్వామ్యం చేసే ప్రక్రియలో భాగంగానే కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయన్నారు.



1992వ సం.లో వచ్చిన 73,74 రాజ్యాంగ సవరణలు స్థానిక సంస్థలకు కొత్త అధికారాలను తీసుకొచ్చాయని, నేరుగా నిధులు రావడంతో పాటు ఎన్నికల నిర్వహణ తప్పనిసరైందని ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీల్లో వ్యత్యాసాలు లేనివిధంగా అందరికీ సమాన హక్కులు కల్పించేందుకు కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. మార్పు తథ్యమని, 1965వ సం. తర్వాత రైతాంగ ఉద్యమాల ఫలితంగా ప్రశ్నించే తత్వం ప్రారంభమైందని, ఆధిపత్య ధోరణి స్థానే, రాజకీయ వ్యవస్థ రూపుదిద్దుకుందన్నారు. స్థానికంగా ఎన్నికైన వారు అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించాలని, ప్రధానంగా నిధుల వినియోగంలో పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పుకు కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు కృషిచేయాలని, అటువంటి రాజకీయాలను ప్రోత్సహించాలన్నారు. ప్రజలను శక్తిగా మార్చడం, సమాజ వికాసం కోసం కృషి చేయడం ప్రజాప్రతినిధుల లక్ష్యం కావాలని ఆయన తెలిపారు. నిధులు, విధులకు చైతన్యం తోడైతేనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, తద్వారా స్థానిక సంస్థలు బలోపేతం అవుతాయన్నారు.

**రాజకీయాలే సమస్యగా మారాయి – ప్రొ.హరగోపాల్**




రాజకీయమంటే సమాజ సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించడమని, కానీ ఇప్పుడు రాజకీయమే ఒక సమస్యగా మారిందని ప్రొ.హరగోపాల్ తెలిపారు. సిపిఐ ప్రజాప్రతినిధుల శిక్షణా తరగతుల్లో హరగోపాల్ మాట్లాడుతూ ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యత పెరగడం, నైతికత లోపించడం తదితర కారణాలతో రాజకీయాలు కలుషితమయ్యాయని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో అధికారం అంటే సమాజం నుంచి పొందడం అని, అలాంటి అధికారాన్ని సమాజాభివృద్ధికి, ప్రజల జీవన విధానంలో మార్పుకు దోహదపడేలా కృషి జరగాలన్నారు. చైతన్యం ద్వారా మార్పు వస్తుందని, మార్క్స్ చెప్పినట్లుగా సమాజం నిరంతరం మారుతూ ఉంటుందని ఆయన తెలిపారు. మానవసంబంధాల్లో మార్పులు త్వరితగతిన సంభవిస్తున్నాయని, ఒకరిపై ఒకరికి నమ్మకం లేకపోవడంతో మానవ సంబంధాలు బలహీనపడి ఒక ప్రశ్నగా మారుతున్నాయన్నారు. ముందుగా మనిషి పరిపూర్ణ మానవునిగా ఎదగడమే గొప్ప మార్పు అని హరగోపాల్ స్పష్టం చేశారు. మనిషి సృష్టించిన సంపద సృష్టించిన వానికి దక్కడం లేదని, వేర్వేరు వ్యక్తుల వద్ద అది కేంద్రీకృతమవుతోందన్నారు. బలప్రయోగం రాజ్యాంగ లక్షణం అని తెలిపారు. ఈ సమాజం తల్లితండ్రి శిక్షించలేకపోయినా రాజ్యాంగానికి శిక్షించే అధికారం ఇచ్చిందని ఆయన తెలిపారు. సమాజ మార్పు చైతన్యవంతమైన మనిషితో సక్రమ మార్గంలో జరుగుతుందని హరగోపాల్ తెలిపారు. ఇప్పుడు స్వార్థమే మనిషిని నడుపుతోందని మానవ సంబంధాలు మానవీయంగా మారకపోతే మరింత ప్రమాదమన్నారు. కమ్యూనిస్టు ప్రతినిధుల ద్వారానే సమాజ మార్పు త్వరితగతిన సాధ్యమవుతుందని హరగోపాల్ తెలిపారు. కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులకు అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పార్టీ గౌరవాన్ని ఇనుమడింప జేయాల్సిన బాధ్యత ఉందన్నారు. మౌలిక వసతుల కల్పన, ముఖ్యంగా విద్యా, వైద్యం, తాగునీరు తదితర విషయాలకు ప్రాధాన్యతనిచ్చి మన తర్వాత కూడా కమ్యూనిస్టు ప్రజాప్రతినిధుల పాలనే బాగుందనిపించేలా పాలన సాగాలన్నారు. ఈ శిక్షణా తరగతులను స్థానిక శాసన సభ్యుడు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రారంభించగా, సిపిఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు, మేయర్ మూడ్ గణేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెడవాడ వెంకటేశ్వర్లు, ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, కర్రె బిక్షపతి, ప్రముఖ వైద్యులు సూర్యదేవర రామ్మోహన్‌రావు, రిటైర్డ్ ప్రిన్సిపల్ సిద్దులు తదితరులు పాల్గొన్నారు. మునిగడప పద్మ, ఉమ, వాసిరెడ్డి మురళీ తదితరులు స్టీరింగ్ కమిటీగా వ్యవహరించారు.

### దేశంపై యుద్ధ ప్రమాదం : సిపిఐ డా.కె.నారాయణ



భారత దేశంపై యుద్ధ ప్రమాదం పడిందని, గ్యాస్ సహా, నిత్యావసరాల ధరలు పెరిగిపోతున్నాయని, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు నిలిచిపోతున్నాయని సిపిఐ జాతీయ క్రమశిక్షణా సంఘం అధ్యక్షుడు డా.కె.నారాయణ తెలిపారు. సంపదపై కన్నేసి మోదీ సాగిస్తున్న దాడులు సామాన్య ప్రజలకు ఇబ్బందికరంగా మారాయని ఆయన తెలిపారు. సిపిఐ శిక్షణా తరగతుల్లో భాగంగా పాల్వంచలోని సుగుణ ఫంక్షన్ హాల్లో జరుగుతున్న సిపిఐ ప్రజాప్రతినిధుల శిక్షణా తరగతుల్లో 'ప్రస్తుత రాజకీయ సామాజిక పరిస్థితులు – ప్రజాప్రతినిధులు' అనే అంశాన్ని ఆయన బోధించారు.
నారాయణ మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల విధానంలో వచ్చిన మార్పులు వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుంటే ప్రజాప్రతినిధులుగా గెలుపొందడం గొప్ప విషయమని, సామాన్యున్ని సైతం గౌరవ ప్రజాప్రతినిధులుగా నిలిపిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకే దక్కుతుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ ప్రజా ప్రతినిధులుగా ప్రజా సమస్యల పరిష్కారంలో ముందు భాగాన నిలుస్తూ త్యాగాల చరితను కొనసాగించాలని నారాయణ సూచించారు.
ప్రజాప్రతినిధులకే అర్థం మారిపోతున్న ఈ రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి సిపిఐ ప్రజాప్రతినిధులు సమస్యల పరిష్కారానికి ముందు వరుసలో నిలబడాలన్నారు. మీ పనితీరు కారణంగా పార్టీ మరింత విస్తరించే విధంగా ఉండాలని, నిధులు, విధుల విషయంలో క్రమశిక్షణాయుతంగా వ్యవహరించాలని నారాయణ సూచించారు.

# ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండగారి రాములు కన్నుమూత



ప్రజాపక్షం/రంగారెడ్డి/ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మాజీ ఎంఎల్ఎ కొండిగారి రాములు (90) కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోన్న ఆయన శుక్రవారం ఉదయం 8.45గంటలకు ఇబ్రహీంపట్నంలో తన ఇంట్లో నిద్రలోనే మృతిచెందారు. 1989,1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొండిగారి రాములు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యేగా కమ్యూనిస్టు పార్టీ ప్రాతినిధ్యం వహించారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసిన రాములు నిఖార్సైన కమ్యూనిస్టు ఉద్యమ నేతగా, నిస్వార్థ నాయకుడిగా కొండిగారి రాములు పేరుపొందాడు. రెండు సార్లు ఎంఎల్ఎగా చేసినప్పటికీ ఆర్థికంగా సాధారణ జీవితం గడిపారు. ఆయన సొంత గ్రామం రంగారెడ్డి జిల్లా మంచాల మండలం అరుట్ల కాగా ఇబ్రహీంపట్నంలోని బృందావన్ కాలనీలో స్థిరపడ్డారు.

**సామాన్య జీవితమే ఆయన మార్గం..**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో 1935లో జన్మించిన రాములు చిన్నతనం నుంచే కమ్యూనిస్టు భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. రెండుసార్లు ఎంఎల్ఎగా పనిచేసినా, ఎలాంటి ఆస్తిపాస్తులు కూడబెట్టకుండా సామాన్య జీవితం గడిపిన అరుదైన నాయకుల్లో ఆయన ఒకరు. నిబద్ధత, నిజాయితీ కలిగిన ఆయన రాజకీయ ప్రస్థానం నేటి తరం నాయకులకు ఆదర్శప్రాయం. రాములుకు ముగ్గురు కుమారులు కాగా, పెద్ద కుమారుడు అనారోగ్యంతో మరణించాడు. ఆయన మూడో కుమారుడు కొండిగారి త్రిలోక్ కుమార్,ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 12వ వార్డు నుంచి బిఆర్ఎస్ కౌన్సిలర్ గా గెలుపొందారు. కొండిగారి రాములు మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు,అభిమానులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## రాములు మరణం తీరని లోటు
### సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి

కామ్రేడ్ మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు అకాల మరణం సిపిఐకి, నియోజకవర్గం ప్రజలకు తీరని లోటని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో బృందావన్ కాలనీలో కామ్రేడ్ మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు(95) ఆకాల మరణం చెందటంతో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి తీవ్ర దిగ్భాంతికి గురై కొండిగారి రాములు స్వగృహానికి హుటాహుటిన వెళ్లి కొండిగారి రాములు పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళ్లులు అర్పించారు. అనంతరం సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కామ్రేడ్ కొండిగారి రాములు గత 1989,1994 సంవత్సరంలో రెండు పర్యాయాలు సిపిఎం పార్టీ తరుపున ఎమ్మెల్యేగా పదవులు చేసి సాధారణ జీవితం అనుభవించి ప్రజాసేవకు అంకితమైన నాయకులన్నారు. రెండుసార్లు పదవులు అనుభవించి సాధరణ నాయకుడిగా జీవితం గడపటం ప్రత్యేకంగా ఎర్ర జెండాను నమ్ముకున్న కమ్యూనిస్టులకే సాధ్యమవుతుందని కొనియాడారు. 2011సంత్సరంలో సిపిఐ పార్టి సభ్యత్వం తీసుకోని రంగారెడ్డి జిల్లాలో సిపిఐ చేస్తున్నా ప్రజా ఉద్యమాలలో భాగస్వాములై చురుకుగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తు పేద ప్రజల సమస్యలపై ఆహర్నిషలు ఉద్యమించిన నాయకలన్నారు.
కామ్రేడ్ కొండిగారి రాములుకు సిపిఐ జాతీయ,రాష్ట్ర పార్టీల తరుపున ప్రగాఢ సంతాపం తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కావలి నర్సింహ్మా, ఓరుగంటి యాదయ్యగౌడ్, గీతపనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రాములు, పి.నీలమ్మ, ఎండి అలిమోద్దిన్, నర్ల శ్రీశైలం, కావలి సురష్, రాజు నాయక్, ఎస్.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## FORMAT C-1

**Declaration about Criminal Cases**

*(As per the judgement dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 201I (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)*

**Name and Address of the Candidate** : **DR. ABHISHEK MANU SINGHVI**
R/o 14, JORBAGH,NEW DELHI - 110003.

**Name of the Political Party** : **INDIAN NATIONAL CONGRESS**

**Name of Election** : **BIENNIAL ELECTIONS TO THE COUNCIL OF STATES (RAJYA SABHA), 2026.**

**Name of Constituency** : **ELECTION TO THE COUNCIL OF STATES FROM TELANGANA STATE LEGISLATIVE ASSEMBLY**

I, **Dr. Abhishek Manu Singhvi**, a candidate for the above-mentioned election, declare for public information the following details about my criminal antecedents:

**(A) Pending Criminal Cases**

| Sl. No. | Name of Court | Case No. and Dated | Status of Case(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
|---|---|---|---|---|
| 1 | Additional Chief Judicial Magistrate, (Economic Offence), Jodhpur. | There is no case number as the procedure is that till cognizance is taken by the magistrate, no case number is assigned. | Prosecution complaint filed before court of Ld. Addl. Chief Judicial Magistrate (Economic Offence) Jodhpur moved on 04.01.2021. Since 04.01.2021, no notice has been issued to the undersigned. These details were discovered by the undersigned pursuant to additional affidavit on behalf on CBDT served on undersigned on 07.01.2021 in WP 11176/20 at Delhi High Court. | Complaint is filed under section 276C (1), 277 of Income Tax Act 1961 read with Section 420 of IPC 1860. The IT department filed prosecution complaint for AY 2010-11, 2011-12, 2012-13 on 4.1.21 before the court of Ld. Addl. Chief Judicial Magistrate (Economic Offence) Jodhpur. Wherein the department has pleaded that the undersigned has inflated expenses causing wrongful loss to government and wrongful gain to himself and has willfully attempted to evade tax. |

**(B) Details about cases of conviction for criminal cases**

| Sl. No. | Name of Court & date(s) of order(s) | Description of offence(s) & punishment imposed | Maximum Punishment Imposed |
|---|---|---|---|
| -- NOT APPLICABLE -- | | | |

# విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడం సిగ్గుచేటు

## రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి : ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్



హైదరాబాద్ : విద్యార్థుల ప్రాణ త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడం సిగ్గుచేటు అని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించడంతో పాటు విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడుస్తున్నా విద్యార్థుల సమస్యలపై విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నించాల్సి రావడం దౌర్భాగ్యమన్నారు. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే విద్యాశాఖకు మంత్రి లేకపోవడం కాంగ్రెస్ పాలన వైఫల్యానికి నిదర్శనమని, తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటున్న ప్రతి కార్యక్రమంలో పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తానని, ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ క్షేత్రస్థాయిలో సరైన మౌలిక వసతులు లేక ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వివరించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని, ఆ దిశగా ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగం బలోపేతానికి నిధులు కేటాయించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థి లోకాన్ని సంఘటితం చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించడంతోపాటు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తామని మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హరీష్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



## 15న ఇందిరాపార్క్ వద్ద 'ఫీజు పోరు దీక్ష'
### హాజరుకానున్న అఖిలపక్ష పార్టీల నేతలు
### విక్రమ్ గౌడ్, మహేష్ యాదవ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.7500 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయడంతో పాటు పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఈనెల 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఫీజు పోరు దీక్ష నిర్వహిస్తున్నామని, ఈ దీక్షలో అఖిల పక్ష పార్టీల నేతలు పాల్గొంటారని బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్ యాదవ్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని బిసి భవన్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టబోయే ఫీజు పోరు దీక్ష సన్నాహక సమావేశం జరిగింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుండి జరిగే బడ్జెట్ సమావేశాలలో ఫీజుల రీయంబర్స్‌మెంట్ ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ నిర్ణయాన్ని ప్రకటించాలని, లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, బండారు దత్తాత్రేయ, ఈటల రాజేందర్, సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, నెల్లికంటి సత్యం, సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంద్రం రజక, పుల్లెల శివగౌడ్, వినయ్, బండిగారి రాజు, గూడూరు భాస్కర్ మేరు, వంశీ, ఆవుల శ్రీను, ఎ.వెంకటేష్, ఎ.నరేష్, ఆవుల రాములు తదితరులు పాల్గొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
**ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, ఖైరతాబాద్ జోన్, హైదరాబాద్.**
'e'Procurement No.40/EE-II/KHAIRATABAD ZONE/GHMC/2025-26 తేదీ: 11.03.2026
Nit No. 40/EE-ii/KHAIRATABAD ZONE/GHMC/2025-26, పని వివరణ: సివిల్ పనులు (02 నెం.లు), అంచనా విలువ / ఇసివి: రూ.5.45 లక్షలు, ప్రారంభ తేదీ / డౌన్‌లోడ్ ఆఖరి తేదీ & సమయం: క్ర.సం.01 నుండి 02 వరకు పనుల కొరకు 13.03.2026న ఉ.10.30గం.ల నుండి 16.03.2026న ఉ.10.31గం.ల వరకు మాత్రమే, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, కెజెడ్, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా @ https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు. ఇ-మెయిల్ అడ్రస్: eec35.khairatabad@gmail.com, మొబైల్ నెం. 7331189501.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, ఖైరతాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 16959-PP/CL/ADVT/1/2025-26, Date: 13-03-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి జోన్**
NIT No.41/EE-I/MKJZ/MMC/2025-26, పని పేరు: నిర్వహణ పనులు ఇతరాలు-1, అంచనా విలువ : రూ.25.50 లక్షలు, బిడ్ దాఖలుకు ప్రారంభ తేదీ & సమయం / బిడ్ దాఖలుకు ఆఖరి తేదీ & సమయం: 14.03.2026న ఉ.11.30గం.ల నుండి 17.03.2026న ఉ.11.30గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9154796465, 7995009098. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా @ https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.
DIPR R.O. No. : 17019-PP/CL/ADVT/1/2025-26, Date: 13-03-2026

**పురపాలక సంఘం కార్యాలయము - తొర్రూరు**
పత్రిక ప్రకటన
నెం. 18/యం.సి.టి./2026/ఎ1 తేదీ: 13/03/2026
అంగడి బహిరంగ వేలం - కం - టెండరు ప్రకటన
ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది, పురపాలక సంఘంచే ప్రతి మంగళవారం నిర్వహించబడు అంగడి పశువుల రహదారి, మేకలు గొర్రెల రహదారి, తైబజారు వసూలు చేయు అధికారము మరియు వేలములు 2026 2027 సం.నకు గాను (01-04-2026 నుండి 31-03-2027 వరకు) బహిరంగ వేలం - కం టెండర్ల ద్వారా పురపాలక సంఘ కార్యాలయము నందు తేది. 23 / 03 / 2026 సోమవారం రోజున ఉ. 11-00 గంటల నుండి సా.05-00 గం.ల వరకు శ్రీయుత కమీషనర్ పురపాలక సంఘం తొర్రూరు గారిచే వేలములు వేయబడును. మరియు సీల్డు టెండర్లు స్వీకరించబడును. కావున అభిలాషపరులు ఈ దిగువ చూపబడిన నిబంధనలకు లోబడి వేలము మరియు టెండరు పాటలో పాల్గొనుటకు కోరనైనది. వేలములు అంగీకరించు / నిరాకరించు అధికారములు పురపాలక సంఘంనకు కలదు.
**పూర్తి వివరములకు మునిసిపల్ కమీషనర్ గారిని సంప్రదించగలరు. చరవాణి నెం: 9573977488**
**: నియమ నిబంధనలు :**
1. వేలములో పాల్గొనువారు గాని, వారి కుటుంబ సభ్యులు గాని, పురపాలక సంఘం తొర్రూరునకు ఎలాంటి బాకీ ఉండరాదు.
2. వేలము పాటలో పాల్గొను వారు ఈ క్రింద చూపబడిన విధముగా డిపాజిట్లు వేలం వేయు రోజునకు ముందుగా దాఖలు పరుస్తూ MUNICIPAL FUND, THORRUR MUNICIPALITY, గారి పేరున విడివిడిగా డి.డి.లను 18/03/2026 రోజు సా. 5.00 గం. వరకు చెల్లించి రశీదులు మరియు షెడ్యూల్స్ పొందగలరు.
3. చేబారు అయిన వారు పైన తెలిపిన ఆస్తికి సంబంధించిన డాకుమెంట్స్ కార్యాలయములో అప్పగించవలెను.

| వేలము వివరములు | డిపాజిట్ రూ.లు | రిజిస్ట్రేషన్ ఖర్చు | మొత్తం రూ.లు | షెడ్యూలు ధర |
|---|---|---|---|---|
| ఎ. పశువుల రహదారి మరియు మేకలు - గొర్రెల రహదారి | 5.00.000-00 | 1.00.000-00 | 6,00,000-00 | 5000-00 |
| బి. తైబజారు (గంపచీటి) | 3.00.000-00 | 30.000-00 | 3,30,000-00 | 3000-00 |
| సి. కమేళా | 50,000-00 | - | 50,000-00 | 1000-00 |
| డి. చికెన్ వ్యర్థములు | 50,000-00 | - | 50,000-00 | 1000-00 |

4. పైన చూపబడిన డిపాజిట్లుతో పాటు పశువుల రహదారి మరియు మేకలు - గొర్రెల రహదారి వేలం - కం- టెండరులో పాల్గొనదలచిన వారు పశువుల రహదారి పాటకు మరియు మేకలు-గొర్రెల రహదారి పాటకు రూ.5,00,000.00 మరియు తైబజార్ పాటకు రూ. 3,00,000.00 విలువ గల ఇల్లు ఉన్నట్లు గ్రామము అయితే పంచాయతి కార్యదర్శి గారితో ఇంటి వ్యాల్యుయేషన్ సర్టిఫికేట్ యం.పి.ఓ. గారి అటెస్టేషన్‌తో కాని, పురపాలక సంఘం అయితే ఇంటి విలువ సబ్ రిజిస్ట్రార్ గారిచే ధృవపత్రము ద్వారా లేదా విలువకు సరియగు వ్యవసాయ భూములు అయినచో శ్రీయుత తహశీల్దార్ గారిచే ధృవపత్రములు డిపాజిటుతో తేది. 18/03/2026 రోజున సాయంత్రం 5 గం.ల వరకు కార్యాలయము నందు దాఖలు చేయవలెను.
నోట్: అంగడి వేలములకు సంబంధించిన పూర్తి వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు సంప్రదించగలరు.
ఇట్లు
సం/- కమీషనర్, తొర్రూరు పురపాలక సంఘం
DIPR R.O. No. : 16942-PP/CL/ADVT/1/2025-26 Date: 13-03-2026



# ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోవాలి

## జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డా.యశోద

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ప్రభుత్వ వైద్యశాలలో అందించే ఉచిత వైద్య సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ యశోద అన్నారు. ఆమె శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మోటకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం పిహెచ్‌సి వైద్యాధికారి కట్టా విజయ్, ఎంపీడీవో ఇందిరా, సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్, ఉప సర్పంచ్ నిఖిత మహేందర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణి స్త్రీలు ప్రభుత్వ దవఖానలలోనే సాధారణ ప్రసవాలు జరిగే విదంగా చూసుకోవాలని సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 127 మంది జనరల్, గైనిక్, డెంటల్, ఆప్తాలమిక్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్ ప్రత్యేక వైద్య నిపుణులచే వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అవసరమైన వారికి పై ఆసుపత్రులకు రిఫర్ చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా డాక్టర్ యశోదను డాక్టర్ విజయ్, వైద్య సిబ్బంది శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హారిక, హెచ్ఇవో నరసింహ, శ్రీనివాస్, సూపర్వైజర్స్ సుగుణ అంజమ్, నర్సింగ్ ఆఫీసర్ సునీత, ఎంఎల్‌హెచ్‌పి పార్వతమ్మ, గ్రామ సెక్రెటరీ సంతోష్, ఆరోగ్య కార్యకర్తలు సుభాషిని, ధనమ్మ, అంజయ్య, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, సందీప్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ సత్యం చొరవతో కదిలిన వ్యవసాయ అధికారులు



## ఎండిన వరి పంటలను క్షేత్రస్థాయి పరిశీలన

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని కలవలపల్లి గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యంతో కాలువ పనులు పూర్తి కాకపోవడంతో వరి పంటలు పూర్తిగా ఎండిపోయాయి.ఈ నేపథ్యంలో తెలంగాణ శాసనమండలి సభ్యులు, సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం గురువారం రైతులతో కలిసి ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు.రైతుల సమస్యలను తెలుసుకుని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ స్పందనతో కదిలిన మండల వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం గ్రామంలో ఎండిపోయిన వరి పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి పద్మజ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి పూర్తి వివరాలతో ఉన్నత అధికారులకు నివేదిక పంపించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నరసింహ, గ్రామ రైతులు గట్టుపల్లి నర్సిరెడ్డి, ఎంపల్ల సాయిలు, పంతంగి లక్ష్మయ్య, గుండెబోయిన ధనమ్మ, పర్నిలచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డివైడర్ వద్ద మరమ్మతులు




**ప్రజాపక్షం/త్రిపురారం:** మండల కేంద్రం నుంచి అడవి దేవలపల్లి రోడ్డులోని బెజ్జికల్ మూలమల వద్ద ఉన్న వరద డివైడర్ ఎత్తుగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. డివైడర్ ఎత్తుగా ఉండటం వల్ల రాకపోకలు కష్టతరమవడంతో పాటు ఇటీవల కొన్ని చిన్న పాటి ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ సమస్యను ప్రజాపక్షం పత్రిక పలుమార్లు వెలుగులోకి తీసుకువచ్చి, డివైడర్ ఎత్తును తగ్గించి మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించింది. ప్రజాపక్షం పత్రికలో వచ్చిన కథనాలకు స్పందించిన మాజీ ఎంపీపీ, గౌరవ సలహాదారుడు అనుముల శ్రీనివాసరెడ్డి, త్రిపురారం సర్పంచ్ బైరంలక్ష్మీ కృష్ణలు వెంటనే చర్యలు చేపట్టారు. డివైడర్ వద్ద కాంక్రీట్ పోయించి మరమ్మతులు చేయించడంతో రహదారి సమతుల్యంగా మారి వాహనాల రాకపోకలు సులభమయ్యాయి. దీంతో ఇప్పటి వరకు ఎదురైన ఇబ్బందులు తొలగిపోయాయని వాహనదారులు తెలిపారు. ఈచర్యతో ప్రమాదాల అవకాశాలు తగ్గడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమస్యను గుర్తించి వార్తల ద్వారా ప్రజల దృష్టికి తీసుకువచ్చిన ప్రజాపక్షం పత్రికను వారు అభినందించారు.

# గ్యాస్ బ్లాక్ దందాకు చెక్

## అక్రమంగా నిల్వ ఉంచిన 41 గ్యాస్ సిలిండర్లు సీజ్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** గ్యాస్ బ్లాక్ దందాకు పోలీసులు చెక్ పెట్టారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన 41 గ్యాస్ సిలిండర్లను శుక్రవారం పట్టుకొని సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇరాన్ ఇజ్రాయిల్, అమెరికాల మధ్య జరుగుతున్న యుద్ధంతో గ్యాస్ కొరత ఏర్పడడంతో ఇదే అదునుగా చేసుకొని కొంత మంది గ్యాస్ డీలర్లు వినియోగదారులకు ఇవ్వకుండా పక్కదారి పట్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో కృత్రిమ కొరత ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఎస్‌పి కె నరసింహ ఆదేశాలతో పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పిఎస్ఆర్ సెంటర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన ఓ దుకాణంలో 41 సిలిండర్లను గుర్తించారు. ఇందులో 21 డొమిస్టిక్, 20 కమర్షయల్ సిలిండర్లు ఉండగా వాటిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి కె నరసింహ మీడియాతో మాట్లాడుతూ కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు బారులు తీరకుండా ఉండాలన్నారు. గ్యాస్ టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలన్నారు. నకిలీ వ్యక్తులు గ్యాస్‌ను బుక్ చేసినట్లయితే అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. గ్యాస్ సిలిండర్ల సరఫరా గ్యాస్ ఏజెన్సీలదే బాధ్యతన్నారు.

# ఎక్కడి చెత్తా అక్కడే... ఎక్కడి మురుగు అక్కడే

## ప్రచారానికే పరిమితమైన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక

**ప్రజాపక్షం/సూర్యాపేట :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితమైంది. దీంతో పల్లెల నుండి పట్టణాల వరకు ఎక్కడి చెత్తా అక్కడే... ఎక్కడి మురుగు అక్కడే పేరుకుపోయిన పరిస్థితి. సూర్యాపేట గ్రేడ్ 1 మున్సిపాలిటిలో మొత్తం 48 వార్డులు ఉన్నాయి. నూతనంగా ఆయా పార్టీల నుండి ప్రజల చేత ఎన్నికైన కౌన్సిలర్లు ప్రజాసమస్యల పరిష్కారానికి కొంత ఉత్సాహం చూపుతున్నా అవి అపరిష్కృతంగానే ఉంటున్నాయి. ఇంట్లోని చెత్తను రోజు ట్రాక్టర్లపై మున్సిపల్ సిబ్బంది ఇంటి ముందుకు వచ్చి తీసుకువెళ్తున్న పట్టణ శివారు ప్రాంతాలతోపాటు నడిఒడ్డున కూడా అనేక ఖాళీ స్థలాలు ఉండడంతో అందులో కంపచెట్లు పెరిగి, కాలువలలోని మురుగు నీరు అందులో నిల్వ ఉండడంతో పందులు స్వైర విహారం చేయడంతోపాటు దోమలకు నిలయంగా మారాయి. 16వ వార్డులోని శ్రీరాంనగర్ అక్షయశ్రీ అపార్టుమెంట్ పక్కన రహదారి వెంట గత నాలుగు నెలల క్రితం మున్సిపల్ అధికారులు నూతనంగా మురుగు కాల్వలను నిర్మించారు. నాటి నుండి నేటి వరకు ఏనాడు కూడా అందులో పేరుకపోయిన చెత్తను తొలగించిన దాఖలాలు లేవు. పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో వర్షపునీరు పెద్దఎత్తున చేరి దుర్వాసన వెదజల్లుతుండడంతో మున్సిపల్ సిబ్బంది ఆ నీరును తొలగించేందుకు నూతనంగా నిర్మించిన కాలువకు ఘండి కొట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నా దానిని తిరిగి పూడ్చకపోవడంతో ఇండ్ల నుండి మురుగు కాలువలోకి ప్రవహిస్తున్న మురుగు నీరు సాఫీగా వెళ్ళకుండా చెత్తాచెదారం పేరుకుపోయింది. దీనితో ఘండి ఉన్న చోటనుండి కాల్వలోని మురుగునీరు మొత్తం ఖాళీ ప్లాట్‌లోకి చేరి చిన్నపాటి చెరువులా తలపిస్తుంది. మురుగు నీటి వాసనతోపాటు దోమలు వ్యాప్తి చెంది ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే సిటి ఎలైట్ స్కూల్ ఉండగా ఇందులో వందల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మురుగు కంపును భరించడంతోపాటు పగటిపూట కూడా దోమలు కుట్టి రోగాల బారిన పడుతున్నారు. ఈ ఒక్క ప్రాంతమే కాదు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది.

**ప్రచారానికే పరిమితమైన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతోనైనా పట్టణంలో పారిశుద్ధ్య సమస్యతోపాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమవుతాయని అందరూ ఆశించారు. కానీ ఇది కేవలం ప్రచారానికి పరిమితమైంది. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ నుండి మొదలుకొని పలు శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగస్వామ్యం అవుతున్నా అది కేవలం ఫోటోలకు, ప్రచార ఆర్భాటమే తప్ప ఒరిగిందేమి లేదని ప్రజలు బహిరంగంగానే పెదవి విరుస్తున్నారు. దీనికి తోడు రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. అండర్ డ్రైనేజీ కోసం మంచిగా ఉన్న రోడ్లను తవ్వగా గుంతలై ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఇప్పటికైనా అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు




జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** అర్హులైన ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా శుక్రవారం మిర్యాలగూడలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం పది ప్రధాన అంశాలను తీసుకోని వాటిపై అవగాహన తోపాటు సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా ఇప్పటివరకు ప్రభుత్వం సాధించిన అభివృద్ధిపై ప్రజలకు తెలియపరిచేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా మార్చి 6 నుంచి 15వరకు అన్ని గ్రామాలు, పట్టణాలు, కార్యాయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టేందుకు నిర్దేశించడం జరిగిందని, అంతేగాక అన్ని ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల్లో ఫైళ్ల పరిష్కారం చేపట్టినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటిస్తే సమస్యలు తెలుస్తాయని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఎంపీడీవోలు గ్రామాల వారీగా ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన జాబితాను రూపొందించి ఏప్రిల్ 2న నిర్వహించే గ్రామసభలో వాటిని చదివి వినిపించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామ సభలో, మున్సిపల్ పట్టణాల్లో చర్చించాలన్నారు. ఉగాది నాటికి ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 14నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించాలని సూచించారు. జిల్లాలో డొమెస్టిక్ ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్లు అక్రమంగా కమర్షియల్‌కు వాడిన 16 మందిపై కేసులను నమోదు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులందరు కలిసికట్టుగా పనిచేసి మిర్యాలగూడ నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో ముందు నిలపాలన్నారు. మిర్యాలగూడ వాణిజ్యపరంగా ముందున్నప్పటికీ అనేక మంది పేదవారు ఉన్నారని, వారికి విద్య, వైద్యానికి పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. యూరియాను మండలాల వారీగా కాకుండా పీఏసీఎస్ వారీగా తమకు కేటాయించాలని, వైటీపీఎస్‌కు సంబంధించిన సీఎస్ఆర్ నిధులను అభివృద్ధి పనులకు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాప్రతినిధులు గ్రామాలు, మండలాల్లో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, అంతేగాక సమస్యల పరిష్కారానికి అవసరమయ్యే నిధుల అంచనాలను రూపొందించి సమర్పించాలన్నారు. అందరికి విద్యా, వైద్యం అందుబాటులో ఉంచడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధాబాలకృష్ణ, వైస్ ఛైర్‌పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, మున్సిపల్ కమీషనర్ గణవేణి శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



# గృహ అవసరాల గ్యాస్‌కు కొరతలేదు

## జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరతలేదని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు, పౌరసరఫరాల అధికారులతో ఎల్‌పిజి గ్యాస్ సరఫరాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 4,15,509 డొమెస్టిక్ కనెక్షన్లు ఉన్నాయని, ప్రస్తుతం జిల్లాలో 17,647 డొమెస్టిక్ సిలిండర్లు, 552 కమర్షియల్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్యాస్ బుక్ చేసుకున్న రెండు మూడు రోజుల్లోనే వినియోగదారులకు సకాలంలో డెలివరి చేయడం జరుగుతుందని వివరించారు. గృహ అవసరాలకు వినియోగించే ఎల్‌పిజి గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరతలేనందున ప్రజలు ఆందోళనకు గురై అనవసరంగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని కోరారు. సీనియారిటి ప్రకారం ఏజెన్సీలు గ్యాస్‌ను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ సివిల్ సప్లై రాము పాల్గొన్నారు.



# దేవాలయ అభివృద్ధికి కృషి

## కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** మండలంలోని చీకటిమామిడి గ్రామంలో శ్రీ తిరుమలనాథ స్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుటుంబ సమేతంగా ముఖ్య అతిథిగా హాజరై కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కల్యాణం మహోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని దేవాలయానికి సుమారు 500 సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్న దేవాలయంగా ఇక్కడ ప్రజలు చెబుతారని ఆయన అన్నారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కళ్యాణ మహోత్సవంలో టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో ప్రముఖులు మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

## జిల్లా ఎస్‌పి కె.నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట/సూర్యాపేట రూరల్ :** మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు జిల్లాలోని 10వ తరగతి పరీక్షల సందర్భంగా ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజలు గుంపులుగా చేరడంపై నిషేధ ఆజ్ఞలు సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ 2023 అమలులో ఉంటుందని జిల్లా ఎస్‌పి కె.నరసింహ తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని సూచించారు. అదేవిధంగా ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజెలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసి వేయాలని సూచించారు. పరీక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు.

**విద్యార్థులు స్వీయ నియంత్రణ కలిగి ఉండాలి : ఎస్‌పి కె.నరసింహ**

విద్యార్థులు స్వీయ నియంత్రణ కలిగి ఉండాలని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదివి కళలను సాకారం చేసుకోవాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చందన నర్సింగ్ విద్యాసంస్థల నందు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా భద్రతా అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్వీయ నియంత్రణ, సామాజిక మాధ్యమాల ద్వారా కలిగే నష్టాలు, రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల నిర్మూలన, మహిళలు, విద్యార్థుల భద్రత, డ్రగ్స్ మత్తు పదార్థాల నిర్మూలన భద్రతా అంశాలపై అవగాహన కల్పించారు. ఆకతాయిలు చెప్పే మాటలు, చేష్టలను నమ్మి ప్రేమాకర్షణలకు లోనై బంగారు భవిష్యత్తును కోల్పోకూడదని హితవు పలికారు. సామాజిక భద్రతకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని స్వీయ నియంత్రణ కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, స్థానిక ఎస్ఐ బాలు నాయక్, చందన విద్యాసంస్థల యాజమాన్యం పాల్గొన్నారు.



# ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు



నల్లగొండ జిల్లాలో 13,981 మంది విద్యార్థులు హాజరు

**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లాలో నిర్వహించిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 11,807 మంది, వొకేషనల్ విభాగంలో 2,117మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. రెండో సంవత్సరం జనరల్ విభాగంలో 11,783 మంది,వొకేషనల్ విభాగంలో 2,248 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.మొత్తం కలిపి13,981 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహణ కోసం జిల్లాలోని పరీక్షా కేంద్రాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్లు మరియు ఇతర సిబ్బందిని నియమించారు. ప్రతి కళాశాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రతి పరీక్షా కేంద్రంలో వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన ప్రథమ చికిత్స మందులు అందుబాటులో ఉంచారు. అలాగే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ అధికారులు ప్రతి డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడిపించారు. పరీక్షల నిర్వహణలో సహకరించిన విద్యాశాఖ సిబ్బంది, పోలీస్ శాఖ, పోస్టాఫీసు, వైద్య శాఖ ఆర్‌టిసి సిబ్బందికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దశ్రు నాయక్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్పాట్ వాల్యూయేషన్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

# ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా నాణ్యమైన విద్య

## భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఆధునిక సాంకేతికత మారుతున్న కాలానికి ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యను అందించడం పాఠశాల యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయులది కీలక పాత్రని భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పోచంపల్లి పట్టణంలోని కర్నాటి ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా స్థాపించబడిన లీడేల్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల యాజమాన్యం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పాఠశాల యాజమాన్యం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధను అభినందించారు. పాఠశాల స్థాపించిన అనతి కాలంలోనే విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. వార్షికోత్సవ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విశాలమైన అసలు ప్రాంగణం క్రీడాస్థలం నీ మౌలిక వసతులు ప్లేగ్రౌండ్ అధునాతన కంప్యూటర్ ల్యాబ్ సైన్స్ ప్రయోగశాల అన్నింటిని విద్యార్థులకు అందుబాటులో ఉంచడం గొప్ప విషయమని చెబుతూ స్కూల్ చైర్మన్ కర్నాటి శ్రవణ్ కుమార్‌ను అభినందించారు. మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వ్యాఖ్యాత సంద్ర సుధీర్, స్కూల్ అడ్వైజర్ రాధా, పట్టణ మండల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భారత లవ కుమార్, మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్ వ్యాపారవేత్త సీతా హరిప్రసాద్, ప్రిన్సిపాల్ కాశీనాథ్, మేనేజర్ మురళి, పర్యవేక్షకులు మహమ్మద్ ఆజం, ఎర్ర జగన్, స్కూల్ అధ్యాపకులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.






# కలిసికట్టుగా మునుగోడు అభివృద్ధికి కృషి

## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/మునుగోడు:** మునుగోడు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కలిసికట్టుగా పనిచేస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్లకు వారు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. చలిమెడ గ్రామం నుంచి బొత్తలగూడెం గ్రామం వరకు రూ.1.75 కోట్లు, కలకుంట్ల గ్రామం నుంచి కొండాపురం గ్రామం వరకు రూ.3 కోట్లు, మునుగోడు నుంచి దుబ్బగాలువ రోడ్డు వరకు రూ.85 లక్షలు, కస్తూర్బా పాఠశాల నుంచి లక్ష్మీదేవి కూడలి వరకు రూ.1.50 కోట్లు, చండూర్ రోడ్డు నుంచి సోలిపురం గ్రామం వరకు రూ.3.85 కోట్లు, పలివెల రోడ్డు నుంచి వెలగలగూడెం గ్రామం వరకు రూ.4.50 కోట్లు, కిష్టాపురం గ్రామం నుంచి చిన్నకాపార్తి గ్రామం వరకు రూ.6.50 కోట్ల వ్యయంతో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే దుబ్బకాల్వ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బీటీ రోడ్లు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ పద్మజ, చండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, పంచాయతీరాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, డీఈ నాగేశ్వరరావు, ఏఈ సతీష్ రెడ్డి, తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో యుగంధర్ రెడ్డి, సిపిఐ నాయకులు బొల్గూరి నరసింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, బొమ్మరబోయినలాలు, సురిగి చలపతి, సర్పంచ్ బండమీది యాదయ్య, కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి జితేందర్ రెడ్డి, వేంరెడ్డి సురేందర్ రెడ్డి, నారబోయిన రవి, బూడిద లింగయ్య యాదవ్, జాజుల అంజయ్య, మేకల ప్రమోద్ రెడ్డి, పాల్వాయి జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కర్ఫ్యూ సడలింపు

**షిల్లాంగ్:** మేఘాలయలో ఉద్రిక్తంగా మారిన రెండు జిల్లాలో నిత్యవసర వస్తువులు కొనుగోలు చేసుకోవడానికి శుక్రవారం కర్ఫ్యూ ను సడలించారు.వెస్ట్ గారో హిల్స్ జిల్లాలో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు నాలుగు గంటల పాటు సడలించారు. ఉదయం 8గంటల నుండి సాయంత్రం5 గంటల వరకు ఎక్కువ కాలం పరిమితులు సడలించారని పొరుగు ఈస్ట్‌గారో హిల్స్ జిల్లాలో డిప్యూటీ కమిషనర్ ఆర్‌పి మారక్ తెలిపారు. పోలీస్ అధికారుల వివరాల ప్రకారం గారో హిల్స్ అటానమస్ డిస్ట్రిక్ కౌన్సిల్(జిహెచ్ఎడిసి) ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ సమయంలో ఈవారం మొదటగిరిజన, గిరిజనేతరుల వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీస్ ఫైరింగ్‌లో ఇద్దరు మృతి చెందారు. భారీ ఆస్థి నష్టం సంభవించింది. తురా పట్టణంలో కొన్ని భాగాల్లో దోపిడీ దాడులు,దహనాలు, విధ్వంస సంఘటనలు నమోదయ్యాయి.

# గ్యాస్ సిలిండర్లు ఎక్కడికి పోయాయి?

- ప్రధాని మోదీ అదృశ్యమయ్యారు
- ప్రతిపక్షాల విమర్శ : పార్లమెంట్ వెలుపల నిరసన ప్రదర్శన



**న్యూఢిల్లీ:**ఎల్‌పిజి సంక్షోభంపై దేశ వ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలు శుక్రవారం పలు విధాలుగా నిరసన ప్రదర్శనలు చేశారు. పార్లమెంటు కాంప్లెక్స్ లోనూ ప్రతిపక్ష ఎంపిలు నిరసనలు తెలిపారు. పెట్రోలియం మంత్రి హర్దీప్ పూరి, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని నినాదాలు చేశారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో పార్లమెంట్ భవనం వెలుపల టిఎంసి ఎంపిలు పోస్టర్లు పట్టుకుని, 'ఎల్‌పిజి సంక్షోభం' అని నినదించారు. అధికార బిజెపిపై విమర్శలు చేస్తూ 'గ్యాస్ సిలిండర్లు ఎక్కడికి పోయాయి?' ప్రశ్నించారు. కాంగ్రెస్, ఇతర ఇండియా కూటమి పార్టీల ఎంపీలు కూడా నిరసనలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ గ్యాస్ సిలిండర్లతో పాటు అదృశ్యమవుతున్నారు అని ఆరోపించారు. ఆయన లొంగిపోతున్నారని ప్రతిపక్ష ఎంపిలు నినాదాలు చేశారు. 'దేశంలో ఎల్‌పిజి సంక్షోభం తీవ్రమైంది. ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. బెంగాల్‌లో కూడా, ప్రధాన పంపిణీదారుల వద్ద వ్యవస్థలు క్రాష్ అవుతున్నందున, వారు మాన్యువల్ బుకింగ్‌లను ఆశ్రయిస్తున్నారు' అని టిఎంసి ఎంపి మహువా మొయిత్రా అన్నారు.'మీ కుటుంబాలు, వృద్ధులు, యువ తల్లిదండ్రులు సిలిండర్లను బుక్ చేసుకోవడానికి క్యూలో నిలబడి ఉన్నారు. ప్రభుత్వం రెండున్నర రోజుల్లో మీ సిలిండర్లను పొందవచ్చని సమాచారాన్ని విడుదల చేస్తోంది... మేము ప్రధానమంత్రిని సవాలు చేస్తున్నాము, బుకింగ్ చేసిన రెండున్నర రోజుల్లోపు ప్రజలు తమ సిలిండర్లను ఎక్కడికి తీసుకుంటున్నారో కనుక్కోమని మంత్రులను సవాలు చేస్తున్నాము' అని ఆమె అన్నారు. పెట్రోలియం మంత్రి దేశానికి అబద్ధం చెప్పారు అని, భారతదేశంలో 75 రోజుల విలువైన సామాగ్రి ఉందని ఆమె అన్నారు. 'ఇప్పుడు వారు నిత్యావసర వస్తువుల చట్టాన్ని అమలు చేసి కేవలం 25 రోజులు మాత్రమే అయింది. మనకు చెప్పేవి అబద్ధాలు. ప్రధానమంత్రి ఎక్కడ? ప్రధానమంత్రి గత ఐదు రోజులుగా సభకు రాలేదు' అని ఆమె అన్నారు. 'ఈ తీవ్రమైన సంక్షోభం కొనసాగుతున్నప్పుడు, ఆయన కేరళలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు; ఆయన ప్రధానమంత్రి కాదు, ఎన్నికల యంత్రంగా మారారు. ఇది నిజంగా సిగ్గుచేటు' అని మోయిత్రా మండిపడ్డారు. కొంతమంది ప్రతిపక్ష ఎంఠిలు గ్యాస్ సిలిండర్ల పెద్ద కటౌట్‌లను పట్టుకోగా, మరికొందరు సిలిండర్లు, నినాదాలతో కూడిన పోస్టర్‌లను పట్టుకున్నారు. ఇండియా కూటమి ఎంపిలు ఏకంగా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి ప్రయత్నించినప్పుడు 'మోదీ జిఎల్‌పిజి' అనే నినాదాలు ప్రతిధ్వనించాయి. పశ్చిమాసియా పరిస్థితి, భారతదేశంపై దాని ప్రభావంపై పూర్తి స్థాయి చర్చ జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

**తక్షణ చర్యలు తీసుకోవాలి**

దేశంలోని అనేక ప్రాంతాల్లో ఎల్‌పిజి సిలిండర్ల కొరతను పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీలు శుక్రవారం కేంద్రాన్ని డిమాండ్ చేశాయి. అయితే అధికార కూటమి సభ్యులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మద్దతు ఇచ్చి, ఈ అంశంపై ప్రతిపక్షం ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఎల్‌పిజి పరిస్థితిపై భయాందోళనలు సృష్టిస్తున్న వారిని మోదీ విమర్శించిన విషయం విదితమే. బ్లాక్ మార్కెటింగ్, సిలిండర్ల నిల్వలను అరికట్టడానికి పర్యవేక్షణను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో జరిగిన ఎన్ఎక్స్‌టి శిఖరాగ్ర సమావేశంలో ప్రసంగించిన మోదీ, పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా, ఏ దేశం కూడా ప్రభావితం కాకుండా ఉండలేదని, కానీ భారతదేశం ఈ సవాలును పరిష్కరించడానికి పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. కాగా, ఎల్‌పిజి సిలిండర్ల గురించి తీవ్రమైన ఆందోళనలు ఉన్నాయని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆందోళనలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకుడు శశి థరూర్ పేర్కొన్నారు. అయినప్పటికీ కేంద్రం గల్ఫ్ దేశాలను సంప్రదించి శాంతి కోసం చొరవ తీసుకోవడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. దురదృష్టవశాత్తు, చాలా గృహాలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సిలిండర్ నుండి కలప , బొగ్గుకు మారాయని, సిలిండర్లు సులభంగా లభించకపోతే, అది నిజమైన సవాలుగా మారుతుందన్నారు. కొన్ని చోట్ల గ్యాస్ సిలిండర్లు లేకపోవడం వల్ల రెస్టారెంట్లు మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను వీలైనంత త్వరగా అధిగమించడానికి దేశం ఐక్యంగా ఉండాలని సూచించారు. ఐదు రాష్ట్రాలు ఎన్నికలకు వెళ్తున్నాయని, ప్రచారం చేయాల్సిన వారికి కూడా పెట్రోల్, ప్రయాణించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సజావుగా సరఫరా జరిగేలా చూసుకోవడంపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ ఎంపి కార్తీ చిదంబరం అన్నారు. వాణిజ్య సంస్థలు, దేశీయ వినియోగదారులు డిమాండ్‌పై గ్యాస్ పొందగలిగితే, ఎటువంటి భయాందోళన ఉండదవన్నారు. ప్రభుత్వం సరఫరా గొలుసుపై దృష్టి సారించి, గృహాలు, సంస్థలు రెండింటికీ తగినంత సరఫరాను నిర్ధారించాలలన్నారు. తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు సౌగత రాయ్ కూడా పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు ఎల్‌పిజి లేకపోవడం వల్ల విద్యార్థులు, హోటళ్ళు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. పరిస్థితి నిజంగా చాలా దారుణంగా ఉందని, ఎల్‌పిజి లేకపోవడం వల్ల విద్యార్థులు, హోటళ్ళు ఇబ్బంది పడుతున్నాయని, కొన్ని తక్షణ చర్యలు తీసుకోవాలని రాయ్ అన్నారు.

## అవసరం లేకపోయినా గ్యాస్ బుక్ చేయొద్దు: కేంద్రం విజ్ఞప్తి

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా ఘర్షణలతో ఇంధన భయాలు నెలకొన్న వేళ.. దేశంలో ఎల్‌పిజి కొరత లేదని కేంద్రప్రభుత్వం పునరుద్ఘాటించింది. గ్యాస్ గురించి ఆందోళన చెందవద్దని, దేశీయంగా ఎల్‌పిజి ఉత్పత్తి 30 శాతం పెరిగిందని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో గ్యాస్ డిమాండ్‌లో భారీ వ్యత్యాసం కనిపిస్తోందని, అవసరం లేకపోయినా ఆందోళనతో బుకింగ్‌లు చేయొద్దని సూచించారు. 'యుద్ధానికి ముందు రోజుకు 55.7 లక్షల సిలిండర్లు బుక్ అయ్యేవి. ఇప్పుడు ఆ సంఖ్య అమాంతం 75.7 లక్షలకు పెరిగింది. అంటే ఆందోళనతో బుకింగ్‌లు పెరుగుతున్నాయని తెలుస్తోంది. ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం' అని ఆమె పేర్కొన్నారు. 'ముడిచమురు విషయానికొస్తే.. మనవద్ద 258 మిలియన్ మెట్రిక్ టన్నుల రిఫైనింగ్ సామర్థ్యం ఉంది. పెట్రోల్, డీజిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాం. ప్రస్తుత పరిస్థితుల్లో కచ్చితంగా దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం లేదు. మన రిఫైనరీలు 100 శాతం సామర్థ్యంతో పని చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని అన్నారు.

## ఎంపిల సస్పెన్షన్ రద్దు చేయండి

- ప్రతిపక్ష ఎంపిల డిమాండ్

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలి భాగంలో అనుచితంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ ఏడుగురు కాంగ్రెస్ సభ్యులు, ఒక సిపిఐ(ఎం) ఎంపి సస్పెన్షన్‌నుకు గురయ్యారు. అయితే వారి సస్పెన్షన్ రద్దు చేయాలని ప్రభుత్వం, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ప్రతిపక్షాలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్, ఎస్‌పి చెందిన ధర్మేంద్ర యాదవ్, ఎన్‌సిపి (ఎస్‌పి)కి చెందిన సుప్రియా సూలే, డిఎంకెకి చెందిన కనిమొళి, టిఎంసికి చెందిన శతాబ్ది రాయ్ గురువారం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజును కలిసి ఎనిమిది మంది ప్రతిపక్ష ఎంపిల సస్పెన్షన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈ విషయాన్ని స్పీకర్‌తో చర్చిస్తానని రిజిజు వారికి హామీ ఇచ్చినట్లు వర్గాలు పేర్కొన్నాయి. శుక్రవారం జరిగిన బిఎసి సమావేశంలో కాంగ్రెస్ చీఫ్ విప్ కె. సురేష్ స్పీకర్, రిజిజుతో వద్ద ఈ అంశాన్ని లేవనెత్తారు. సంప్రదింపుల తర్వాత ఈ అంశంపై వారిని సంప్రదిస్తానని రిజిజు ప్రతిపక్షానికి చెప్పారని వర్గాలు తెలిపాయి. ప్రతిపక్షం, ప్రభుత్వం మధ్య సస్పెండ్ చేయబడిన ఎంపిల సమస్య మాత్రమే ఇరుకున పడుతోందని, పశ్చిమాసియా వివాదం, భారతదేశ ఇంధన భద్రతపై దాని ప్రభావంపై నిబంధన 193 కింద చర్చకు ప్రభుత్వం కూడా అంగీకరించే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. కాగా, ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య వివాదం తీవ్రతరం కావడంతో, ఏడుగురు కాంగ్రెస్ సభ్యులు, ఒక సిపిఐ(ఎం) ఎంపి ఫిబ్రవరి 3న లోక్‌సభ నుంచి సస్పెండ్ అయ్యారు. ఏప్రిల్ 2న ముగిసే బడ్జెట్ సమావేశాల మిగిలిన భాగం వరకు వారి సస్పెన్షన్ కొనసాగనుంది. సస్పెండ చేయబడిన సభ్యుల్లో గుర్జీత్ సింగ్ అజ్లా, హిబి ఈడెన్, సి కిరణ్ కుమార్ రెడ్డి, అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, ప్రశాంత్ పడోల్ మరియు డీన్ కురియాకోస్ (అందరూ కాంగ్రెస్), ఎస్ వెంటకేశన్ (సిపిఐ(ఎం)) అన్నారు. అయితే సస్పెండ చేయబడిన ఎంపిలు పార్లమెంటు మకర్ ద్వార్ మెట్లపై కూర్చొని వివిధ అంశాలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ సహా అనేక మంది ప్రతిపక్ష నాయకులు అప్పుడప్పుడు వారితో చేరారు.

## కొత్త పార్టీ పేరును ప్రకటించిన శశికళ

- 'ఆల్ ఇండియా పురచ్చి తలైవార్ మక్కల్ మున్నేట్ర కజగం'గా నామకరణం




**చెన్నై:** తమిళనాడు దివంగత మాజీ సిఎం జయలలిత సన్నిహితురాలు, అన్నాడిఎంకె మాజీ జనరల్ సెక్రటరీ వికె శశికళ.. కొత్త పార్టీని స్థాపించారు. ఆ పా ర్టీకి 'ఆల్ ఇండియా పురచ్చి తలైవార్ మక్కల్ మున్నేత్ర కజగం' అని నామకరం చేశారు. ఎఐపిటిఎంఎంకె పేరును శుక్రవారం ఆమె వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 24వ తేదీన రామనాథపురం జిల్లాలోని కాముతి లో జరిగిన సమావేశంలో పార్టీ జెండాను శశికళ ఆవిష్కరించిన విషయం తెలిసిందే. కొబ్బరిచెట్ల ఫార్మ్‌ను పార్టీ బొమ్మగా ప్రకటించారు. ప్రస్తుతం శశికళ వయసు 71 ఏళ్లు. త్వరలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తమ పార్టీ సింబల్ ఐక్యతకు సంకేతం అని ఆమె అన్నారు. తమ పార్టీ ఓ ఉమ్మడి కుటుంబం తరహాలో పని చేస్తుందన్నారు.

## అప్‌డేట్ పేరుతో మోసం

- రూ. 4 లక్షలు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు
- మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఘటన

**ముంబయి:** వంట గ్యాస్ కొరత నేపథ్యంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లు అప్‌డేట్ పేరుతో ఇద్దరు మహిళలను మోసగించారు. వారి బ్యాంకు ఖాతాల నుంచి రూ.4 లక్షలు కొల్లగొట్టారు. ఫిర్యాదులు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కల్యాణ్–డోంబివ్లి ప్రాంతానికి చెందిన ఇద్దరు మహిళలను సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేశారు. గ్యాస్ కొరత నేపథ్యంలో మహానగర్ గ్యాస్ లిమిటెడ్ డిస్ట్రిబ్యూటర్ సంస్థ ప్రతినిధుల పేరుతో వారికి ఫోన్ చేశారు. గ్యాస్ సిలిండర్ కనెక్షన్ సమాచారం అప్‌డేట్ చేసుకోవాలని చెప్పారు. వారి మొబైల్ ఫోన్లకు ఎపికె ఫైల్ పంపారు. దానిని డౌన్‌లోడ్ చేయించి ఓపెన్ చేయించారు. కాగా, ఒక ఫారమ్ పూరించాలని ఇద్దరు హిళలకు సైబర్ నేరగాళ్లు సూచించారు. వారు ఆ ప్రక్రియ పూర్తి చేయగా వారి బ్యాంకు ఖాతాల నుంచి సుమారు రూ. 4 లక్షలు డెబిట్ అయ్యాయని మెసేజ్‌లు వచ్చాయి. మరోవైపు ఆందోళన చెందిన బాధిత మహిళలు డోంబివ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆన్‌లైన్ ఆర్థిక మోసాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి సుహాస్ హెమాడే తెలిపారు. ఇరాన్ యుద్ధం వల్ల దేశంలో నెలకొన్న గ్యాస్ కొరత నేపథ్యంలో ఇలాంటి ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయని చెప్పారు. సైబర్ స్కామ్‌ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.




## సెలవులు తప్పనిసరి చేస్తే ఎవరికీ ఉద్యోగాలు ఇవ్వరు

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ :** మహిళల నెలసరి సెలవులకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళా విద్యార్థులు, కార్మికులకు నెలసరి సెలవులు కల్పించే దేశవ్యాప్త విధానాన్ని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) స్వీకరించడానికి అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. రుతుక్రమ సెలవులు తప్పనిసరి చేస్తే ఎవరూ వారికి ఉద్యోగాలు ఇవ్వరని అభిప్రాయపడింది. అలాంటి చట్టం చేస్తే తాము పురుషుల కంటే తక్కువ అన్న భావన మహిళల్లో కలిగే అవకాశం ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీ బెంచ్ అభిప్రాయపడింది. సంస్థల యాజమాన్యాల మనస్తత్వం మీకు తెలియదంటూ ఫిటిషన్‌దారును ఉద్దేశించి వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా, చట్టం ద్వారా నెలసరి సెలవులను తప్పనిసరి చేయడం వల్ల కలిగే సామాజిక పరిణామాల గురించి ప్రధాన న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఆ విషయంలో మహిళల్లో నెలసరి అంశంపై అవగాహన కల్పించడం వేరని, దానిని సెన్సేషన్ చేయడం వేరని బెంచ్ పేర్కొంది. ఒకవేళ నెలసరి సెలవును తప్పనిసరి చేస్తూ చట్టాన్ని తీసుకువస్తే, ఆ మరుక్షణమే ఎవరూ వారిని నియమించుకోరని తెలిపింది. ఈ సందర్భంగా, పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ఎం ఆర్ షంషద్, కొన్ని రాష్ట్రాలు, సంస్థలు ఇప్పటికే రుతుక్రమ సెలవులను కల్పించడానికి చర్యలు తీసుకున్నాయని ఆయన ఎత్తి చూపారు. అందుకు కేరళలో తీసుకున్న చర్యలను ఉదహరించారు. అక్కడ పాఠశాలల్లో సడలింపులు ప్రవేశపెట్టారని, అనేక ప్రైవేట్ కంపెనీలు స్వచ్ఛందంగా ఉద్యోగులకు సెలవులను అందించాయని ఆయన గుర్తుచేశారు. ఈ విషయంపై బెంచ్ స్పందిస్తూ, ఆ నిర్ణయాలన్నీ వారు స్వచ్ఛందంగా తీసుకున్నారని సిజెఐ అన్నారు. కానీ చట్టం ద్వారా అలాంటి నిబంధనలను తప్పనిసరి చేయవద్దని హెచ్చరించారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూ సేకరణ) శాఖ
**ఫారం-VI**
**(ప్రాథమిక నోటిఫికేషన్)**

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైనపరిహారాన్ని పొందే హక్కు చట్టం - 2013, కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) మరియు రూల్ 19 సబ్ రూల్ (1) ను అనుసరించి.

కలెక్టర్ ఫైల్ నం.G3/1268/2018 తేది: 12.03.2026
రెవెన్యూ డివిజనల్ అధికారి ఫైల్ నం. H/390/2026 తేది: 09.03.2026
గెజిట్ ఫైల్ నం. 18/2026 తేది: 12.03.2026

తెలంగాణ ప్రభుత్వము/ జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి ఆదేశానుసారం దిగువ నిర్దిష్ట పరచిన సిద్దిపేట జిల్లాలోని, కొమురవెళ్ళి మండలములోని అయినాపూర్, పోసాన్ పల్లి మరియు కొమురవెళ్ళి గ్రామములలో ఉన్న భూమి విస్తీర్ణం ఎ. **31.25 1/2 గుంటలు** ప్రజా ప్రయోజన నిమిత్తం అనగా జె చొక్కారావు దేవాదుల ప్రాజెక్టు కుడి కాలువ మరియు ఎడమ కాలువ నిర్మాణం నిమిత్తం కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పన పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ఈ ప్రకటన జారీ చేయనైనది. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 63, IRRIGATION & CAD (LA.R&R / A2) DEPARTMENT, తేది: 29.07.2017 ద్వార నీటి పారుదల మరియు కమాండ్ ఏరియా డెవలప్ మెంట్ శాఖ వారు 10-A అనుసరించి సోషల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ మరియు ఆహార భద్రతను మినహాయింపు ఇవ్వనైనది.
కావున సిద్దిపేట జిల్లాలోని కొమురవెళ్ళి మండలములోని అయినాపూర్, పోసాన్ పల్లి, మరియు కొమురవెళ్ళి గ్రామములలో ఉన్న భూమి విస్తీర్ణం **ఎ.31.25 1/2 గుంటలు** గల భూమి యొక్క వివరములు, ఈ క్రింద చూపిన భూసేకరణపనుల ప్రారంభ నిమిత్తం, ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేయనైనది.

| క్ర.సం. | సర్వే నెం. | [illegible] | [illegible] | [illegible] | భూమి పట్టాదారు/ అనుభవదారు పేరు మరియు చిరునామా | [illegible] | [illegible] | [illegible] | [illegible] | నిర్మాణాలు / వృక్షములు మరియు ఇతరములు (సంఖ్య మరియు రకంతో సహా) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| కొమురవెళ్ళి గ్రామము 1LA-D3-LMC | | | | | | | | | | |
| 1 | 438 | ప్రభుత్వ భూమి (అసైన్డ్ పట్టా) | ఖుష్కీ | 19-37 3/4 | అసైన్డ్ దార్ / ఇతరులు | 438 | 458 | 452 | 438 | |
| 2 | 441/A1/3/1 | పట్టా | ఖుష్కీ | 0-28 1/2 | పాశంకిష్టమ్మ భర్త సిద్దయ్య | 440 | 442 | 441 | 442 | |
| 3 | 442/B2/1 442/B2/2 3.442/B3/1 4.442/B4/1 5.442/B4/2 | పట్టా | ఖుష్కీ | 0-35 | 1.కోల అన్న రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి 2.పండి సంపత్ యాదవ్ తండ్రి వెంకటయ్య 3. నాలువల రవీందర్ తండ్రి కిషన్ పటేల్ 4. బుర్ర జలజ భర్త మధు సూదన్ రెడ్డి 5. వుల్లాసగుల ఏకనందం తండ్రి వెంకటరామయ్య | 440 | 438 | 441 | 438 | |
| 4 | 1.447/A2/1 2.447/A3 | పట్టా | ఖుష్కీ | 0-25 0-25 | 1.జంగపల్లి నారాయణ తండ్రి రాములు 2.జంగపల్లి రాజయ్య తండ్రి రాములు | 446 | 438 | 438 | 438 | |
| | | | | 0-22 1/2 | 1.జంగపల్లి లక్ష్మ య్యతండ్రి కొమురయ్య | | | | | |
| 5 | 452/A/3/1 | పట్టా | ఖుష్కీ | 0-06 1/4 | సార్ల మీన్నమ్మ భర్త యాదయ్య | 478 | 452 | 477 | 438 | |
| | 452/B | | | 0-06 1/4 | Guniganti Farms Pvt Lmt @ BUSHARANI | | | | | |
| 6 | 1.478/B/1/1 2.478/B/4 3. 478/B/2/1 4.478/B/3/1 | పట్టా | ఖుష్కీ | 0-07 1/4 | 1. ఓర రామ్మోహన్ తండ్రి రామచంద్రం 2. కొమురవెళ్ళి రమేష్ తండ్రి రాజేశం 3. సరాఫ్ చంద్రకళ భర్త మోహన్ దాస్ 4. అన్నడి రామకృష్ణ తండ్రి భూపతి రెడ్డి | 478 | 452 | 477 | 438 | |
| | 478/A2/1 | | | 0-23 | సార్ల రాజు తండ్రి మల్లయ్య | | | | | |
| కొమురవెళ్ళి గ్రామం మొత్తం విస్తీర్ణం : 24.16 1/2 | | | | | | | | | | |
| పోసానపల్లి TAIL CHANAL OF TUNNEL OG RMC | | | | | | | | | | |
| 1 | 242/E/1 | పట్టా | ఖుష్కీ | 0-12 | ఎర్రబోయిన బూలక్ష్మి తండ్రి మల్లయ్య | 243 | VB | 246 | 241 | |
| పోసన్ గ్రామం మొత్తం విస్తీర్ణం | | | | 0.12 | | | | | | |
| అయినాపూర్ 1LA-D3-LMC | | | | | | | | | | |
| 1 | 144 | పట్టా | ఖుష్కీ | 0.35 | బెజ్జంకి జయ ప్రకాశ్ రావు తండ్రి రాజగోపాల్ రావు (వుడెం గోవర్ధన్ రెడ్డి తండ్రి దశరథ రెడ్డి) | 145 | 143 | VB | 145 | |
| 2 | 143 | పట్టా | ఖుష్కీ | 0.07 | వుడెం గోవర్ధన్ రెడ్డి తండ్రి దశరధరెడ్డి | 144 | 145 | | 142 | |
| 3 | 143 | పట్టా | ఖుష్కీ | 0.33 | 1. పాశం బాలయ్య తండ్రి మల్లయ్య 2. శరమల్లు కనకయ్య తండ్రి మల్లయ్య | 144 | 145 | | 142 | |
| | | పట్టా | ఖుష్కీ | 0.14 | అమరేందర్ రెడ్డి | 144 | 145 | | 142 | |
| 4 | 142 | పట్టా | ఖుష్కీ | 1.19 | వుడెం గోవర్ధన్ రెడ్డి తండ్రి దశరధ రెడ్డి | 145 | 143 | 143 | 140 | |
| 5 | 140 | ప్రభుత్వ భూమి | ఖుష్కీ | 3.09 | అసైన్డ్ దార్/ ఇతరులు | 143 | 136 | | 116 & 156 | |
| అయినాపూర్ గ్రామం మొత్తం విస్తీర్ణం | | | | 6.37 | | | | | | |
| కొమురవెళ్ళి మండలం మొత్తం విస్తీర్ణం | | | | 31.25 1/2 | | | | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013, సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూయజమానులకు చట్టప్రకారం భూనష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీచేయనైనది.
భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్ సిద్దిపేట మరియు భూసేకరణ అధికారి, సిద్దిపేట వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయాల పనివేళలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ సిద్దిపేట గారు మరియు భూసేకరణ అధికారి, సిద్దిపేట గారిని మరియు వారి సిబ్బంది ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్-12 ప్రకారం పై తెలిపిన భూములలో యేదేని ప్రదేశములో ప్రవేశించి సర్వే జరిపి భూకమతాన్ని కొలిచే అధికారం, భూమిని త్రవ్వటానికి లేదా భూ స్వరూపం తెలుపు బోర్ వెయ్యటానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడానికి అనుమతించనైనది.
సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి అనుమతి లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన తేది నుండి ఆ నోటిఫికేషన్ లో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి కొనుగోలు/ అమ్మకాలు/ తాకట్లకు సంబంధించిన చర్యలు చేపట్టరాదు.
ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ అనంతరం పైన చూపిన భూములలో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైన భూసేకరణ పై సెక్షన్ 15 (1) ప్రకారం అభ్యంతరములు ఉన్నచో, ఇట్టి నోటిఫికేషన్ జారీ చేసిన (60) దినములలో భూసేకరణ అధికారి ముందు వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- తహసిల్దార్, కొమురవెళ్ళి మండలం
సం/- రెవెన్యూ డివిజనల్ అధికారి సిద్దిపేట సిద్దిపేట జిల్లా
సం/- కలెక్టర్ సిద్దిపేట జిల్లా

DIPR RO NO. 1285/LA/PP/Advt/Pub/2025-26

**FORMAT C-2**

**Declaration about Criminal Antecedents of Candidates set up by the party**

*(As per the judgement dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 201l (Public Interest Foundation & Ors. Vs. Union of India &Anr.)*

**Name of the Political Party: INDIAN NATIONAL CONGRESS**
**Name of Election : Biennial Elections to the Council of States (Rajya Sabha), 2026.**
**Name of State/UT : TELANGANA**

| 1. | 2. | 3. | 4. | | 5. | | |
|---|---|---|---|---|---|---|---|
| Sl. No. | Name of the Constituency | Name of Candidate | (A) Pending Criminal Cases | | (B) Details about cases of conviction for criminal cases | | |
| | | | Name of Court, Case No. & Status of the Case(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) | Name of Court, Case No. & Status of theCase (s) | Description of Offence (s) & Punishment Imposed | Maximum Punishment Imposed |
| 1 | Election to The Council of States fromTelanganaState Legislative Assembly | **Dr. Abhishek Manu Singhvi** | Additional Chief Judicial Magistrate, (Economic Offence), Jodhpur. There is no case number as the procedure is that till cognizance is taken by the magistrate, no case number is assigned. Prosecution complaint filed before court of Ld. Addl. Chief Judicial Magistrate (Economic Offence) Jodhpur moved on 04.01.2021. Since 04.01.2021, no notice has been issued to the undersigned. These details were discovered by the undersigned pursuant to additional affidavit on behalf on CBDT served on undersigned on 07.01.2021 in WP 11176/20 at Delhi High Court. | Complaint is filed under section 276C (1), 277 of Income Tax Act 1961 read with Section 420 of IPC 1860. The IT department filed prosecution complaint for AY 2010-11, 2011-12, 2012-13 on 4.1.21 before the court of Ld. Addl. Chief Judicial Magistrate (Economic Offence) Jodhpur. Wherein the department has pleaded that the undersigned has inflated expenses causing wrongful loss to government and wrongful gain to himself and has willfully attempted to evade tax. | Not Applicable | Not Applicable | Not Applicable |

# ఇంతగా రాజీపడాలా?

పశ్చిమాసియాలో ప్రస్తుత యుద్ధానికి కారకులెవ్వరూ అని సామాన్యులను ప్రశ్నించినా ఇజ్రాయెల్, అమెరికా అని వెంటనే సమాధానం చెబుతారు. కానీ మన నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఆ మాత్రం ధైర్యం కోరవడింది. అమెరికాతో అది ఎంతగా రాజీపడిందో దాని చర్యలే నిరూపిస్తున్నవి. అయినా అది సిగ్గువిడిచి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ, 'మేము శాంతిని కోరుకుంటున్నాం', చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాలి' అంటూ హితోపదేశాలు చేస్తున్నది. భారతదేశాన్ని అంతర్జాతీయంగా ఒక బలమైన వాణిగా నిలిపిన దాని సామ్రాజ్యవాద వ్యతిరేక, వలసవాద వ్యతిరేక అలీన విదేశాంగ విధానానికి సామ్రాజ్యవాద అనుకూల బిజెపి ప్రభుత్వం తిలోదకాలిచ్చింది. అలీనోద్యమ ఉన్నత పీఠం నుండి ఎప్పుడైతే ప్రభుత్వం తనకుతానుగా కిందకు దిగిందో గ్లోబల్ సౌత్ (భూగోళం దక్షిణార్థగోళం లేదా పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలు నాయకత్వాన్ని అది నైతికంగా కోల్పోయింది. తాజా అంతర్జాతీయ పరిణామాల్లో భారతదేశ నిష్క్రియాపరత్వం మోదీ ప్రభుత్వ పిరికితనాన్ని వెల్లడిస్తున్నది. అమెరికాతో పరస్పర ప్రయోజన దాయక వ్యాపార, శాస్త్ర, సాంకేతిక సంబంధాలు అభిలషణీయం. అయితే అధ్యక్షుడు ట్రంప్ వంగమంటే సాగిలపడినట్లుగా ఉంది ప్రధాని నరేంద్రమోదీ వ్యవహారం. ట్రంప్ ప్రపంచ టెర్రరిస్టులాగా వెనిజులాపై దాడిచేసి దాని అధ్యక్షుడు మదురో దంపతులను బందీలుగా అమెరికా పట్టకెళితే ఆ చర్యను ఖండించలేకపోవటం 140 కోట్ల జనాభా కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి, దాని 56 అంగుళాల ప్రధాన మంత్రికి తలవంపులు కాదా? పాలస్తీనా పితృదేశ డిమాండ్‌ను ఆదినుంచీ బలపరుస్తున్న, వారి పోరాటానికి సంఘీభావంగా నిలబడుతున్న భారతదేశం, గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండను ఖండిస్తూ నోరెత్తలేకపోవటం ఎంతటి దౌర్భాగ్యం! పైగా మన ఘనత వహించిన ప్రధానమంత్రిగారు ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లి, పార్లమెంట్‌లో ప్రసంగిస్తూ ఇజ్రాయెల్‌పై పాలస్తీనా తీవ్రవాద సంస్థ హమస్ దాడిని టెర్రరిస్టు చర్యగా ఖండించారు. ఆ తర్వాత మూడేళ్లుగా ఇజ్రాయెల్ గాజాపై సాగిస్తున్న విధ్వంసం, బాల, వృద్ధులు, రోగులు సహా 70 వేల మందికి పైగా దుర్మరణం మోదీ కంటికి కనపడలేదు. ఇజ్రాయెల్‌తో సంఘీభావం ప్రకటించారు. ఆయన తిరుగు ప్రయాణమైన మరునాడే ఇజ్రాయెల్, అమెరికాలు జట్టుగా ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపించాయి. ఆ దేశ సర్వోన్నతాధికారి అయతుల్లా అలీ ఖమేనీ సహా పలువురు ముఖ్యనేతలను హతమార్చితే ఆ ఘోరాన్ని ఖండించలేని పిరికితనాన్ని ప్రదర్శించింది మోదీ ప్రభుత్వం. వారం రోజుల తర్వాత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారి ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయానికి వెళ్లి ఖమేనీ మరణానికి సంతాపం తెలియజేసే లాంఛనం పూర్తి చేశారు. కాని రాజకీయ నాయకత్వానికి ఆ ధైర్యం ఎందుకు లేకపోయింది? ట్రంప్‌కు కోపం తెప్పించే ఏ పనీ చేయలేనంతగా నాయకత్వం దిగజారింది. రోజూ ఏదోక అంశంపై మీడియాలో యాగిచేసే బిజెపి వాగడంబరుల నోళ్లు ఈ అంశంపై ఎందుకు మూగపోయాయి? గల్ఫ్ దేశాలపై ఇరాన్ వైమానిక దాడులను ఖండిస్తూ ఐరాస భద్రతామండలి ముందుకు వచ్చిన ఒక తీర్మానానికి భారత ప్రభుత్వం సహ ప్రతిపాదకురాలు కావటంలో ఆశ్చర్యం లేదు. ఆ తీర్మానం పశ్చిమాసియాలో ప్రస్తుతం జరుగుతున్న యుద్ధంలో అమెరికా. ఇజ్రాయెల్ చర్యలను కాకుండా ఇరాన్ చర్యలను మాత్రమే ఖండించింది. గల్ఫ్ సహకారమండలి (జిసిసి),134 దేశాల తోడ్పాటుతో బుధవారం ప్రతిపాదించిన ఆ తీర్మానం జిసిసి సభ్యదేశాలపై ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ సాగిస్తున్న దాడులన్నింటినీ 'తక్షణం నిలుపుదల' చేయాలని కోరింది. భద్రతామండలి సభ్యుల్లో 13మంది అనుకూలంగా ఓటు చేయగా రష్యా, చైనా ఓటింగ్‌లో పాల్గొనలేదు. అవి వీటో కూడా చేయలేదు. ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూసివేసిన చర్యలు, బెదిరింపుల ద్వారా ఆ జలమార్గం ద్వారా అంతర్జాతీయ నౌకారవాణాను అడ్డుకోవటాన్ని కూడా తీర్మానం ఖండించింది. అది సరైనదే. అయితే జిసిసి దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ ప్రతీకార దాడులకు హేతువైన అమెరికా, ఇజ్రాయెల్ బాంబుదాడులను ఖండించకపోవటం ధర్మబద్ధం అవుతుందా? ఇరాన్‌నే ఖండించటం న్యాయసమ్మతమా! తీర్మానానికి కోస్పాన్సర్‌గా ఉండటానికి భారత ప్రభుత్వం చెప్పిన కారణం చిత్రంగా ఉంది. 'జిసిసి దేశాల్లో పెద్ద సంఖ్యలో భారతీయ సంతతి పనిచేస్తున్నారు. వారి బాగోగులు, సంక్షేమం మాకు అత్యంత ప్రాధాన్యం . మా ఇంధన అవసరాలు తీర్చుకోవటానికి కూడా మాకు గల్ఫ్ ఎంతో ముఖ్యం. అని విదేశాంగ శాఖ అధికారప్రతినిధి రణధీర్ జైశ్వాల్ సమర్థించారు. ఇరాన్‌లో కూడా 9వేల మంది భారతీయులున్నారు. భారత్ 2019 నుంచి ఆయిలు దిగుమతులు నిలిపివేసింది. విశాఖపట్నంలో నావికా విన్యాసాల్లో పాల్గొని తిరిగి వెళుతున్న ఇరాన్ నౌక 'ఐరిస్ దేన'ను హిందూమహాసముద్ర జల్లాలో మన అంతర్జాతీయ జలాలకు దగ్గర్లో అమెరికా జలాంతర్గామి పేల్చివేస్తే నోరువిప్పని మన ప్రభుత్వం అమెరికా, ఇజ్రాయెల్ దురాగతాలకు వ్యతిరేకంగా నోరువిప్పాలని ఆశించటం అత్యాశే అవుతుంది. ●



## రాజ్యాంగం ప్రజల గొంతుక

రాజ్యాంగం ప్రజల గొంతుక, నాథూరామ్ గాడ్సే, వీర్ సావర్కర్‌లది కాదు. తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగ సిద్ధాంతాన్ని పాటించరు. మోదీ ఎప్‌స్టీన్, గౌతమ్ అదానీతో రాజీ పడడం వల్ల అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భారత్ ప్రయోజనం పొందలేకపోయిందది. నరేంద్ర మోదీ ఇకపై భారతదేశ ప్రధాని కాదు. ఆయన అమెరికా కోసం పనిచేస్తున్నారు. కాంగ్రెస్ పేదల పార్టీగా మారింది. అదే సమయంలో బిజెపి మాత్రం ధనవంతుల పార్టీగా మారింది. బిజెపి, మోదీ దేశ సంపద మొత్తాన్ని అదానీ చేతుల్లో పెట్టేశారు.

లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ



# వెదురు బతుకులకు ప్లాస్టిక్ ఉరి

## మూలన పడుతున్న మేదరి కులవృత్తి.. అల్లికల బతుకుల ఆకలి కేకలు

ఒకప్పుడు పల్లెల్లో వెదురు అల్లికల సవ్వడి విరివిగా వినిపించేది. చాటలు, గంపలు, తట్టలు లేని ఇల్లు ఉండేది కాదు. కానీ కాలక్రమేణా ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పెరగడంతో మేదర వృత్తిపై ఆధారపడిన కుటుంబాల జీవనం అస్తవ్యస్తంగా మారింది. వెదురుతో అద్భుతమైన కళాఖండాలను సృష్టించే మహేంద్రులు నేడు ఉపాధి కరువై రోడ్డున పడుతున్నారు. అడవి నుంచి వెదురు సేకరణలో అటవీ అధికారుల ఆంక్షలు, మార్కెట్లో ప్లాస్టిక్ పోటీ వెరసి ఈ కుల వృత్తి అంతరించిపోయే దశకు చేరుకుంది. రాబోయే రోజుల్లో మేదరి వృత్తి కేవలం పుస్తకాలకే పరిమితమయ్యే ప్రమాదం కనిపిస్తోంది.

### శ్రమకు అందని ప్రతిఫలం కన్నీరు పెడుతున్న కళ

మేదరులు ఎక్కడ వెదురు విరివిగా దొరుకుతుందో అక్కడికి వెళ్లి శ్రమకోర్చి వెదురును సేకరిస్తారు. వాటిని నిలువునా చీల్చి, ఎండబెట్టి, ఎంతో ఓపికతో అల్లికలు చేస్తారు. ఇలా అల్లిన వస్తువులను అంగళ్లలో, వార సంతల్లో విక్రయిస్తే వచ్చే కొద్దిపాటి ఆదాయంతోనే వారి జీవనం సాగుతుంది. గతంలో ధాన్యపు గుమ్ములు, గొర్రెల తడకలు, నిచ్చెనలు, తరాజులు వెదురు తడకలు, బుట్టలు, చాటలు, గంపలు, పెళ్లి పందిళ్లకు వాడే సామగ్రి, మొక్కల పెంపకానికి కావాల్సిన చిన్న బుట్టలు,పూలతొట్టీలు, విసనకర్రలు, పొయ్యి గొట్టాలు, ఆట వస్తువులు, తరాజు బుట్టలు వంటి వస్తువులను మేదరులు ఎంతో కళాత్మకంగా తీర్చిదిద్దుతారు. ప్లాస్టిక్ వాడకం పెరగడంతో ఈ సహజసిద్ధమైన వస్తువులకు ఆదరణ తగ్గిపోయింది. మేదరుల కష్టం గిట్టుబాటు కావడం లేదు. కుటుంబమంతా రేయింబవళ్లు కష్టపడినా కనీసం రోజువారీ కూలీ కూడా రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ముడిసరుకు కొరత.. అధికారుల ఆంక్షలు

గతంలో అడవులు దట్టంగా ఉండటం వల్ల కంక బొంగులు విరివిగా లభించేవి. కానీ అడవులు అంతరిస్తుండటంతో ముడిసరుకు కొరత ఏర్పడింది. అడవి నుంచి వెదురు తెచ్చుకుందామంటే అటవీ అధికారులు ఆంక్షలు విధిస్తున్నారని, దీనివల్ల వృత్తిని కొనసాగించడం భారంగా మారిందని బాధితులు పేర్కొంటున్నారు. ముడిసరుకు లభించక, తయారు చేసిన వస్తువులకు ఆదరణ లేక మేదరి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. పిల్లల చదువులు, ఇతర అవసరాలకు కూడా సంపాదన సరిపోని దుర్భర స్థితిలో వీరు కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సబ్సిడీ రుణాలు, పింఛన్లు అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

### కుటుంబ పోషణ భారంగా మారింది



నా వయస్సు 60 ఏళ్లు. గత 45 ఏళ్లుగా మేదరి వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాను. అటవీ అధికారులు అడవి నుంచి వెదురును తీసుకురానివ్వడం లేదు. దీని వల్ల కుటుంబ పోషణ భారంగా మారింది. బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందించి ప్రభుత్వం మేదరులను ప్రోత్సహించాలి. లేకపోతే ఈ కులవృత్తి పూర్తిగా కనిపించకుండా పోతుంది.

**– పర్ల కనకయ్య, మేదరి వృత్తిదారుడు**

### ముడిసరుకు అందించి చేయూతనివ్వాలి



నేను చిన్నప్పటి నుంచి వెదురు అల్లికల పనిలోనే ఉన్నాను. ప్లాస్టిక్ వాడకం పెరగడంతో మా వస్తువులను ఎవరూ కొనడం లేదు. ప్రభుత్వం స్పందించి మాకు ముడిసరుకు అందజేయాలి. అలాగే వృత్తిపై ఆధారపడిన వృద్ధులకు పింఛన్లు ఇచ్చి ఆదుకుంటే మా కుటుంబాలకు కొంత ఊరట లభిస్తుంది.

**సరోజ, పొనకల్**

**పార్ల శంకర్, ప్రజాపక్షం విలేకరి జన్నారం**

# నిజాం గుండెల్లో రణభేరి మోగించిన అనభేరి

**నేడు మహ్మదాపూర్ అమరవీరుల 78వ వర్ధంతి**



**చాడ వెంకట్‌రెడ్డి**
**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు నిజాం గుండెల్లో రణభేరి మ్రోగించిన అనభేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతి రెడ్డితో పాటు మరో 10 మంది అమర వీరుల 78వ వర్ధంతిని నేడు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ వద్ద గల అనభేరి ప్రభాకర్ రావు స్మారక విగ్రహం వద్ద, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామ శివారులోని గుట్టల్లో అమరుల స్మారక స్థూపాల వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ. సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నివాళ్ళర్పించి వారిని స్మరించుకునే కార్యక్రమం ప్రతీ సంవత్సరం నిర్వహించుకోవడం కమ్యూనిస్టుల బాధ్యతగా భావిస్తున్నాం, సంతోషిస్తున్నం. అనభేరి ప్రభాకర్ రావు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండ లం పోలంపల్లి గ్రామంలో అనభేరి వెంకటేశ్వరరావు, రాధాబాయి దంపతులకు 1910 ఆగస్టు15న రెండవ సంతానంగా జన్మించారు. 400 వందల ఎకరాలకు పైగా భూములున్న దేశ దేశ్‌ముఖ్‌ల కుటుంబంలో జన్మించిన అనభేరి ప్రభాకర్ రావు ప్రాథమిక విద్యను కరీంనగర్‌లో అభ్యసించి అనంతరం మచిలీపట్నంలో కొన్నాళ్లపాటు చదువుకొని, హైదరాబాద్‌లోని రెడ్డి హాస్టల్‌లో ఉంటూ చాదర్ ఘాట్ హైస్కూల్లో పదవ తరగతి పూర్తి చేశాడు. నిజాం కళాశాలలో ఇంటర్ చదివారు. ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా చిన్న వయస్సులోనే సరళా దేవితో అనభేరి ప్రభాకర్ రావుకు వివాహం జరిగింది. ఆ దంపతులకు సులోచనా దేవి, శకుంతలా దేవి, విప్లవ కుమారి అను ముగ్గురు కుమార్తెలు జన్మించారు. తన స్వగ్రామంలో పటేల్, పట్వారీ, భూస్వామ్య విధానాలకు స్వస్తి పలకాలని, వెట్టి చాకిరి, బానిసత్వం ఉండకూడదని భావించి పాలేరుల పిల్లలను బడిలో చేర్పించాడు గ్రామంలో రైతు మహాసభలు నిర్వహించి వారిని చైతన్యపరిచారు. గ్రామంలో సహకార సంఘాలను ఏర్పాటు చేశాడు, కరీంనగర్‌లో చేనేత సహకార సంఘం ఏర్పాటు చేసి ఆ రోజుల్లోనే 30వేల మందికి రేషన్ కార్డులు ఇప్పించాడు.1942 నుండి 1946 వరకు ఆ సంఘానికి రాష్ట్ర అధ్యక్షులుగా పని చేశాడు. విద్యార్థి దశలోనే నిజాం పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించడం మొదలుపెట్టాడు. ఆంధ్ర మహాసభ పేరుతో బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మాఖ్దూమ్ మోహియుద్దీన్ లాంటి గొప్ప నాయకులు నిర్వహించే సభలు, సమావేశాలకు ఆకర్షితుడై, వారి ఆదేశాలకు అనుగుణంగా ఆంధ్ర మహాసభ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నాడు. 1936 సిరిసిల్లలో జరిగిన ఆంధ్ర మహాసభ నాల్గవ ప్లీనరీలో అనభేరి ప్రభాకర్ రావు కీలక భూమిక పోషించాడు. భారత కమ్యూనిస్టు పార్టీ కరీంనగర్ జిల్లా మొట్టమొదటి కార్యదర్శిగా పనిచేశారు. హైదరాబాద్ సంస్థానంలో నిజాం నవాబుల ఆగడాలు రోజురోజుకు పెట్రేగిపోతున్న రోజుల్లో భూస్వామ్య వ్యవస్థపై, రజాకారుల ఆగడాలపై, గ్రామాల్లో పటేల్ పట్వారీల ఆధిపత్యాన్ని ఎదిరించడానికి ముందుకు వచ్చాడు. 1947లో సెప్టెంబర్ 11న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి రావి నారాయణరెడ్డి,బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మోహియుద్దీన్‌లు పిలుపునివ్వడంతో వందలాది



మంది యువకులు దళాలుగా ఏర్పడి ఉద్యమించడానికి ముందుకు రావడంతో వారందరికీ అనభేరి ప్రభాకర్ రావు నాయకత్వం వహించారు. విజయవాడ, చందా, సిరివంచ,అదిలాబాద్, కరీంనగర్ దళాలకు శిక్షణ ఇచ్చాడు. మొట్టమొదటి దళం అనభేరి ప్రభాకర్ రావు గారిదే ఆయన ఒక్కని వద్దనే స్టెన్‌గన్ ఉండేది.హైదరాబాద్ సంస్థానంలోని నిజాం నవాబు వారి తాబేదారులైన దేశ్‌ముఖ్ లు, దొరలు, పటేల్, పట్వారీలు, రజాకార్ పోలీసులు ప్రజలను పట్టిపీడిస్తూ, పన్నులు వసూలు చేస్తూ, మహిళలను వివస్త్రలను చేసి అత్యాచారాలకు ఒడిగడుతుంటే చూస్తూ ఊరుకోక చావుకు ఎదురెళ్లి నిజాం ఆధిపత్యాన్ని ప్రశ్నించడం కోసం, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ఉవ్వెత్తున సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అనగారిన వర్గాలకు, పీడిత ప్రజలకు, మహిళలకు అండగా నిలిచి నిజాం నవాబు రజాకార్ల తుపాకీ గుండ్లకు ఎదురొడ్డి వీరోచితంగా పోరాడిన గొప్ప విప్లవకారుడు అనభేరి ప్రభాకర్ రావు. భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేస్తున్న అనభేరి ప్రభాకర్ రావుకు తాలూకాదార్ పదవి ఇస్తానని నిజాం సర్కార్ కబురు పెట్టినా లెక్కచేయలేదు. నిజాం సర్కార్ అనభేరిపై నజర్ బంద్ ప్రకటించినా సర్కార్‌కు నిద్రలేకుండా చేసిన ధైర్యశీలీ అనభేరి. నిజాం నవాబుకు, రజాకార్ పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న అనభేరి ప్రభాకర్ రావుని పట్టిస్తే రూ.50 వేల నజరానా ఇస్తామని నిజాం ప్రభుత్వం ప్రకటించిందంటే అనభేరి వారికి ఎంతటి టార్గెట్ అయ్యాడో అర్థం చేసుకోవచ్చు. అణభేరిని లొంగదీసుకోవడం కోసం నిజాం సర్కార్ చేయని ప్రయత్నం లేదు. నేనెప్పుడూ పేదల పక్షమే అని చాటిచెప్పిన గొప్ప విప్లవ యోధుడు అనభేరి ప్రభాకర్ రావు.1948 మార్చి 14 న అనభేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతి రెడ్డిల దళం హుస్నాబాద్‌కు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహమ్మదాపూర్ గ్రామంలో భోజనం చేస్తుండగా రజాకార్ పోలీసులు చుట్టుముట్టడంతో గ్రామంలో అయితే అమాయక ప్రజల ప్రాణాలకు ప్రమాదం జరుగుతుందనే ఉద్దేశ్యంతో దళ మంతా గ్రామ సమీపాన గల గుట్టల వైపు పరిగెత్తింది. దళ సభ్యులు నలుదిక్కులు వెళ్లగా రజాకార్లు కాల్పులు జరపగా దళ సభ్యులు ఒక్కొక్కరుగా నేలకొరుగుతుంటే రజాకార్లపై అనభేరి ప్రభాకర్ రావు వారిని కాపాడడానికి కాల్పులు జరుపుతూ గుట్ట ఎక్కుతుంటే సింగిరెడ్డి భూపతి రెడ్డి అన్నా అని పిలవడంతో అటుగా చూసిన అనభేరి చేతిపై రజాకార్ల కాల్పులు జరిపారు. అయినా మొక్కవోని ధైర్యంతో ఇద్దరు రజాకార్ పోలీసులను చంపారు. అనభేరిని నిరాయుధున్ని చేసి కాల్చి చంపారు. ఆ వీరోచిత పోరాటంలో ప్రభాకర్ రావుతో పాటు దళంలోని తాడూరు గ్రామానికి చెందిన సింగిరెడ్డి భూపతి రెడ్డి, ఒగులాపూర్ గ్రామానికి చెందిన ముస్కు చొక్కా రెడ్డి, ఏలేటి మల్లారెడ్డి, సోమారంపేట గ్రామానికి చెందిన అయిరెడ్డి భూంరెడ్డి, పోరెడ్డి రాంరెడ్డి, బేగంపేట గ్రామానికి చెందిన తూమోజు నారాయణ, నల్గొండ జిల్లాకు చెందిన బి.దామోదర్ రెడ్డి, గాలిపెల్లి గ్రామానికి చెందిన ఇల్లందుల పాపయ్య, రేగడిమద్దికుంట గ్రామానికి చెందిన నల్లగొండ రాజారాం, సిక్కుడు సాయిలు,రేపాక గ్రామానికి చెందిన రొండ్ల మాధవ రెడ్డిలు మొత్తం 12 మంది వీరులు వీరోచితంగా పోరాడి అసువులు బాశారు. దేశ స్వాతంత్ర్యం కోసం, హైదరాబాద్ సంస్థానంలోని నిజాం సర్కారుకు వ్యతిరేకంగా తాడిత, పీడిత ప్రజలకు అండగా నిలిచి వీరోచితంగా పోరాడి తన ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసిన అనభేరి ప్రభాకర్ రావు లాంటి మహనీయుని విగ్రహాన్ని కరీంనగర్ నడిబొడ్డున ప్రధాన కూరగాయల మార్కెట్ చౌరస్తా వద్ద 1994 జనవరి 12న నాటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి గారి చేతుల మీదుగా ప్రారంభించుకోవడం జరిగింది.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో అనేక రాజకీయ పార్టీలు మహ్మదాపూర్ అమరుల త్యాగాలను కొనియాడి నేడు విస్మరించడం కొంత బాధ కలిగించినప్పటికీ భారత కమ్యూనిస్టు పార్టీ గత 77 సంవత్సరాలుగా మహ్మదాపూర్ అమరవీరులను స్మరిస్తూ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో మార్చి 14న కరీంనగర్,మహ్మదాపూర్,హుస్నాబాద్‌లో అమరవీరుల 78వ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.



# సామాన్యులకు చేరువైతేనే రైల్వే ప్రయాణానికి సార్థకత

దూర ప్రయాణాలు చేయవలసిన పేదలకు, సామాన్యులకు, మధ్య తరగతి వాళ్లకు రైళ్ళను మించిన రవాణా సౌకర్యం మరొకటి ఉండదు. ఈ రైళ్లు పేదలకు మరింత అందుబాటులో ఉంటేనే సామాన్యుని కష్టాలు తీరి రైళ్లలో సుఖ ప్రయాణం సాధ్యమవుతుంది. పేదలు అత్యధికంగా ఉండే మన దేశంలో స్లీపర్ క్లాస్ బోగీలు, జనరల్ బోగీలలో విపరీతమైన రద్దీ కారణంగా సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, రోగులు, చిన్నపిల్లలు ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి ప్రయాణం చేసే క్రమంలో కనీసం రైలు బోగీలోకి ప్రవేశించ లేనంత రద్దీ ప్రధాన కారణమవుతుంది. దేశవ్యాప్తంగా 19 రైల్వే జోన్లు, 70 రైల్వే డివిజన్ల ద్వారా సంవత్సరానికి దాదాపు 715 కోట్ల మంది రైల్వే ప్రయాణికులు దేశంలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణిస్తున్నారు. ప్రతి సంవత్సరం దాదాపు 634 కోట్ల మంది ప్రయాణికులు రిజర్వేషన్ లేని జనరల్ క్లాస్, సెకెండ్ క్లాస్ ప్రయాణాలు సాగిస్తుండగా, దాదాపు 81 కోట్ల మంది ప్రయాణికులు స్లీపర్ క్లాస్, ఎసి బోగీలలో ప్రయాణాలు సాగిస్తున్నారు. కోట్ల మంది ప్రయాణికులు తాము భరించగలిగే రైలు చార్జీలతో, రిజర్వేషన్ లేని క్లాసులోనే ప్రయాణం చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. నిర్వహణ, మేనేజ్ మెంట్, మౌలిక సదుపాయాల కల్పన, నూతన ప్రాజెక్టుల కోసం 2025–26 బడ్జెట్‌లో 2,52,300 కోట్లు కేంద్ర ప్రభుత్వం రైల్వే శాఖకు కేటాయించింది. దానిలో రెండు కోట్ల మూడు లక్షల 138 కోట్లు అనగా 80% పైచిలుకు నిధులు కేటాయింపుల మేరకు వినియోగించబడ్డవి. నూతన ట్రాకులు, మౌలికి వసతులు కల్పన, విద్యుదీకరణ, రక్షణ చర్యలకు, ఎసి, నాన్ ఎసి బోగీలు ఆధునీకరించడానికి, రైల్వే స్టేషన్లను ఆధునికరించడానికి ఈ నిధులు అత్యధికంగా వెచ్చించడం జరిగింది. బ్రాడ్ గేజ్ రూట్లలో దాదాపు 99 శాతం విద్యుదీకరణ పూర్తయింది. రైల్వే మార్గాలలో వివిధ ముఖ్యమైన లైన్లను కలుపుతూ స్టేషన్లకు చేర్చే విధంగా దాదాపు 69 వేల 181 కిలోమీటర్ల మెయిన్ ట్రాక్‌లైన్‌లు ఉన్నాయి. ఇది కాకుండా 1,09,748 కిలోమీటర్ల మల్టిపుల్ ట్రాకులు అనేక బిజీ రూట్ల ద్వారా ప్రయాణికులతో పాటు వస్తు సేవల రవాణా కూడా జరుగుతున్నది. అదనపు ట్రాకులు వివిధ యార్డులకు వేసిన ట్రాకులు మొత్తం కలిపి 1,35, 200 కిలోమీటర్ల రవాణా మార్గం రైల్వే శాఖకు దేశవ్యాప్తంగా ఉన్నది.

### 'మెరుగైన సౌకర్యాలతో సమస్యల పరిష్కారం'

అత్యధిక ప్రయాణికులు గత్యంతరం లేని పరిస్థితుల్లోనే సాధారణ భోగిలలో ప్రయాణం సాగిస్తున్నారు. స్లీపర్ భోగిలలో ప్రయాణానికి సిద్ధపడితే దాదాపు 50% అదనపు చార్జీలు చెల్లించవలసి ఉంటుంది. వీటి కన్నా ఎసి క్లాస్‌ల ప్రయాణానికి 100% పైగా అదనపు చార్జీలు చెల్లించి టికెట్ కొనుగోలు చేయాల్సి వస్తుంది. వందే భారత్, రాజధాని, శతాబ్ది లాంటి ఎక్స్ ప్రెస్ రైళ్లలో కేవలం ఎసి బోగీలు తప్ప సాధారణ బోగీలు ఉండడం లేదు. దీంతో సామాన్యులు ఆ రైళ్లలో ప్రయాణించలేని పరిస్థితి ఉన్నది. జనరల్ బోగీలు, స్లీపర్ క్లాస్ బోగీలను ఇలాంటి రైలులో చేర్చక పోవడం వల్ల ప్రయాణికులకున్న హక్కులు ప్రశ్నార్థకం అవుతున్నాయి.



కోటానుకోట్ల మంది సాధారణ ప్రజలు అత్యధికంగా నివసించే భారతదేశం లాంటి దేశాల్లో ఈ తరగతి ప్రయాణికుల పైనే తీవ్ర ప్రభావం చూపుతుంది.

### 'ఆధునిక టెక్నాలజీ వినియోగంతో ఉత్తమ సేవలు'

రాజ్యాంగంలోని అధికరణం 19 (డి) ద్వారా సంక్రమించిన హక్కుల పట్ల ప్రభుత్వం దృష్టి పెట్టవలసిన అవసరం ఉంది. ఆధునిక టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ) తదితర మాధ్యమాల ద్వారా రైలు ప్రయాణికులకు సంబంధించిన అంశాలపై పూర్తి సమాచారం పొందవచ్చు. ఏ రైలు రద్దీగా ఉందో ఏ కోచ్ లో రద్దీగా ఉందో కూడా తెలుసుకోవచ్చు. దానికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించవచ్చు. ప్రజలకు వారికున్న ఆర్థిక వెసులుబాటు అనుసరించి ఆయా తరగతుల్లో ప్రయాణించే సందర్భంలో ఎసి క్లాస్‌లో ఉన్నన్ని సదుపాయాలు జనరల్ క్లాసులు ఉండవు. ముఖ్యంగా ఎసి క్లాస్ ప్రయాణికులకు టికెట్ ధరలోనే ఆహార పదార్థాలు సరఫరా చేయడం భోజనం టిఫిన్ వగైరాలు అందిస్తారు. కానీ లెక్కకు మించి ప్రయాణించే సాధారణ ప్రయాణికుల విషయంలో మాత్రం ఇది వర్తించకుండా ఉన్నది. దూర ప్రయాణం చేసే రైళ్లలో పేదలకు సరైన తాగునీరు గాని శుభ్రమైన మరుగుదొడ్లు గాని ఉండడం లేదు అదేవిధంగా ఎసి బోగీలో ఇచ్చిన ప్రకారం రాత్రి ప్రయాణాల్లో సాధారణ భోగిలలో దుప్పట్లు, చెద్దర్లు, బ్లాంకెట్లు, దిండ్లు, చేతి రుమాళ్ళు ఇవ్వడం లేదు. ప్రభుత్వ పథకాలు గాని, సదుపాయాలు గాని దేశంలో అత్యధికంగా ఉన్న పేదలను దృష్టిలో పెట్టుకొని రూపకల్పన చేస్తున్నవే. రైల్వే ప్రయాణం కేవలం ఉన్నత వర్గాల కు సంబంధించినదే అనే అపవాదు తొలగాలి. ఎసి క్లాస్‌లో మొదటి, రెండవ తరగతిలో ప్రయాణించే వాళ్లకు ఉన్న వసతులకు అనుగుణంగా జనరల్, సాధారణ భోగిలలో కూడా ఈ సదుపాయాలు కల్పించాలి.బడుగు బలహీన వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని ప్రజా రవాణా సౌకర్యాలు అయిన రైల్వే, ఇతర రవాణా ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా కార్యాచరణ చేపట్టాలి. రోజురోజుకు తీవ్ర రూపం దాలుస్తున్న శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని, రైల్వే రవాణా సదుపాయాలను మెరుగుపరిస్తే ప్రజలు తమ సొంత వాహనాలను, ప్రైవేటు వాహనాలను ఉపయోగించకుండా నేరుగా ఈ సౌకర్యాలను అందిపుచ్చుకుంటారు. తద్వారా పెద్దపెద్ద పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యలకు చరమగీతం పాడినట్టు అవుతుంది.రైలులో అమ్మే ఆహార పదార్థాల విషయంలో గాని స్టేషన్‌లోని స్టాళ్లలో అమ్మే వస్తువులను, ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే అమ్మే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలి. రైల్వే స్టేషన్లలో విశ్రాంతి గదుల కేటాయింపులు, ఇతర సౌకర్యాలు, కేవలం వ్యాపార దృక్పథమే కాకుండా సామాజిక సేవ, వసతుల కల్పన లకు పెద్దపీట వేసినప్పుడే రైల్వే ప్రయాణికుల ప్రయోజనాలు నెరవేరుతాయి. రైల్వే ప్రయాణాలలో జరిగే ఇబ్బందులు, సేవా లోపాల పట్ల ఫిర్యాదు చేసే అవకాశం ప్రయాణికులకు ఉన్నా, అవి నామమాత్రంగానే కొనసాగుతున్నాయి. రవాణా సాధనాలను కార్పొరేట్ శక్తుల కోసం ప్రైవేటీకరించకుండా పేదసాధలకు ఆ రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పుడే, రైల్వే ప్రయాణికుల ప్రయాణాలు ఫలప్రదం అవుతాయి. అమృత్ 2.0 లాంటి పథకాల ద్వారా వేల కోట్ల రూపాయల కేటాయింపులు జరిపి, రైల్వే స్టేషన్లను ఆధునికరించడం మౌలిక వసతుల సదుపాయాలు కల్పించడం యుద్ధ ప్రతిపాదన కొనసాగుతున్న తరుణంలో సాధారణ మరియు స్లీపర్ క్లాస్ ప్రయాణికుల వసతుల విషయంలో కూడా రైల్వే శాఖ సముచిత నిర్ణయం తీసుకుంటే అందరూ హర్షిస్తారు.

**— పగడాల శివప్రసాద్**



## శ్రీరాంపురంలో గర్భిణి మృతి

మౌలిక వసతుల లేమిపై సిపిఐ ఆగ్రహం

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మేజర్ గ్రామ పంచాయతీ సారపాక పరిధిలోని శ్రీరాంపురం ఎస్టీ కాలనీలో విషాదం చోటు చేసుకుంది. ఆదివాసి గిరిజన మహిళ కోర్స జ్యోతి(24) ఆరు నెలల గర్భిణీ కాగా అనారోగ్యంతో మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) సారపాక పట్టణ కార్యదర్శి పేరాల శ్రీనివాసరావు ఆమె స్వగృహానికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపురం ఎస్టీ కాలనీలో గత 25 సంవత్సరాలుగా గిరిజనులు అడవిలోనే చీకటిలో జీవిస్తున్నారని, అక్కడ ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో దోమల కాట్లతో పాటు అనారోగ్య సమస్యల వల్ల పలువురు గిరిజనులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికీ ఆ గ్రామంలో కనీసం ఆశావర్కర్, అంగన్‌వాడీ కేంద్రం కూడా ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. అతి సమీపంలో ఐటిడిఎ కార్యాలయం ఉన్నప్పటికీ గిరిజనుల సమస్యల పట్ల అధికారులకు ఆసక్తి కనిపించడం లేదని విమర్శించారు. గిరిజనుల సంక్షేమం కోసం ఏర్పాటైన ఐటిడిఎ సంస్థ కనీస మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని సిపిఐ పార్టీ ఆరోపించింది. మృతి చెందిన జ్యోతి కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు శ్రీరాంపురం ఎస్టీ కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఆశావర్కర్, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు కల్పించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రగులుతున్న పోడు వివాదం

ఫారెస్ట్ అధికారుల దాడిలో గిరిజనులకు గాయాలు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని కృష్ణసాగర్ బట్టుగూడెం గ్రామంలో పోడు భూముల వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. పోడు సాగు చేస్తున్న భూముల్లో ట్రెంచ్‌లు తవ్వేందుకు వచ్చిన ఫారెస్ట్ అధికారులతో మాట్లాడేందుకు వెళ్లిన గిరిజనులపై అధికారులు దాడి చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తుల వివరాల ప్రకారం ఎన్నో ఏళ్లుగా పోడు సాగు చేస్తున్న భూముల్లో ఫారెస్ట్ అధికారులు బలవంతంగా ట్రెంచ్‌లు తవ్వుతున్నారని తెలిపారు. దీనిపై వివరణ కోరేందుకు వెళ్లిన గిరిజనులపై అధికారులు నిర్దాక్షిణ్యంగా దాడి చేయడంతో ఒక గిరిజనుడు తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికే ఎండాకాలం కారణంగా వ్యవసాయానికి నీటి కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో తమ పంట పొలాల్లోకి వచ్చి ట్రెంచ్‌లు తవ్వడం వల్ల మరింత నష్టపోతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా అడవులను నరికిపోడు సాగు చేస్తే చర్యలు తీసుకోవడం సరే కానీ, సంవత్సరాలుగా సాగు చేస్తున్న భూముల్లో ఇలా దౌర్జన్యంగా ట్రెంచ్‌లు తవ్వడం సరైంది కాదని గ్రామస్తులు అంటున్నారు. ఈ విషయంపై పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు జోక్యం చేసుకుని ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని బట్టుగూడెం గ్రామానికి చెందిన గిరిజనులు కోరుతున్నారు

## జూలూరుపాడులో సివిల్ సప్లయ్ అధికారుల మెరుపు దాడులు

34 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** జూలూరుపాడు మండల కేంద్రంలోని హోటళ్లు, కిరాణా దుకాణాలపై సివిల్ సప్లై అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు జిల్లా కలెక్టర్, సివిల్ సప్లై జిల్లా అధికారి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో మొత్తం 34 అక్రమ గ్యాస్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కిరాణా షాపులు, హోటళ్లలో అక్రమంగా దాచిన సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సామాన్యుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఎక్కువ రేట్లకు అమ్ముతున్న వారిపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. గ్యాస్ కొరత లేదని, అవసరానికి మించి నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏసీఎస్‌ఓ వరదరాజులు హెచ్చరించారు. ప్రజలకు సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఎవరూ ఆందోళన చెంది అధిక ధరలకు కొనవద్దు. అక్రమంగా నిల్వ చేసే వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై ఆర్ఐ వెంకటేశ్వర్లు, భద్రాచలం డిప్యూటీ తాసీల్దార్ రాజులు, ఇల్లెందు యుడిఆర్‌ఐ రాంబాబు, జూలూరుపాడు పోలీసులు పాల్గొన్నారు.

## 26న భద్రగిరి మార్ట్ ప్రారంభం

నాణ్యతకు అధిక ప్రాధాన్యత : ఐటిడిఏ పిఒ రాహుల్



**ప్రజాపక్షం/భద్రాచలం:** సహజ సిద్ధమైన పోషక విలువలు గల ఆహార పదార్థాలను ప్రజలకు అత్యంత చేరువగా చేసేందుకు శ్రీరామ నవమి నాడు గిరిమార్ట్‌ను ప్రారంభిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో త్వరలో ప్రారంభం కాబోయే మార్ట్‌కు వివి ధ నిత్యవసర వస్తువుల సేకరణను నియమించబడ్డ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూనిట్ అధికారుల వారీగా ఎస్‌హెచ్‌జి గ్రూపు మహిళలు తయారు చేస్తున్న వివిధ రకాల సహజ సిద్ధమైన సరుకులు, గిరిజన రైతులు నుండి సేకరించ వలసిన బియ్యం, పప్పు, సిరి ధాన్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు కొన్ని సూచనలు చేశారు. సేకరించే ప్రతీ వాస్తువు నాణ్యతతో ఉండాలని, ప్రధానంగా తేనె, మిల్లెట్ బిస్కెట్లు, పప్పు ధాన్యాలు, వివిధ రకాల బియ్యం ఇతర గృహోపకరణాలకు ఉపయోగపడే ప్రతీ సరు కు ఆర్గానిక్‌కు సంబంధించి ఉండాలన్నారు. 88మహిళా సంఘాల వారు గిరి ఉత్పత్తులు అటవీ ఫలాలు ప్రాచుర్యంలోనికి తీసుకురావడమే కాకుండా మార్ట్‌కు వచ్చే వినియోగ దారులు సంతృప్తి చెందే విధంగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఆవు, గేదె నెయ్యితో పాటు నాటు కోడి గుడ్లు ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, ఇతర అధికారులు ఉదయ్, రాంబాబు, వేణు, రమేష్, గన్య, హరికృష్ణ, ప్రభాకర్, ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మండల అభివృద్ధికి ఐటిసి సహకారం అభినందనీయం

ఐటిసి సిఎస్ఆర్ నిధులతో
రూ.50లక్షల వ్యయం.. డ్రైన్లకు శంకుస్థాపన
ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల అభివృద్ధికి ఐటిసి సహకారం అభినందనీయమని పినపాక నియోజకవర్గ ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని నాగినేని ప్రోలురెడ్డి పాలెం గ్రామంలో ఐటిసి పిఎస్పిడి సిఎస్ఆర్ నిధుల ద్వారా రూ. 50 లక్షల విలువైన సీసీ డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈకార్యక్రమానికి పినపాక నియోజకవర్గ ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై నాలుగు సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎడమకంటి పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఎంఎల్‌ఏకు ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద భూమిపూజ నిర్వహించి, కొబ్బరి కాయలు కొట్టి జేసీబీతో మట్టి తవ్వి పనులను ప్రారంభించారు. అనంతరం నాగినేనిప్రోలు జండా చెట్టు వద్ద, గొమ్మూరు కాలనీ, గాదె వెంకటేశ్వర్‌రెడ్డి నివాసం సమీపంలో డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బూర్గంపాడు మండలంలో ఐటిసి సంస్థ ఉండటం మండల ప్రజలకు అదృష్టకరమని అన్నారు. ఐటిసి సిఎస్ఆర్ నిధుల ద్వారా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విద్య, వైద్య రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా సిఎస్ఆర్ నిధులను మరింతగా తీసుకువచ్చి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడతలో పూర్తయిన ఇళ్లకు బిల్లులు పూర్తి స్థాయిలో మంజూరు చేశామని, రెండో విడత ఏప్రిల్ 16న ప్రారంభమవుతుందని వెల్లడించారు. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకొని పథకాల లబ్ది పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, జిల్లా లీగల్‌సెల్ కన్వీనర్ భజన సతీష్ కుమార్, ఎంపిడిఓ జమలారెడ్డి, పంచాయితీ కార్యదర్శి స్పందన, ఐటిసి ఉన్నతాధికారి చెంగల్‌రావు, బూర్గంపాడు ఉపసర్పంచ్ గుండె వెంకన్న, పార్టీ నాయకులు భజన ప్రసాద్‌కుమార్, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మారం వెంకటేశ్వరరెడ్డి, కాటం వెంకట్రామిరెడ్డి, ఇంగువ రమేష్, దుగ్గెంపూడి శేశిరెడ్డి, ఆవుల నాగిరెడ్డి, గాదె వెంకటేశ్వరరెడ్డి, ఎడమకంటి రోశిరెడ్డి, పాలెం లక్ష్మీ రెడ్డి, చంచలపు శ్రీనివాసరావు, ఎడమకంటి సుధాకర్‌రెడ్డి, కైపు శ్రీనివాసరెడ్డి, సారెడ్డి అశోక్‌రెడ్డి, సుశాంత్‌రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మల హరీష్ యాదవ్, సంతోష్, భాస్కరరావు, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దునుకు రాము, కందుల రాము యాదవ్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సింప్లీ సాయి, రాగానరేష్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## కవయిత్రి మొల్ల విగ్రహావిష్కరణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రముఖ తెలుగు కవయిత్రి మొల్ల విగ్రహాన్ని మేయర్ పునుకొల్లు నీరజ ఆవిష్కరించారు. ఖమ్మం నగరంలోని లకారం ట్యాం క్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రముఖ తెలుగు కవయిత్రి మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కవయిత్రి మొల్ల తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సాధించారని తెలిపారు. రామాయణాన్ని సాధారణ ప్రజలకు సులభంగా అర్థమయ్యేవిధంగా తెలుగులో అందించారని పేర్కొన్నారు. ఆమె రచనలు తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కమర్తపు మురళి, సరిపూడి రమాదేవి సతీష్, పలు సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్త హత్య

ప్రియుడితో కలిసి అర్ధరాత్రి ఘాతుకం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో భార్య తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో భర్తను అర్ధరాత్రి సమయంలో ఊపిరాడకుండా చేసి చంపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గ్రామస్తులు, మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం తిప్పనపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ జాఫర్(33)ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చింతలపూడి ప్రాంతానికి చెందిన ఖతీజాతో సుమారు 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కొంతకాలం పాటు వీరి కుటుంబ జీవితం సాఫీగా సాగింది. ఈ క్రమంలో చింతలపూడి ప్రాంతానికి చెందిన ఓ యువకుడితో ఖతీజాకు పరిచయం ఏర్పడి అది అక్రమ సంబంధంగా మారినట్లు సమాచారం. భర్త జాఫర్ మద్యానికి బానిస కావడంతో అదే అవకాశంగా తీసుకొని ఆమె ప్రియుడితో సంబంధాన్ని కొనసాగించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గురువారం (మార్చి 12) అర్ధరాత్రి సుమారు 1గంట సమయంలో నిద్రలో ఉన్న జాఫర్‌ను ఖతీజా తన ప్రియుడితో కలిసి ముఖంపై దిండు పెట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. అనంతరం ప్రియుడు అక్కడి నుండి రాత్రికిరాత్రే పరారైనట్లు సమాచారం. ఉదయం సమయంలో మంచం మీద నుండి పడిపోవడంతో భర్త చనిపోయాడని ఖతీజా ఏడుస్తూ గ్రామస్తులకు, కుటుంబ సభ్యులకు చెప్పడంతో మొదట అందరూ నమ్మారు. దీంతో గురువారం సాయంత్రం ముస్లిం సంప్రదాయాల ప్రకారం జాఫర్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే శుక్రవారం ఖతీజా తన ప్రియుడితో ఫోన్‌లో మాట్లాడటం, భర్త మరణాన్ని తేలిగ్గా తీసుకోవడం వంటి విషయాలు గమనించిన కుటుంబ సభ్యులకు అనుమానం కలిగింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఖతీజాను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. ఖననం చేసిన మృతదేహాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## వెలుగుమట్లలో వసతుల కల్పనకు శ్రీకారం

యుద్ధ ప్రాతిపదికన
విద్యుత్, తాగునీటి ఏర్పాట్లు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల భూదాన్ భూముల్లో లబ్దిదారులకు కేటాయించిన నివాస స్థలాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. నివాస స్థలాలు పొందిన లబ్దిదారులు ఇండ్ల నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ఇటీవల వెలుగుమట్లలో ఇండ్లు కోల్పోయిన బాధితులు 311 మందికి అక్కడే 75 గజాల చొప్పున నివాస స్థలాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు లు పంపిణీ చేశారు. అర్హులైన లబ్దిదారులకు నివాస స్థలాలతో పాటు ఇండ్ల నిర్మాణం కోసం ఇందిరమ్మ పథకం క్రింద ఐదు లక్షలను మంజూరు చేశారు. వెలుగుమట్లను మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామని మంత్రులు సూచించారు. లబ్దిదారులకు మంజూరైన ఇండ్లను నిర్మించుకునేందుకు అక్కడ వసతులు లేకపోవడంతో అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకుంది. ఇప్పటికే 38 మంది లబ్దిదారులు తమ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని మోడల్ కాలనీగా తీర్చిదిద్ది అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని ఆ దిశగా పనులు వెంటనే ప్రారంభించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అందులో భాగంగా శుక్రవారం అధికార యంత్రాంగం అక్కడ ఇంటింటికి శుద్ధి చేసిన త్రాగునీటిని అందించేందుకు పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. అదేవిధంగా విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ లైన్ ఏర్పాట్లను ప్రారంభించారు. రహదారులతో పాటు త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం, తెలంగాణ పబ్లిక్ స్కూల్, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ వంటి మౌలిక సదుపాయాలను అక్కడ ఏర్పాటు చేయనున్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేస్తున్నారు.

# భూదాన్ భూముల్లో అర్హులందరికీ పట్టాలివ్వాలి

ఇరాన్‌పై అమెరికా యుద్ధాన్ని భారత్ ఖండించాలి

సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇరాన్‌పై అన్యాయంగా, దుర్మార్గంగా అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని తీవ్రంగా ఖండించాల్సిన భారత్ భద్రత మండలిలో ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేయడం దేశానికే అవమాన కరమని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. శుక్రవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు, మాజీ ఎంఎల్ఏ గుమ్మడి నర్సయ్యలు మాట్లాడుతూ ఇరాన్‌తో స్నేహ పూర్వక దేశంగా మన దేశం ఉండి ఆ దేశ సార్వభౌమాధికారాన్ని గుర్తించి బలపర్చకపోవడం, ఆ దేశ సుప్రీం లీడర్ అమతుల్లా ఖోమైని దారుణ హత్యను ఖండించకపోవడం అన్యాయమన్నారు. అదానీ కేసు అంబానీ పెట్టుబడులకు అమెరికాలో లాభం చేకూర్చడం కోసం, ఎఫెన్ ఫైల్స్ లోగుట్లను మరుగునపర్చుకోవడం కోసం మోడీ ప్రభుత్వం ఈ వైఖరి అవలంభిస్తుందన్నారు. రష్యా నుంచి ఆయిల్‌ను దిగుమతి చేసుకోవడానికి నెల రోజులు అమెరికా గడువు ఇవ్వడం చూస్తుంటే ఇది స్పష్టమవుతుందన్నారు. ఇప్పటికైనా అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని భారత్ ఖండించి అక్కడ శాంతి నెలకొల్పడానికి కృషి చేయాలన్నారు. యుద్ధం పేరుతో గ్యాస్ ధరలను పెంచడాన్ని, బ్లాక్‌కు తరలించి కొరత సృష్టించడాన్ని నివారించాలన్నారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదల ఇండ్లు కూలగొట్టి తామే ఇండ్లు ఇచ్చామనే ప్రభుత్వ అధికారుల వైఖరి సరికాదన్నారు. అఖిలపక్ష పార్టీలు, సంస్థలు, వ్యక్తులు చేసిన పోరాట ఫలితంగా ప్రభుత్వం దిగి వచ్చి అక్కడ 311 మందికి పట్టాలు ఇచ్చిందని వారు తెలిపారు. 2018 నుంచి అక్కడ నివసిస్తున్న చాలా మంది అర్హులకు పట్టాలు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి అర్హులైన పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూదాన్ భూములపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. పేదల కోసం ఇచ్చిన భూదాన్ భూములు లక్షల ఎకరాలకు పైగా రాష్ట్రంలో ఉందని ఆ భూములకు సంబంధించి శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ రెడ్డి, ఆవుల వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, సివై పుల్లయ్య, జి.రామయ్య, ఆవుల అశోక్, మలీదు నాగేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావు, సిహెచ్ శిరోమణి, ఝాన్సీ, ఆవుల మంగతాయి, ఆజాద్, కె.శ్రీనివాస్, కవిత తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ అప్రెంటిషిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్టిసి) ఖమ్మం రీజియన్‌లో గ్రాడ్యుయేట్ అప్రెంటిషిప్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్ శుక్రవారం తెలిపారు. బికాం, బియస్సి, బిబిఎ, బిఎ, ఇంజనీరింగ్, డిప్లొమా వంటి డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అప్రెంటిషిప్‌కు అర్హులని తెలిపారు. 2021 తర్వాత డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అభ్యర్థులు https://nats.education.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ మార్చి 14 నుంచి మార్చి 23 వరకు ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు టిజిఎస్ ఆర్టిసి ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపోలు, వర్క్‌షాపుల్లో అప్రెంటిషిప్ శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అప్రెంటిషిప్‌కు సంబంధించిన పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చునని ఆర్ఎం సరిరామ్ తెలిపారు.



## 'క్లీన్ అండ్ గ్రీన్' పట్టణంగా మధిర

ఇల్లందులపాడు పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించిన చైర్‌పర్సన్

**ప్రజాపక్షం/మధిర :** మధిరను క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా మార్చటమే లక్ష్యమని మధిర మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సామినేని సుజాత పేర్కొన్నారు. మధిర మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య, పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని ఇల్లందులపాడులో మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. సైడ్‌డ్రైన్ల వ్యవస్థను పరిశీలించారు. ఇల్లందులపాడు వ్యాప్తంగా ఉన్న కాల్వలను శానిటేషన్ సిబ్బంది శుభ్రపరిచారు. అదేవిధంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడంతో దోమల నివారణకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. మధిరమున్సిపాలిటీలో ఏ సమస్య తలెత్తిన ప్రజలు తనను నేరుగా సంప్రదించాలని, ఆ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సూర్యదేవర కోటేశ్వరరావు, సామినేని రామనాథం, వాసిరెడ్డి నాగేశ్వరరావు, కోట డేవిడ్, తాళ్లూరి రాధాకుమార్, బోడేపూడి గోపి, నంద్రు శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



గంజాయి విక్రయించినా, సేవించినా జైలుకే
పిడిఎస్ బియ్యం విక్రయిస్తే పిడి యాక్ట్ నమోదు
విలేకరుల సమావేశంలో వైరా ఎసిపి ఎస్.సారంగపాణి

**ప్రజాపక్షం/మధిర:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇసుక రవాణా ప్రభుత్వ నిబంధనలకు లోబడి రవాణా చేయాలని, అలాకాకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే ఇసుక ట్రాక్టర్లపై, సంబంధిత యాజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని వైరా ఎసిపి సారంగపాణి హెచ్చరించారు. శుక్రవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎసిపి సారంగపాణి మాట్లాడుతూ ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన మధిర నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా రాష్ డ్రైవింగ్ చేసిన, త్రిబుల్ రైడింగ్ చేసిన, లైసెన్స్, ఆర్‌సి, హెల్మెట్ లేకుండా రోడ్డుపై వాహనాలు నడిపిన అలాంటి వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా వైరా డివిజన్ పరిధిలో గంజాయి తాగినా, అమ్మకాలు చేపట్టిన అలాంటివారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరిగే సమాచారాన్ని ప్రజలు ఇస్తే సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వటం జరుగుతుందని వారు తెలిపారు. ముందుగా ఇసుక రవాణా చేసే వారితో అవగాహన సమావేశం ఏర్పాటు చేసి వారికి తగిన సూచనలు ఇవ్వటం జరుగుతుందని, ఆ తర్వాత ఇసుక అక్రమ రవాణా జరిగితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముందుగా మధిర రూరల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వైరా ఎసిపి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఎసిపి అన్నారు. చెట్టు నాటడం ద్వారా ప్రకృతి కాపాడుకోవచ్చని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో మధిర సిఐలు మధు, రమేష్, రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## మంచిగా చదివి లక్ష్యం చేరుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్
డా.కాపా చంద్రకళ మురళీకృష్ణ



**ప్రజాపక్షం/వైరా:** నేను ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థినినే అని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం వైరాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు హాల్ టిక్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షలు వ్రాసే విద్యార్థులు అందరికి డాక్టర్ కాపా చంద్రకళ ము రళీకృష్ణ బెస్ట్ ఆఫ్ లక్ తెలిపారు. అనంతరం డాక్టర్ కాపా చం ద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచిగా పరీక్షలు వ్రాసి ఉన్నతస్థాయికి ఎదగాలని అన్నారు. అదేవిధంగా విద్యార్థులు చెడు మార్గంలో ప్రయాణించవద్దు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. మీకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు, పెంచి పెద్ద చేసిన తల్లి దండ్రులకు ఉన్నత చదువులు చదివి ఆదర్శంగా నిలవాలని ఆమె సూచించారు. పరీక్షలను భయంతో కాకుండా బాధ్యతతో చదివి ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా వ్రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు మాధవరావు, ఉపాధ్యాయులు చంద్రశేఖరరావు, కృష్ణ, నరసింహారావు, అనిత తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



**ప్రజాపక్షం/మధిర :** మధిర మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను ఎక్కడిపడితే అక్కడ వేయకూడదని మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 14,21 వార్డుల్లో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలను కమీషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా ఉంచి మున్సిపల్ సిబ్బందికి ఇవ్వాలని తెలిపారు. 21వ వార్డు కౌన్సిలర్ రంగా రూప మా ట్లాడుతూ వార్డులో ఏమైన సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చే స్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు కోట నాగరాజు, కాంగ్రెస్ నాయకులు యర్రగుంట కమలాకర్, కమతం ప్రవీణ్, షేక్ బాబు, మెప్మా వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** మహిళల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.శుక్రవారం మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ భవన్‌లో కుట్టు మిషన్ల శిక్షణా కార్యక్రమం,స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజి పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడంతో పాటు మహిళా సంఘాలకు ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.అలాగే వ్యవసాయ శాఖ,ఉద్యాన శాఖల ద్వారా రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు,ఉద్యాన యాంత్రిక పరికరాలు అందజేసారు.మహిళలు శిక్షణతో పాటు ఉత్పత్తిసాధనకు కృషి చేయాలని సూచించారు.త్వరలో కాటారం,మంథని ప్రాంతాల్లో గార్మెంట్స్ చిన్న ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.మహాదేవపూర్ ప్రాంతంలో అగరవత్తుల కంపెనీ ద్వారా మహిళలకు శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.శిక్షణ పొందిన మహిళలు నాణ్యమైన ఉత్పత్తులనుతయారు చేసినప్పుడే వాటికి మంచి డిమాండ్ ఉంటుందని తద్వారా లాభాలు పొంది ఆర్థికంగా బలోపేతం కావచ్చని అన్నారు.మహిళలను కోటీశ్వరులుగా తయారు చేయడానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని మహిళల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు.ఈ సందర్భంగా మహిళా శక్తి క్యాంటీన్లు సక్రమంగా నిర్వహించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసారు.మహిళలకు పెట్రోల్ బంకులపై శిక్షణ ఇచ్చి వారికి పెట్రోల్ బంకులను ఏర్పాటు చేస్తామని అన్నారు.అలాగే వదినపల్లి నాచారం ప్రాంతాల్లో సోలార్ పవర్ స్టేషన్‌ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు.రాష్ట్రం ఏర్పాటు తర్వాత రైతులకు ఈ ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లను అందిస్తుందని అన్నారు.రైతులకు రైతు భరోసా పథకం,సన్నవడ్ల బోనస్ అందిస్తున్నామని అన్నారు.అలిమ్ సమస్త సంస్థ మహిళా సాదికారత కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళలను ముందుకు తీసుకెళ్తుందని అభినందించారు.గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణతో పాటు వివిధ సంస్థలను పరిచయం చేయాలని సూచించారు.వయాట్రిస్,అలీమ్ సంస్థల ద్వారా మూడు మండలాల్లో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని కుట్టిన వస్త్రాలను మార్కెటింగ్ చేయడానికి ముందుకు రావాలని అన్నారు.

**విద్యార్థులను అభినందించిన మంత్రి**

మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు గత నెలలో జరిగిన నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్షిప్ కు ఎంపికవగా వారిని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభినందించారు. విద్యార్థుల ఎంపిక పట్ల కృషి చేసిన ఉపాధ్యాయుడు మడ్క మధును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్, రాజబాబు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , బాలకృష్ణ, రాజేందర్, ఉపాధిహామి పథకం రాష్ట్ర సభ్యుడు దండురమేష్, సర్పంచ్ హసీనా బానో తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు యాంత్రీకీకరణకు ప్రాధాన్యత: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం పరిధిలోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హాజరయ్యారు.ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని వర్ధన్నపేట, పర్వతగిరి, వరంగల్ మండలాలకు చెందిన 27 మంది లబ్ధిదారులకు 50 శాతం సబ్సిడీపై రోటవేటర్స్, బేలర్స్, స్ప్రేయర్స్ వంటి వ్యవసాయ పనిముట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ యాంత్రికరణకు ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. రైతులపై పెరుగుతున్న ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ యంత్రాలను అందజేస్తోందని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యాంత్రిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఏడీఏ, ఏవోలు, మున్సిపాలిటీ చైర్పర్సన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ నేతావత్ శీలారాణి రాజేందర్, సర్పంచులు జేటి సాంబయ్య, పింగిలి నాగమణి, రజాక్ పటాన్ , పాల్గొన్నారు.

## దడువాయిల చార్జీలు మార్కెట్ కమిటీ భరించాలి



**ప్రజాపక్షం/వరంగల్ :** వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో రైతుల పంట అమ్మకంపై ఆర్థిక భారాన్ని వేయవద్దని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అఖిల భారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజులు డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘాల నాయకులు జిల్లా అదనపు కలెక్టర్కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కు రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి తూకం వేసే దడువాయిలకు మార్కెట్ కమిటీ బస్తాకు రూ. 6.25లచొప్పున రైతులే చెల్లిస్తున్నారని, దడువాయిలకు రెండు సంవత్సరాలకు ఒకసారి 20శాతంరేట్లు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పెంచుతున్నారన్నారు. వీటికి 1963 సంవత్సరం నుండి కొన్ని సంవత్సరాలు మార్కెట్ కమిటీ చెల్లించేది, మళ్లీ కొన్ని సంవత్సరాల రైతుల పంటను కొనుగోలు చేసే వ్యాపారస్తులు చెల్లించేవారని, 2012 సంవత్సరం నుండి రైతులు చెల్లించే విధంగా ప్రభుత్వ అధికారులు గెజిట్ ను విడుదల చేయడంతో ఆనాటి నుండి ఈరోజు వరకు రైతులే భరిస్తున్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్లోకి అమ్ముకోవడానికి తీసుకొస్తే అనేక కష్టాల ఖర్చులనేపంటతో వారిపై ఆర్థికంగా భారం మోపుతున్నారు. రైతులు ఈ ఖర్చుల భారం మోయలేక మార్కెట్లో పంటను తీసుకురాకుండా గ్రామాల్లోని ప్రైవేటు వ్యాపారస్తులకు పంటను అమ్ముకోవడంతో మార్కెట్ కు లక్ష వచ్చే కోట్ల ఆదాయాన్ని రాకుండా పోతోందన్నారు. ఇప్పటికైనా మార్కెట్లోని దడువాయిల చార్జీలు మార్కెట్ కమిటీ లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో అఖిల భారత కిసాన్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు సుధమల్ల భాస్కర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఓదెల రాజయ్య, బండి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



**ప్రజాపక్షం/తొర్రూరు :** ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్‌కుమార్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తొర్రూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నందనా దేవి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్‌కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం అందుతుందని చెప్పారు. ఈ శిబిరంలో 412మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ కో ఆర్డినేటర్ డాక్టర్ రమేశ్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధీర్‌రెడ్డి, పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌కు గురై బాలుడు మృతి



**ప్రజాపక్షం/నర్సంపేట :** విద్యుత్‌షాక్ కు గురై బాలుడు మృతిచెందిన సంఘటన నర్సంపేట పట్టణంలోని మాదన్నపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేట మున్సిపాలిటీ ఒకటో వార్డు మాదన్నపేటలో శుక్రవారం ఉదయం దూడల సతీష్ జ్యోతి దంపతుల ఏకైక కుమారుడు దూడల అభినవ్(9) మాదన్నపేటలో పెండ్లికి పందిళ్లు వేస్తున్నారని విషయం తెలియగానే పలువురితో కలిసి సైకిల్‌పై చూడడానికి వెళ్లాడు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పుకోవడం కోసం గోడను పట్టుకోవడంతో కరెంటు షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కరెంటు స్తంభం నుండి తీసిన సర్వీస్ వైరు గాలి రావిడికి తెగిపోయి రేకులకు కరెంటు సరఫరా అవుతుండని, దీంతో గోడకు కూడా కరెంట్ ప్రవహించడంతో దానిని పట్టుకున్న అభినవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ ఇంటికి సంబంధించిన వారు చాలా కాలంగా గ్రామంలో ఉండటం లేదని తెలిసింది. అప్పటిదాకా ఆడుతూ పాడుతూ తిరిగిన చిన్నారి ఒక్కసారిగా విగతజీవిగా కనిపించడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు అరణ్యరోదనలయ్యాయి. మిన్నంటాయి. చిన్నారితో మృతి వార్త తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పరకాల పట్టణ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/పరకాల :** పరకాల పట్టణ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పరకాల పట్టణ కేంద్రంలోని పరకాల మున్సిపాలిటీ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పరకాల పట్టణ అభివృద్ధికి మున్సిపాలిటీ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని, పట్టణ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే తాగునీరు, పారిశుధ్యం, తదితరా అంశాలపై చర్చించారు. పట్టణ కేంద్రంలో పెండింగ్లో ఉన్న నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

ధరలను నియంత్రించడంలో కేంద్రం విఫలం

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రజా సమస్యల పరిష్కారమే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రధాన ఎజెండా అని, దేశంలో పెరిగిన గ్యాస్, నిత్యావసరాల ధరలను అదుపు చేయటంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అన్నారు. శుక్రవారం గుండ్లసింగారం గ్రామంలోని సురవరం సుధాకర్ రెడ్డి కాలనీలో ఆ కాలనీ ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి హాజరై మాట్లాడుతూ దేశంలోని పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ఆచరణలో అరాకొర అమలు చేసి గొప్పలు చెప్పుకుంటున్నాయని ఆరోపించారు. కేంద్రంలో ప్రధాని మోదీ పరిపాలనలో దేశం తిరోగమనానికి వెళ్లిందని, కేవలం ప్రసంగాలు, మాటలు తప్పితే ప్రజలకు చేసేందేమీ లేదని విమర్శించారు. దేశంలో నెలకొన్న సమస్యలు ఎక్కడ వేసినా గొంగడి అక్కడే అన్న చందంగా తయారైయ్యాయని విమర్శించారు. ఇరాన్‌పై యుద్ధం చేస్తున్న అమెరికా, ఇజ్రాయెల్ ల సామ్రాజ్యవాదం నశించాలని, ఈ యుద్ధం కారణంగా మన దేశంలో పెరిగిన గ్యాస్, నిత్యావసరాల ధరలను అదుపు చేయటంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని అన్నారు. అమెరికా యుద్ధ చర్యలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తక్షణమే మౌనం వీడి, ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ దేశాలు చేస్తున్న యుద్ధాన్ని ఖండించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర ఏళ్ల కావొస్తున్నా ప్రజా సమస్యలు పరిష్కారంలో జాప్యం కారణంగా రాష్ట్రంలో పూర్తిగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా సిపిఐ పోరాడుతుందని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, పూజారి నరేందర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళీ చెరువు పూడికతీత పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

రూ.16.10 కోట్లతో పూడిక తీత పనుల ప్రారంభం

మే 15 లోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

నాయిని, నగర మేయర్ సుధారాణి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



**ప్రజాపక్షం/హనుమకొండ :** భద్రకాళి చెరువు పూడికతీత పనులకు శ్రీకారం చుట్టినట్లు వరంగల్ (పశ్చిమ) ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ లు తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా భద్రకాళి సుందరీకరణ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు కలెక్టర్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే, మేయర్, కలెక్టర్ లు టెంకాయ సమర్పించి పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భం గా శాసనసభ్యులు మాట్లాడుతూ భద్రకాళి ఆలయాన్ని జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని , వరంగల్ నగర అభివృద్ధిలో కీలకమైన భద్రకాళి చెరువు పునరుద్ధరణ చేసి మరో పర్యాటక కేంద్రం గా తీర్చిదిద్దడానికి శ్రీకారం చుట్టామని, గతంలో రూ. 9 కోట్ల అంచనా వ్యయం తో ప్రారంభించిన పూడికతీత పనులు పూర్తి స్థాయిలో జరగకపోవడంతో ప్రస్తుతం రూ.16.10 కోట్ల నిధులతో సమగ్రంగా చెరువు పూడికతీత పనులను చేపడుతున్నామని అమ్మవారి ఆశీస్సులతో ఎలాంటి అవాంతరాలు లేకుండా చెరువు పునరుద్ధరణ, మాఢ వీధుల నిర్మాణ పనులు చేపడుతున్నామని,అభివృద్ధి పనులలో ఎక్కడ రాజీ పడడం లేదని,సమష్టి నాయకత్వంతో వరంగల్ నగరాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ లు దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, మామిండ్ల రాజు, ఇరిగేషన్ ఎస్ ఈ రాంప్రసాద్, ఈ ఈ కిరణ్ కుమార్ కుడా ఈ ఈ భీమ్ రావు, ఇరిగేషన్ డి ఈ మధుసూదన్, వేణు గోపాల్, శ్యామ్ పాల్గొన్నారు.

## సామాన్య ప్రజలకు న్యాయం జరగాలి




**ప్రజాపక్షం/ములుగు:** కేసులను నిష్పాక్షపాతంగా విచారణ చేపట్టి సామాన్య ప్రజలకు న్యాయం జరిగే విధంగా చూడాలని ములుగు జిల్లా ఎస్పి సుధీర్ రామ్‌నాథ్ కేకన్ అన్నారు. శుక్రవారం జిల్లా స్థాయి క్రైమ్ రివ్యూ సమావేశం ఎస్పి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ములుగు, ఏటూరునాగారం డివిజన్లకు చెందిన ఎస్‌డిపిఓలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పి జిల్లాలో పరిష్కరించబడని కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. అలాగే నేర తీవ్రత ఎక్కువ కలిగిన కేసులు, ఆస్తి సంబంధిత కేసులు పరిశీలించారు. అదేవిధంగా మహిళలపై నేరాలు, ఫోక్సో కేసులపై ప్రత్యేకంగా సమీక్ష చేశారు. బాధితులకు న్యాయం జరిగే త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులకు అత్యంత ప్రాముఖ్యత ఇవ్వాలని, అట్టి కేసులలో చట్టపరమైన చర్యలు ఖచ్చితంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్‌పి మనన్ బట్ ఐపిఎస్, అదనపు ఎస్‌పి సదానందం, డివిస్‌పి కిషోర్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌స్పెక్టర్ శంకర్, పస్రా సిఐ దయాకర్, ఏటూరునాగారం సిఐ శ్రీనివాస్, వెంకటాపురం సిఐ ముత్యం సురేష్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కడియం

**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్ పూర్ :** స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ 2026–27 బడ్జెట్ సమావేశానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా 2026–27సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ అంచనాల ప్రతిపాదనలను పరిశీలించి బడ్జెట్ అంచనాలపై చర్చించారు. అనంతరం 63 కోట్ల 33లక్షల 70వేల రూపాయల బడ్జెట్ అంచనాలకు మున్సిపాలిటీ పాలక వర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అలాగే పట్టణ కేంద్రంలో మార్కెట్ ఏర్పాటుకు బస్టాండ్ సమీపంలోని శ్రీ తిరుమలనాథ ఆలయ భూమిని లీజుకు తీసుకునేందుకు, పట్టణ కేంద్రంలో పార్క్ అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు వక్ఫ్ బోర్డు అధీనంలో ఉన్న సుమారు 4ఎకరాల భూమిని లీజుకు తీసుకునేందుకు తీర్మాణాలు చేసి ప్రభుత్వానికి పంపించేందుకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ, వైస్ చైర్మన్ నీల రాజమ్మ, కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి సమస్యలు రానివ్వొద్దు



**ప్రజాపక్షం/జనగామ:** వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలి, ప్రజలకు రక్షిత మంచినీరు అందించడంలో జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోన మినీ కాన్ఫరెన్స్ హాల్ రక్షిత తాగునీటి సరఫరా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, నీటి వనరుల లభ్యతపై ఎంపిడిఓ, హౌసింగ్, నీటిపారుదల శాఖ, మిషన్ భగీరథ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాల్లో నీటి వనరులు, లభ్యతపై క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సమస్య తలెత్తకుండా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. పట్టణాల్లో తాగునీటి వనరుల పరిస్థితిని అధికారులు నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పని చేయకుండా ఉన్న బోర్లు, నీటి సరఫరా పైప్‌లైన్లు, చేత పంపులను వెంటనే మరమ్మత్తు చేయించాలని ఆదేశించారు. నీటి నిల్వ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి సమస్యలు ఎదురైతే వెంటనే స్పందించాలని, నీటి సమస్య ఏర్పడితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1800కు ఫోన్ చేయాలన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని కలెక్టర్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మంజూరు అయిన ఇండ్లు ఎప్పటి వరకు ఏఏ దశలో ఉన్నాయనే దానిపై రివ్యూ చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో రెండు విడతలుగా 5647 ఇళ్లు మంజూరు కాగా 241 ఇళ్లు పూర్తి అయ్యాయని, 2920 ఇళ్లు స్లాబ్ లెవల్‌లో ఉన్నాయని, రూపల్ లెవల్‌లో 544 ఇళ్లు, బెస్మెంట్ స్థాయిలో 1128 ఇళ్లు బెస్మెంట్ కూడా ప్రారంభం కానికి 450 ఇళ్లు ఉన్నాయని హౌసింగ్ పిడి మాతృనాయక్ వివరించారు. ఇళ్ల నిర్మాణాలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

## పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** గత బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ కార్డులు,పేదలకు సన్న బియ్యం ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దని పాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సి.ఆర్ నగర్ బాంబుల గడ్డలో నూతనముగా రేషన్ షాప్‌ను గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొని రేషన్ షాప్ ను ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా సి.ఆర్ నగర్ భూపాలపల్లి నివాసులకు ప్రత్యేకంగా రేషన్ షాప్ లేకపోవడం వల్ల జరుగుతున్న ఇబ్బందులను గుర్తించి రేషన్ షాప్‌ను మంజూరు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, శ్రీనివాస్, రామచంద్రయ, హరికృష్ణ, అరుణ్ కుమారు, అధికారులు, కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

పదో తరగతి విద్యార్థులకు 'బెస్ట్ విషెస్' చెప్పిన కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. నేటి నుండి ప్రారంభం కానున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను రాయనున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బెస్ట్ విషెస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా, ధైర్యంగా ఆత్మ విశ్వాసంతో పరీక్షలు వ్రాయాలని సూచించారు. పరీక్షలకు ముందు సరైన ప్రణాళికతో చదవడం, సమయపాలన పాటించడం చాలా ముఖ్యమని అన్నారు. విద్యార్థులు ఇప్పటివరకు చేసిన చదువుపై నమ్మకం ఉంచి ప్రశాంతంగా పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. అలాగే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తూ వారికి అనుకూలమైన వాతావరణం కల్పించాలని కోరారు. జిల్లా యంత్రాంగం పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 21 పరీక్షా కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించామని, విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా పరీక్షలు రాయనున్న ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించి తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. 10 వతరగతి పట్టా విద్యార్థుల జీవితానికి తొలి పట్టా అని పేర్కొన్నారు.

# భారత్‌లో క్రికెట్ ఒక భావోద్వేగం..

## వరల్డ్ కప్ విజయం మీ అందరిది : సూర్యకుమార్

టి–20 సంచలనంగా భారత జట్టులో పాతుకుపోయిన సూర్యకుమార్ యాదవ్ సారథిగానూ హిట్టయ్యాడు. పొట్టి క్రికెట్‌లో భారత్‌ను తిరుగులేని శక్తిగా మార్చిన సూర్య.. సొంతగడ్డపై భారత్‌కు పొట్టి ప్రపంచకప్ అందించిన తొలి కెప్టెన్‌గా చరిత్ర సృష్టించాడు. ప్రపంచకప్ గెలిచిన తర్వాత మైదానంలో భారత ఆటగాళ్లు కొందరు తమ ప్రియురాళ్లతో సంబురాలు చేసుకోవడంపై దుమారం రేగుతున్న వేళ.. ఈ విజయంలో అభిమానులకూ భాగముందని చెబుతున్నాడు సూర్య. నరేంద్ర మోడీ స్టేడియంలో మార్చి 8న న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన భారత జట్టు వరుసగా రెండోసారి పొట్టి కప్పును ఒడిసిపట్టింది. మరే ఆతిథ్య జట్టుకు సాధ్యమవ్వని విధంగా.. సొంతగడ్డపై పొట్టి వరల్డ్ కప్‌ను పట్టేసింది. సారథిగా దేశానికి వరల్డ్ కప్ అందించిన సూర్యకుమార్ యాదవ్ దిగ్గజాల సరసన చేరాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా ట్రోఫీని నిలబెట్టుకున్న మొదటి జట్టుగా టీమిండియా గుర్తింపు సాధించడంలో కీలకమైన ఈ మిస్టర్ 360 ప్లేయర్.. వరల్డ్ కప్ విజయం అందరిదీ అంటున్నాడు.




'ప్రియమైన భారత జట్టు అభిమానులరా.. మొదటగా మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నా. మీ మద్దతు, ఆశీర్వాదం వల్లనే మేము ఇక్కడ ఉన్నాం. ఈ వరల్డ్కప్ ట్రోఫీ యావత్ దేశానికి చెందుతుంది. మేము గెలిచినా.. ఇది మా ఒక్కరి విజయమే కాదు. వరల్డ్కప్ గెలవాలనేది మనదేశంలో బ్యాట్ పట్టుకున్న ప్రతి చిన్నారి కల. స్టేడియానికి భారీగా తరలివచ్చే అభిమానులకు ఈ ట్రోఫీ చెందుతుంది.

### కావ్య మారన్‌పై నెటిజన్ల ఆగ్రహం



ఐపిఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ సిఇఒ కావ్య మారన్‌పై నెటిజన్లు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. విదేశీ లీగే అయినప్పటికీ శత్రు దేశం ఆటగాడిని కొన్నందుకు ఆమెపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఫలితంగా బాయ్‌కాట్ సన్‌రైజర్స్ హ్యాష్ట్యాగ్ నెట్టింట ట్రెండ్ అవుతోంది. ది హండ్రెడ్ లీగ్ వేలంలో పాకిస్థాన్ క్రికెటర్ అబ్రార్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ కొనడమే దీనికంతటికి కారణం. భారత ఫ్రాంచైజీలు పాకిస్థాన్ ఆటగాళ్లను కొనడం మానేసి చాలా రోజులైంది. ఐపిఎల్ ఆరంభంలో వసీం అక్రమ్, సొహైల్ తన్వీర్.. వంటి కొందరికి అవకాశాలిచ్చినా ఆ తర్వాత మాత్రం పాక్ ఆటగాళ్లకు నో ఎంట్రీ బోర్డు పెట్టింది బిసిసిఐ. అలాంటిది ఇప్పుడు సన్‌రైజర్స్ జట్టులో దాయాది మిస్టరీ స్పిన్నర్కు చోటు దక్కింది. గురువారం జరిగిన ది హండ్రెడ్ వేలంలో అబ్రార్ అహ్మద్ను సన్రైజర్స్ లీడ్స్ ఫ్రాంచైజీ భారీ ధరకు కొన్నది. వేలంలో అబ్రార్‌ను లక్షా తొంభై వేల యూరోలకు ః190,000 భారతీయ కరెన్సీలో రూ.2.34 కోట్లకు దక్కించుకుంది. భారత్‌పై అక్కసు వెళ్లగక్కే అబ్రార్‌ను సన్రైజర్స్ జెర్సీల చూడాల్సి రావడం కొందరికి నచ్చడం లేదు. అందుకే.. సోషల్ మీడియా వేదికా కావ్య మారన్‌ను, ఆరెంజ్ ఆర్మీ టీమ్‌ను ట్రోల్స్ చేస్తున్నారు. ఇదే అంశంపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాను సంప్రదించగా 'మాకేం తెలియదు' అని బదులిచ్చాడు.

### వరల్డ్‌కప్ స్టార్ బౌలర్‌కు బంపరాఫర్





పొట్టి వరల్డ్‌కప్‌లో వికెట్ల వేటతో అదుర్స్ అనిపించిన జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబనికి బంపరాఫర్ వచ్చింది. సంచలన బౌలింగ్‌తో స్టార్ బ్యాటర్లను వణికించిన ఈ ఆఫ్రికా ఆటగాడికి ఐపీఎల్ అవకాశం వచ్చింది. మార్చి 28 నుంచి మొదలయ్యే19వ సీజన్‌లో కోల్‌కత్తా నైట్ రైడర్స్ తరఫున ఈ పొడగరి పేసర్ ఆడనున్నాడు. జింబాబ్వే స్టార్ తమ గూటికి చేరాడనే విషయాన్ని శుక్రవారం కోల్‌కత్తా యాజమాన్యం ఎక్స్ వేదికగా పంచుకుంది. ఐసీసీ పురుషుల పొట్టి ప్రపంచకప్‌లో జింబాబ్వే విజయాల్లో కీలకమైన బ్లెస్సింగ్ ముజరబని ఇక ఐపీఎల్లో చెలరేగనున్నాడు. వరల్డ్‌కప్‌లో సత్తా చాటి13 వికెట్లతో రెండో స్థానంలో నిలిచిన ఈ పేసర్‌ను కోల్‌కత్తా నైట్ రైడర్స్ పట్టేసింది. విండీస్ పేసర్ షమర్ జోసెఫ్ స్థానంలో ముజరబనికి చోటు కల్పించినట్టు కేకేఆర్ వెల్లడించింది. పద్దెనిమిదో సీజన్లో బ్యాకప్గా రాయల్ ఛాలెంజర్స్ జట్టుతో చేరిన ముజరబని.. ఈసారి ఊదా, పసిడి రంగు జెర్సీతో మైదానంలోకి దిగనున్నాడు. ఐపీఎల్ తొలి దశ షెడ్యూల్ విడుదల కావడంతో మార్చి 17న ముజరబని కోల్కతా స్క్వాడ్లో కలువనున్నాడు. ప్రతిభావంతుడైన ఈ పొడగరి పేసర్ రాకతో కోల్కతా నైట్ రైడర్స్ పేస్ దళం పటిష్టంగా మారనుంది. ఎందుకంటే.. మినీ వేలంలో రూ.9.20 కోట్లకు ముస్తాఫిజుర్ రెహ్మాన్ను కొన్న కోల్కతా.. బంగ్లాదేశ్లో హిందువులపై హింసకు నిరసనగా అతడిని వదిలేసింది. ముస్తాఫిజుర్ స్థానంలో మరొకని తీసుకోలేదు.

## సైన్స్

# విశ్వాన్ని కొలుస్తున్న 'పై'

గణితశాస్త్రం గురించి చిన్న చిన్న సరదా కార్యక్రమాలు చేసే రోజుగా మార్చి 14వ తేదీని భావిస్తారు. కానీ నిజానికి ఈ తేదీకి ఉన్న శాస్త్రీయ నేపథ్యం కొంచెం ఎక్కువే. గణితంలో ప్రసిద్ధ స్థిరాంకం అయిన Π(పై)ని గుర్తుచేసుకోవడం సహజం. పై లేదా 22/7 లేదా 3.14159 అనే సంఖ్య ఒక సాధారణ వృత్తం నుంచి ప్రారంభమై అంతరిక్ష నౌకల మార్గదర్శకంగా మారడం వరకు ప్రయాణించింది. అంతే కాదు, అంతరిక్ష పరిశోధనలో పనిచేసే శాస్త్రవేత్తలు నిజంగానే ఈ సంఖ్యను ప్రతిరోజూ ఉపయోగిస్తారు. అందుకే ఈ రోజు సందర్భంగా అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా'లోని జెట్ ప్రొపల్షన్ ల్యాబొరేటరీ ప్రతి సంవత్సరం 'పై ఇన్ స్కై' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఇందులో పాల్గొనేవారికి అంతరిక్ష పరిశోధనలో ఉపయోగించే గణిత సమస్యలతో పోలి ఉండే ప్రశ్నలు ఇస్తారు. ఇవి పాఠశాల పిల్లలకే కాకుండా పెద్దలకు కూడా ఆసక్తికరంగా ఉంటాయి. సాధారణంగా మనం చదివే గణితం పుస్తకాల్లో ఉండే ప్రశ్నలతో పోలిస్తే ఇవి కొంచెం వాస్తవ ప్రపంచానికి దగ్గరగా ఉంటాయి. ఉదాహరణకు ఒక అంతరిక్ష నౌక ఒక గ్రహం చుట్టూ తిరుగుతున్నప్పుడు దాని కక్ష్య పరిమాణం ఎంత? ఒక గ్రహశకలం పడిన క్రేటర్ వ్యాసార్థం ఎంత? ఒక ఉపగ్రహం ఒక గ్రహం చుట్టూ ఎంత వేగంతో తిరగాలి? ఇవన్నీ గణించడానికి ఉపయోగపడే ముఖ్యమైన సంఖ్యల్లో Π ఒకటి. ఈ సంఖ్య సంఖ్య వృత్తంతో సంబంధం ఉన్న ప్రతి గణితంలో కనిపిస్తుంది. వృత్త పరిధి, ఉపరితల వైశాల్యం, గోళాకార వస్తువుల పరిమాణం లాంటి లెక్కల్లో ఇది తప్పనిసరిగా ఉపయోగించాలి. అందుకే ఖగోళ శాస్త్రంలో ఇది చాలా కీలకం. గ్రహాలు సూర్యుడి చుట్టూ తిరిగే మార్గాలు వృత్తాకారానికి దగ్గరగా ఉంటాయి. ఉపగ్రహాలు గ్రహాల చుట్టూ తిరిగే కక్ష్యలు కూడా వక్ర గీతలే. ఈ కక్ష్యలను అర్థం చేసుకోవడానికి గణితంలో వృత్తాలు, వక్ర రేఖలు, వాటి గణిత సంబంధాలు ఉపయోగిస్తారు. అక్కడే Π అవసరం అవుతుంది. అంతరిక్ష పరిశోధనలో ఒక చిన్న తప్పు కూడా చాలా పెద్ద సమస్యగా మారవచ్చు. ఒక అంతరిక్ష నౌక లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రహం వద్దకు వెళ్లాలి అనుకుందాం. ఆ గ్రహం కూడా నిరంతరం కదులుతూనే ఉంటుంది. అంతరిక్ష నౌక కూడా భారీ వేగంతో ప్రయాణిస్తుంది. అటువంటి పరిస్థితిలో సరైన సమయంలో సరైన కోణంలో చేరాలి. ఆ లెక్కలన్నీ గణిత సమీకరణలతో చేస్తారు. వాటిలో వృత్తాకార కక్ష్యల లెక్కలు వస్తే Π ఉపయోగపడుతుంది. అంతరిక్ష ప్రయాణాల్లో మరో ఆసక్తికరమైన పద్ధతి ఉంది. దాన్ని గ్రావిటీ అసిస్ట్ లేదా గ్రావిటేషనల్ స్లింగ్‌షాట్ అంటారు. ఒక అంతరిక్ష నౌక దూరంగా ఉన్న గ్రహాల దగ్గరకు వెళ్లాలంటే ఎక్కువ ఇంధనం అవసరం అవుతుంది. కానీ శాస్త్రవేత్తలు ఒక తెలివైన మార్గాన్ని ఉపయోగిస్తారు. ఒక పెద్ద గ్రహం దగ్గరగా వెళ్లి దాని గురుత్వాకర్షణను ఉపయోగించి నౌక వేగాన్ని పెంచుతారు. ఈ పద్ధతి ద్వారా నౌకకు అదనపు వేగం లభిస్తుంది. ఉదాహరణకు బృహస్పతి (జూపిటర్) వంటి భారీ గ్రహం దగ్గరగా వెళ్లినప్పుడు దాని గురుత్వాకర్షణ అంతరిక్ష నౌకను మరింత వేగంగా ముందుకు నెట్టుతుంది. ఈ ప్రక్రియను ఖచ్చితంగా గణించడానికి కూడా గణితం అవసరం. ఆ గణితంలో వక్ర మార్గాలు, వృత్తాలు, కక్ష్యలు ఉంటాయి. అక్కడ కూడా Π ప్రాముఖ్యం ఉంటుంది. అంతరిక్షంలో ప్రతి గ్రహం తనదైన ప్రపంచం. ఉదాహరణకు కుజుడు (మెర్క్యురీ) సూర్యుడికి అత్యంత దగ్గరగా తిరిగే గ్రహం. అక్కడ సూర్యుడి గురుత్వాకర్షణ ప్రభావం చాలా బలంగా ఉంటుంది. అక్కడికి ఒక అంతరిక్ష నౌకను పంపాలంటే చాలా జాగ్రత్తగా మార్గాన్ని గణించాలి.ఎందుకంటే సూర్యుడి దగ్గరలో కక్ష్యలు చాలా వేగంగా మారుతాయి. ఈ లెక్కల్లో కూడా వృత్త గణితం కీలకంగా ఉంటుంది. మరోవైపు శుక్రుడు (వీనస్) అనే గ్రహం దట్టమైన వాతావరణంతో కప్పబడి ఉంటుంది. అక్కడికి పంపే యంత్రాలు వాతావరణంలోకి ఎలా ప్రవేశించాలి, ఏ కోణంలో దిగాలి అనే లెక్కలు చాలా ఖచ్చితంగా ఉండాలి. వాతావరణంలోకి ప్రవేశించే మార్గం కూడా ఒక వక్ర గీతలా ఉంటుంది. అందువల్ల అక్కడ కూడా గణిత గణనలు అవసరం. బయటి గ్రహాల వైపు వెళ్లేటప్పుడు పరిస్థితి మరింత ఆసక్తికరంగా మారుతుంది. ఉదాహరణకు శని (శాటర్న్) చుట్టూ ఉన్న వలయాల వ్యవస్థ చాలా సంక్లిష్టమైనది. ఆవలయాల్లో అనేక రకాల వాయువులు ఉంటాయి. ఒక అంతరిక్షనౌక అక్కడి నుంచి వెళ్లాలంటే ఆ వలయాల మధ్య ఉన్న ఖాళీలను గుర్తించాలి. వాటి స్థానాలు కూడా గణిత లెక్కల ద్వారా నిర్ణయిస్తారు. ఇంకా దూరం గా ఉన్న గ్రహాల్లో ఒకటి యురేనస్. పక్కడు ఒరిగినట్టు తిరగడం ఈ గ్రహం ప్రత్యేకత.



మనకు సాధారణంగా గణితం ఒక పుస్తకంలో ఉన్న అంకెల సమాహారంలా అనిపించవచ్చు. కానీ వాస్తవానికి అది విశ్వాన్ని అర్థం చేసుకునే భాష. ఒక వృత్తాన్ని గీసి దాని పరిధిని లెక్కించడం నుంచి ప్రారంభమైన సంఖ్య అదే Π. అదే సంఖ్య గ్రహాల కక్ష్యలను అర్థం చేసుకోవడంలో కూడా ఉపయోగపడుతుంది. అదే సంఖ్యతో అంతరిక్ష నౌకల మార్గాలను కూడా గణిస్తారు. ఈ విషయాన్ని ఒకసారి ఆలోచిస్తే ఆసక్తికరంగా ఉంటుంది. భూమిపై ఒక చిన్న కాగితంపై గీసిన వృత్తంలో కనిపించే గణితం అదే విశ్వంలో ఉన్న గ్రహాల కదలికలకూ వర్తిస్తుంది. విశ్వం చాలా పెద్దది. గెలాక్సీలు, నక్షత్రాలు, గ్రహాలు అన్నీ విస్తారంగా ఉన్నాయి. అయినప్పటికీ వాటి కదలికలను అర్థం చేసుకోవడానికి మనం ఉపయోగించే భాష గణితం. Π అనే సంఖ్య అంతులేని దశాంశాలతో కొనసాగుతుంది. 3.14159 తర్వాత కూడా అది ఎప్పటికీ ముగియదు. ఇది ఒక విధంగా విశ్వం లాంటి సంఖ్య. మనం ఎంత దూరం వెళ్లినా ఇంకా కొత్త భాగాలు కనిపిస్తూనే ఉంటాయి. గణిత శాస్త్రవేత్తలు ఈ సంఖ్యలో లక్షల కోట్లు దశాంశాలను లెక్కించారు. అయినప్పటికీ అది ఇంకా పూర్తికాలేదు. 'పై డే' సందర్భంగా జరిగే కార్యక్రమాలు ఈ ఆలోచనను గుర్తు చేస్తాయి. గణితం కేవలం పాఠశాల పరీక్షల కోసం మాత్రమే కాదు. అది విశ్వాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే ఒక సాధనం. ఒక వృత్తం నుంచి ప్రారంభమైన గణితం చివరికి గ్రహాల ప్రయాణాన్ని అర్థం చేసుకునే స్థాయికి చేరింది. భూమిపై నిలబడి ఆకాశాన్ని చూస్తే చిన్న కాంతి బిందువులు మాత్రమే కనిపిస్తాయి. కానీ వాటి కదలికలను అర్థం చేసుకోవడానికి మనం ఉపయోగించే గణితం చాలా లోతైనది. ఒక చిన్న సంఖ్య అయిన Π కూడా ఆ విశ్వాన్ని అర్థం చేసుకునే తాళం చెవి లాంటిదే. మనం ఆ సంఖ్యను గణించేటప్పుడు వాస్తవానికి విశ్వం పనిచేసే విధానాన్ని అర్థం చేసుకునే ప్రయత్నమే చేస్తున్నాం.

### 22న డిహెచ్‌పిఎస్ జిల్లా మహాసభ




ప్రజాపక్షం/పెద్దపల్లి : దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలో జరుగు జిల్లా మహాసభలకు ఏర్పాట్లపై విస్తృత సమావేశం గోదావరిఖని భాస్కరరావు భవన్‌లో శుక్రవారం జరిగినది. సమావేశానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందుకూరు రాజరత్నం పాల్గొన్నారు. పెద్దపల్లి జిల్లాలో రెండవ మహాసభ జరుగుతున్న సందర్భంలో గోదావరిఖని పట్టణం నుంచి పెద్దపెల్లి జిల్లాకు దళిత సోదరులు కదిలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ మహాసభ మార్చి 22 ఆదివారం ఎన్ఎస్ భవన్ పెద్దపెల్లిలో జరుగుతుందని తెలిపారు. దళితులకు ఐదు ఎకరాల భూమి, దళిత బంధు అందే విధంగా సబ్ ప్లాన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎస్‌సి సబ్‌ప్లాన్ అమలు చేసేవారనీ, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సబ్‌ప్లాన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామనందం, నగర సహాయ కార్యదర్శి తాళ్లపల్లి మల్లయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తాళ్లపల్లి సురేందర్, నాయకులు జనగామ జగదీష్, జెరిపోతుల దేవయ్య, ఎర్రల లెనిన్, తాళ్లపల్లి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యారంగానికి 30 శాతం బడ్జెట్ కేటాయించాలని వినతి

ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ : ఎఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కలిసి విద్యారంగ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, హాస్టళ్లలో వసతుల సమస్యలు, స్కాలర్‌షిప్‌లు ఆలస్యం వంటి అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలో మెరుగైన వసతి, భోజన సదుపాయాలు కల్పించాలని, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ అనుమతులేని, కనీస మౌలిక సదుపాయాలు లేని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను మూసివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు,జిల్లా ఉపాధ్యక్షులు బొజ్జు జ్యోతి, జక్కుల భానుప్రసాద్, సిపతి వినయ్, జిల్లా సమితి సభ్యులు, సిహెచ్ వంశీ కుమార్, శ్రవణ్ తదితరులుపాల్గొన్నారు.



# హద్దుమీరి వ్యవహరిస్తున్న అమెరికా

'యుద్ధం వద్దు– ప్రపంచమే ముద్దు' అనే నినాదంతో ఈనెల 16న నిరసన

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి




ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : ప్రపంచంపై అమెరికా పూర్తిగా హద్దులు మీరి వ్యవహరిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల, సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ట్రంప్ ఇచ్చిపుచ్చుకునే ధోరణి కాకుండా ఐక్యరాజ్యసమితినీ ధిక్కరిస్తూ వ్యక్తిగత కుట్రలతో ప్రపంచంపై ప్రకంపనలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఇరాన్ ఇజ్రాయిల్ ద్వారా సౌదీ అరేబియా ఇతర దేశాలలో ఉన్నట్లు వంటి ఆయిల్ స్థావరాలపై టార్గెట్ చేస్తుందని మండిపడ్డారు. చిన్న చిన్న దేశాలపై పెత్తనం చేసి ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. అనేక దేశాలపై ఆంక్షలు విధిస్తూ వాణిజ్య ఒప్పందాలను మారుస్తూ గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. గ్యాస్ సిలిండర్లు పెట్రోల్ డీజిల్ రానున్న కాలంలో కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. యుద్ధంతో ప్రపంచ మానవాళిపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రపంచంలో జనాభాలో పెద్ద దేశం భారతదేశమని ఎప్పుడైనా విదేశాంగ విధానాలను అవలంబించిందని ఆధిపత్యం అంతం చేసేందుకు నిలబడిందని, మోదీ మాత్రం మౌన ముని పాత్ర పోషిస్తున్నారన్నారు. నరేంద్ర మోదీ నోరు తెరిచి వాస్తవాలను చెప్పాలని ప్రపంచంలో ఉన్న మానవాళిని కాపాడేందుకు నిలబడాలన్నారు. పార్లమెంట్ సమావేశాలలో ఆయిల్ సిలిండర్ కొరత లేదని పెట్రోలియం శాఖ మంత్రి చెప్పే తీరు వాస్తవం కాదని, వాణిజ్య సిలిండర్లు లేక హోటల్లు మూతపడుతున్నాయని అన్నారు. అబద్ధాల పుట్టలో మోదీ ప్రభుత్వం కొనసాగుతుందని మండిపడ్డారు. ప్రపంచ శాంతి కావాలని అన్ని దేశాల నుండి ఒత్తిడి పెంచి మోడీ ప్రభుత్వం తక్షణమే స్పందించి యుద్ధం ఆపాలని, చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవాలని ప్రకటన ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 16న యుద్ధం వద్దు ప్రపంచమే ముద్దు అనే నినాదంతో యుద్ధం ఆపండని నిరసన ర్యాలీలు చేపడుతామని తెలిపారు. సిపిఐ కొత్తగూడెంలో మేయర్ స్థానాన్ని సంపాదించుకోవడం కమ్యూనిస్టు పార్టీకి గర్వకారణం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పల్లె పల్లెకు.. ప్రజల వద్దకు సిపిఐ అనే నినాదంతో ముందుకు వెళ్తామన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, కడారి రాములు, గుంటి వేణు, పంతం రవి, మీసం లక్ష్మణ్, వడ్డేపల్లి లక్ష్మణ్, కొంక విజయ్, గాజుల లింగం తదితరులు పాల్గొన్నారు.

### రైతు భరోసా నిధులు విడుదల చేసి రైతును ఆదుకోండి

సిపిఐ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ డిమాండ్

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేసి అన్నదాతలకు అదుకోవాలని సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సకాలంలో రైతు భరోసా నిధులు అందకపోవడంతో రైతులు సాగు పెట్టుబడి కోసం వ్యాపారస్తుల వద్ద భారీ వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని అవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి సాయం లేక, సరైన సమయంలో ఎరువులు అందక పంట దిగుబడి తగ్గి రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి సీజన్‌లో నిర్ణీత సమయంలో నిధులు వచ్చేవని కానీ ప్రస్తుతం ప్రభుత్వం రైతు పట్ల అనుసరిస్తున్న ఉదాసీన వైఖరి వల్ల గ్రామాల్లో వలసలు పెరుగుతునానయని ఆయన విమర్శించారు. అప్పుల బాధ తాళలేక రైతులు అత్మహత్యలకు పాల్పడుతున్నారని, అనేక రైతు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేసి రైతులను సకాలంలో ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో రైతుల పక్షాన నిలబడి సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు, నిరసనలు,దీక్షలు చేపడుతామని భూక్యా రమేష్ హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు ఎస్.ఎన్.రెడ్డి, నారాయణ, శ్రీనివాస్, రాజేశ్వర్, ముత్యం, రైతు సంఘం నాయకులు, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

### కార్పొరేషన్ ద్వారా మెడికల్ ఉద్యోగులకు వేతనాలు




యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ డిమాండ్

ప్రజాపక్షం/సంగారెడ్డి : ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ వేతనం చెల్లించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫేస్టోలో పెట్టిన విధంగా ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా జీతాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ్మా డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం శుక్రవారం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.ఎ.రహమాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నరసింహ్మా మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను మూడు కేటగిరిలుగా నిర్ణయించి బేసిక్ వేతనాన్ని మర్చిపోవడం జరిగిందని దాని కోసమే ఎఐటియుసి అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైన రాబోవు పిఆర్‌సిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగి బేసిక్ వేతనం ఇచ్చే విధంగా చర్యలు తీసకోవాలని విజ్ఞప్తి చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినప్పటికి రాష్ట్ర ప్రభుత్వాలు ఈతీర్పులను పట్టించుకోకుండా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లో అనేక సంవత్సరాలుగా ఉద్యోగులకు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపాదికన విధులు నిర్వహిస్తున్నారని వారి కాంట్రాక్టర్లు వారిజీతాలను సక్రమంగా చెల్లించకుండా నెలల తరబడి చెల్లించకుండా నిర్లక్ష్యం చేయుచున్నారని, ప్రస్తుత ప్రభుత్వం ఐఎఫ్ఎమ్ఎస్ పోర్టర్ను తీసుకువచ్చినప్పటికీ నేటికి కూడా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెల సక్రమంగా జీతాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజేన్సి వ్యవస్థను రద్దు చేసి ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి సంగారెడ్డి ప్రధాన కార్యదర్శి పి.వెంకటరాజ్యం, డిఇఒల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిద్దార్థ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ నూతన గౌరవ అధ్యక్షులుగా ఎం.ఎ.రహెమాన్, అధ్యక్షులుగా సయ్యద్ ఖాసిం, ఇర్ఫాన్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా పూజారి ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా బానుచందర్, పద్మ, శివ, ప్రధాన కార్యదర్శి చల్లా వాసు, సహాయ కార్యదర్శిగా కొత్తపల్లి చంద్రశేఖర్, అబ్దుల్ ఫహీం, అంజి బాలు, సుదాకర్ ముదిరాజ్ జాన్ లింగం అభిమన్యు సయ్యద్ పాషా, సరస్వతి మమత, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా

### 16న మండల కార్యాలయాల ఎదుట ధర్నాలు

సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి

ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్ : గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా ఈనెల 16న జిల్లావ్యాప్తంగా అన్ని మండల కార్యాలయాల ఎదుట చేపట్టే ధర్నాలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెంచుతున్న ఇంధన ధరల వల్ల సామాన్య ప్రజలపై పెనుభారం పడుతోందని ఆయన విమర్శించారు. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో నిత్యావసరాల ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని, ప్రధాని మోదీ వెంటనే స్పందించి ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతు రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, పెన్షన్లను రూ. 4వేలకు, దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6వేలకు పెంచాలని కోరారు. అలాగే కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం అందజేయాలని, అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటల రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అర్ధాంగి రమేష్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కామ్లే రామదాసు, సీనియర్ నాయకులు నరసయ్య తదితరులు పాల్గొన్నారు.




# గ్యాస్ సిలిండర్ కోసం పాట్లు.. ఆన్‌లైన్ బుకింగ్ ఇక్కట్లు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఇరాన్, ఇజ్రాయెల్– అమెరికా యుద్ధంతో ఎల్‌పిజికి ఇబ్బందులు తప్పడం లేదు. వారం, పదిరోజుల నుంచి వినియోగదారులు గ్యాస్ సిలిండర్ ఆన్‌లైన్ బుకింగ్ కోసం ఎన్నిసార్లు ప్రయత్నించినా బుకింగ్ కాకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నా ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకోవాలని చెప్పటంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నారు. గతంలో మూడు నెలలకు ఒక సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుతం నెలకొక సిలిండర్ ఇవ్వాల్సి ఉండగా బుక్ చేసుకున్న వారి సిలిండర్లు ఏజెన్సీలు బుక్ చేసుకుని అమ్ముకుంటున్నారని ఆరోపణలున్నాయి. కొ న్ని ఏజెన్సీలు డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియ ల్ చేస్తూ వ్యాపార సముదాయాలు, హోటల్ లాంటి వారికి ఎక్కువ ధరకు అమ్ముతూ.. లా భాలు గడిస్తున్నారు. హోటళ్లలో కమర్షియల్ సిలిండర్లు వాడాలి, అధికారుల కన్ను గప్పి డొ మెస్టిక్ సిలిండర్లు వాడటంతో ప్రజలకు మరింత తిప్పలు తప్పడం లేదు. హోటళ్లో తనిఖీల సమయంలో డొమెస్టిక్ సిలిండర్లు దొరికినా అధికారులు చూసి చూడనట్లు వదిలేస్తున్నారు. సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిత్యం తనిఖీలు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ, తనిఖీల వైఫల్యంతో ఏజెన్సీలు వినియోగదారులను మోసం చేసేందుకు అవకాశాలు లేకపోలేదు. కొ న్ని ఏజెన్సీలలో సిలిండర్లు అందుబాటులో ఉన్నప్పటికీ యుద్ధం పేరు చెప్పి బ్లాక్ మార్కెట్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఎక్కువ ధరలకు అమ్ముతున్నట్లు నగరవాసులు చెబుతున్నా రు. ఇకనైనా అధికారులు ముమ్మర తనిఖీలు చేస్తే తప్ప ప్రజలకు సిలిండర్లు దొరికే పరిస్థితి లేదని నగర ప్రజలు వాపోతున్నారు. కొన్ని ఏజెన్సీలు వారి దగ్గర పని చేసే ఆటో సప్లయి చేసే బ్యాగ్‌బాయితో కుమ్మకై వినియోగదారుల ఎల్‌పిజి సిలిండర్లను ఎక్కువ ధరకు అమ్ముతున్నారని రూ.928 కి ఇవ్వాల్సిన సిలిండర్‌ను వినియోగదారుని తెలియకుండా రూ.3 వేలకు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నట్లు ప్రచారం జరుగుతోంది. శుక్రవారం అధికారులు ఆర్మూర్‌లో దా డులు నిర్వహించగా సుమారు 65 సిలిండర్లు స్వాధీనం చేసుకోవటం విశేషం. జిల్లావ్యాప్తంగా అధికారులు తనిఖీలు చేస్తే మరిన్ని సిలిండర్లు దొరికే అవకాశాలున్నాయి. అధికారుల దాడులతో సిలిండర్లు పక్కదోవ పట్టకుండా సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండి ఎల్‌పిజి ఇక్కట్ల నుంచి వినియోగదారులకు ఉపశమనం లభించనుంది. కొరత లేకుండా అందించే ఆస్కారముంటుందని వినియోగదారులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.




## మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్ :** మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎర్రవల్లిలో మైనార్టీ కాంగ్రెస్ నేత అంజద్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మైనార్టీ డిక్లరేషన్ హామీ మేరకు సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో దశలవారీగా వివిధ పథకాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. మైనార్టీ వర్గాల్లోని పేదల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించినట్లు తెలిపారు. మైనార్టీ సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్లో రూ. 5 వేల కోట్లు కేటాయించ గా, మైనారిటీ గురుకులాలు, మసీదుల మరమ్మతులకు నిధులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ, మైనార్టీలకు సబ్ సబ్ ప్లాన్ వర్తింపు, యువత మహిళలకు స బ్సిడీ రుణాలు, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో పెద్దపీట తదితర వర్తింప చేస్తున్న ట్లు చెప్పారు. ముఖ్యంగా కాంగ్రెస్ మైనార్టీల సంక్షేమంతో పాటు నామినేటెడ్ పోస్టుల భర్తీలో పెద్ద ఎత్తున అవకాశం కల్పించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, నేతలు నాయిని యాదగిరి, గుంటూకు శ్రీనివాస్, జహీర్, గాడిపల్లి శ్రీనివాస్, రాజేశం పాల్గొన్నారు.

## నేడు కొండాపూర్ మండలంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పర్యటన

**ప్రజాపక్షం /కొండాపూర్ :** సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ శనివారం కొండాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేసి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ సందర్భంగా మండంలోని పలు గ్రామాలను సందర్శించి మాట్లాడనున్నారు.ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొండాపూర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, విఠల్, ప్రధాన కార్యదర్శి, గోవర్ధన్‌రెడ్డి కోరారు.

## హోటళ్లలో అధికారుల తనిఖీలు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని పలు హోటళ్లలో, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ దేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్టు జిల్లా పౌర సరఫరాల అధికారులు తెలిపారు.శుక్రవారం 16 హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టగా, గృహావసరాల కొరకు కేటాయించిన 29 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో చట్ట విరుద్ధంగా గృహ అవసరాల కొరకు కేటాయించిన సిలిండర్లను వ్యాపార అవసరాల కొరకు ఉపయోగించరాదని అధికారులు తెలిపారు. డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ అవసరాల కొరకు ఉపయోగిస్తే,చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.

## ఏడుపాయల అభివృద్ధి కోసం రూ.147 కోట్లతో ప్రణాళిక

**ప్రజాపక్షం/పాపన్నపేట :** ఏడుపాయల పరిపూర్ణ అభివృద్ధి కోసం రూ.147 కోట్లతో ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఇఒ వీరేశం తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ కు చెందిన తనికెళ్ల ఇంటిగ్రేటెడ్ కన్సల్టెన్సీ సభ్యులు స్థలాన్ని పరిశీలించారు. ఏడుపాయల్లో కాటేజీలు, అద్దాల మేడ, క్యూలైన్, ఒడిబియ్యం కౌంటర్, స్టార్ గదులు, బోనాల మంటపం తదితర అభివృద్ధి నిర్మాణాలు చేపట్టేందుకు, మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు కన్సల్టెన్సీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ మాధవి, ప్రాజెక్ట్ మేనేజర్ రవి, ఇఒ వీరేశం పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్ :** ఆదిలాబాద్‌దహిగూడకు బస్సు సౌకర్యం కల్పించాలని వాన్‌వట్ సర్పంచ్ మెస్రం భుజంగ్‌రావు, పిప్పల్‌ధరి మండల సాధన కమిటీ అధ్యక్షుడు తెలంగ్ బాపురావ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ ఆర్‌టిసి డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి, అంకోలి, లోకారి, వాన్‌వట్, లింగుగూడ, మామిడిగూడ, పిప్పల్‌ధరి మీదుగా దహిగూడ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే బస్సును పంపిస్తామని, ప్రయాణికులు ఉపయోగించుకుని సహకరిస్తే.. బస్సును నిరంతరం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిప్పల్‌ధరి సర్పంచ్ కుమ్ర లక్ష్మీబాయి, కాంగ్రెస్ నాయకులు మినుగు నారాయణ, పిప్పల్‌ధరి మండల సాధన కమిటీ న్యాయ సలహాదారులు తెలంగ్ అజయ్ కుమార్, యువ నాయకులు కినక నందకిశోర్, కుమ్ర శంకర్, ఆత్రం జంగు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిపై దాడి

**ప్రజాపక్షం/ఎడపల్లి :** ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంప్ గ్రామ పంచాయతీ కార్యదర్శి జవాజి రాజుపై అదే గ్రామానికి చెందిన 4వ వార్డు సభ్యుడు కొల్తే ధమ్మపాల్ దాడికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గత బుధవారం ఏఆర్పీ క్యాంప్ సర్పంచ్ పుర మల్ల వినోద్ కుమార్ అధ్యక్షతన గ్రామ పంచాయతీ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. స్థానిక పాఠశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందన్న అంశంపై ఈ సమావేశంలో చర్చ జరుగుతోంది. చర్చ జరుగుతుండగా నాల్గవ వార్డు సభ్యుడు కొల్తే ధమ్మపాల్ ఒక్కసారిగా రెచ్చిపోయి ఉప సర్పంచ్ షేక్ బాబుపై దాడికి దిగాడు. అది గమనించిన సర్పంచ్ వినోద్ కుమార్ అడ్డుకోబోగా, నిందితుడు సర్పంచ్‌ను కూడా అసభ్య పదజాలంతో దూషించి, భౌతిక దాడికి పాల్పడ్డాడు. పంచాయతీ కార్యదర్శి జవాజి రాజు సైతం గొడవను ఆపేందుకు ప్రయత్నించగా, ధమ్మపాల్ ఆయనను కూడా దూషించి విధులకు ఆటంకం కలిగించాడు. ప్రభుత్వ విధుల్లో ఉన్న తమపై దాడి చేసి, దుర్భాషలాడిన వార్డు సభ్యుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి శనివారం పోలీసులను ఆశ్రయించారు.

## విద్యుత్‌షాక్‌తో పంచాయతీ కార్మికుడు మృతి

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో విద్యుత్‌షాక్‌తో గ్రామపంచాయతీ కార్మికుడు మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నీరుడి రాములు (48) గ్రామ పంచాయతీలో గత కొన్నేళ్లుగా విద్యుత్ పనులు చేస్తూ కార్మికుడిగా కొనసాగాడు. శుక్రవారం విద్యుత్ బల్బులను సరిచేసేందుకు స్తంభం ఎక్కిన రాములుకు విద్యుత్‌షాక్ రావడంతో స్తంభంపై నుంచి జారి రోడ్డుపై పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

## మెదక్ ప్రభుత్వాసుపత్రిలో.. ఎసిబి సోదాలు

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ ప్రభుత్వాసుపత్రిలో మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లుల జాప్యంపై ఎసిబి తనిఖీల్లో నిగ్గు తేలాయి. ఫైళ్ల కదలిక నిబంధన మేరకు లేదని, ఇన్వార్డ్ నమోదు మినహా ఫైళ్ల ఔట్ వార్డు వివరాలు లేవని ఎసిబి తనిఖీల్లో తేలింది. మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ రియంబర్స్‌మెంట్ సూపరిండెంట్ లతీఫ్ ముజాహిద్దీన్‌పై జరిగిన ఎసిబి తనిఖీలు పూర్తయ్యాయి. శుక్రవారం మెదక్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎసిబి డిఎస్‌పి సుదర్శన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం మీడియాకు డిఎస్‌పి వివరాలు వెల్లడించారు. మెడికల్ రియంబర్స్‌మెంట్ సూపరిండెంట్ లతీఫ్ ముజాహిద్దీన్ బిల్లులు ఫార్వర్డ్ చేయడంలేదంటూ వచ్చిన సమాచారం ఆధారంగా తనిఖీలు చేశారు. గత సెప్టెంబర్‌లో బాధ్యతలు తీసుకున్న లతీఫ్ ముజాహిద్దీన్ వద్దకు 284 రాగా 116 బిల్లులు పంపాల్సి ఉండగా పంపలేదు. బిల్లుల మంజూరులో తృణమో ఫలమోలేనిది బిల్లులు కావడం లేదంటూ వచ్చిన సమాచారం ఆధారంగా ఎసిబి అధికారులు తనిఖీలు చేపట్టారు. బిల్లులకు సంబందించి ఇన్వార్డ్ వివరాలు ఉన్నా ఔట్ వార్డు వివరాలు లేనట్లు ఎసిబి తనిఖీలో తేలింది. ఫైళ్ల కదలిక సక్రమంగా జరుగడంలేదని గుర్తించారు. మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లుల సక్రమంగా పాస్ కావడంలేదన్న సమాచారంతోనే సోదాలు చేశామని, పూర్తి నివేదికను సంబంధిత మెడికల్ హెడ్ ఆఫీసులో అందజేస్తామని తెలిపారు.

## ఉపాధి హామీని యథావిధిగా కొనసాగించాలి



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని కోయవాగు గ్రామంలో శుక్రవారం జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద కూలీలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విబిజి రామ్ జి పేరుతో కొత్త బిల్లును తీసుకువచ్చి ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. సంక్రాంతి పండుగ నుండి పని చేస్తున్న కూలీలకు బకాయిలు చెల్లించకపోవడంతో ఉగాది పండుగ వేళ వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలని, ఎండ తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. రోజువారీ కూలీ 800 రూపాయలకు పెంచాలని, ఏడాదికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీకి బడ్జెట్‌లో 2 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. కూలీలకు తట్ట, పార, సభల్ వంటి పనిముట్లు తక్షణమే పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / మంచిర్యాల :** విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్, నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని భోజనశాల, వంటశాల, సామాగ్రి నిల్వలు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాలో విద్యార్థుల నమోదు 3 శాతం పెరిగిందని, దీనిని మరింత పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు తీరును మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పెంట రాజయ్యతో కలిసి పరిశీలించారు. జూన్ 12 వరకు 99 రోజుల పాటు సాగే ఈ కార్యాచరణలో పారిశుధ్యం, ఫైళ్ల క్లియరెన్స్, సామాజిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. తర్వాత రాజస్వ మండల అధికారి కార్యాలయంలో జాతీయ రహదారుల విస్తరణ భూసేకరణ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను సమీక్షించారు. దేవులవాడ, మందమర్రి, తిమ్మాపూర్, కోటపల్లి ప్రాంతాలకు సంబంధించిన సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి అధికారులు, ఉపాధ్యాయులు, కార్పొరేటర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ కాంగ్రెస్‌లో వర్గపోరు ముగిసేనా?

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** కొమురం భీం జిల్లా ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో మండల అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ ఉత్కంఠ రేపుతోంది. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు అభ్యర్థుల నుండి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుండటంతో రాజకీయ వేడి పెరిగింది. ఇటీవ ల జిల్లా డిసిసి అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన ఆత్రం సుగుణ ముం దున్న ప్రధాన సవాల్ పార్టీలోని అంతర్గత వర్గపోరును తగ్గించి అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడమే. చాలా కాలంగా వివిధ వర్గాలుగా విడిపోయి పనిచేస్తున్న నాయకులు ఇప్పుడు తమ అనుచరులకు మండల పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. రానున్న ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల దృష్ట్యా ఈ నియామకాలు పార్టీకి అత్యంత కీలకంగా మారాయి. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో కనిపించిన విభేదాలు పార్టీకి నష్టం కలిగించాయని, అవే పునరావృతమైతే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాలకు లాభం చేకూరే అవకాశం ఉందని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి నిబద్ధతతో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇస్తారా లేక రాజకీయ సమీకరణాల ప్రకారం ఎంపిక జరుగుతుందా అన్నది చర్చనీయాంశమైంది. నాయకులంతా ఐక్యంగా పనిచేస్తేనే నియోజకవర్గంలో మెజారిటీ స్థానాలు గెలుచుకునే అవకాశం ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. సుగుణక్క నాయకత్వంలో వర్గపోరుకు ముగింపు పలికి పార్టీని గెలుపు దిశగా నడిపిస్తారో లేదో వేచి చూడాలి.

## నిర్మల్ కోటలపై కబ్జా కోరలు..

''ప్రజాపక్షం'' సెన్సేషనల్ స్టోరీతో కదిలిన అప్పాల గణేష్

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/నిర్మల్ :** చారిత్రక వారసత్వానికి నెలవైన నిర్మల్ గడ్డపై అపురూప కట్టడాలు కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకోవడం,పర్యాటక రంగం కునారిల్లడంపై 'ప్రజాపక్షం' దినపత్రిక ప్రచురించిన ''పర్యాటకంలో అధికారుల నిద్రకబ్జాదారుల జాతర'' అనే సంచలన కథనం జిల్లా యంత్రాంగాన్ని ఉలిక్కిపడేలా చేసింది.ఈనెల 11వ తేదీన వెలువడిన ఈ కథనం పాలకుల కళ్లు తెరిపించడమే కాకుండా,పట్టణ ప్రయోజనాల పట్ల వారిని అప్రమత్తం చేసింది.ఈ క్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అత్యంత వేగంగా స్పందించి, బుధవారం తన బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో మెరుపు తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని చారిత్రక గుర్తింపు పొందిన బత్తిన్ ఘడ్,శామ్ ఘడ్ కోటలను సందర్శించిన ఆయన,అక్కడ జరుగుతున్న అక్రమణలను,శిథిలావస్థకు చేరిన కట్టడాలను చూసి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.నిర్మల్ చరిత్రను కబ్జా చేయాలనుకుంటే సహించేది లేదని అంగుళం భూమి కూడా పరాయి పాలు కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన గట్టి హెచ్చరికలు జారీ చేశారు.కేవలం పర్యటనలకే పరిమితం కాకుండా,ఈసమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే పట్టుదలతో గణేష్ చక్రవర్తి ఇప్పటికే రాష్ట్ర ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ను కలిసి,ఈ కోటల పునరుద్ధరణకు భారీగా నిధులు కేటాయించాలని కోరారు.నిర్మల్ పట్టణానికి తలమానికంగా ఉన్న ఈ ఘడ్లను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడం ద్వారా అటు ఆదాయాన్ని,ఇటు పట్టణ గౌరవాన్ని పెంచవచ్చని ఆయన అశాభావం వ్యక్తం చేశారు.ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మున్సిపాలిటి, కోటల రక్షణ, సుందరీకరణపై సమగ్రమైన మాస్టర్ ప్లాన్ రూపొందించే బాధ్యతను హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత ఎస్.కె.ఏజెన్సీకి అప్పగించింది.ఈ ఏజెన్సీ అందించే సాంకేతిక నివేదిక ఆధారంగా కోట చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్, లైటింగ్, పర్యాటకుల కోసం పార్కులను అభివృద్ధి చేస్తామని ఆయన వివరించారు.నిర్మల్ వాసులకు సాయంత్రం వేళల్లో అహ్లాదాన్ని పంచేందుకు సరైన పార్కులు లేని లోటును ఈ చారిత్రక ఘడ్ల అభివృద్ధి ద్వారా తీరుస్తామని,వీటిని కేవలం పర్యాటక కేంద్రాలుగానే కాకుండా విజ్ఞాన కేంద్రాలుగా కూడా మారుస్తామని అయన ప్రకటించారు.ప్రజా ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తున్న 'ప్రజాపక్షం' పత్రికను అభినందిస్తూ,పత్రికలు ఎత్తిచూపే లోపాలను సరిదిద్దుకుని ముందుకు సాగడమే ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత అని ఆయన కొనియాడారు.ఈ పర్యటనలో మున్సిపల్ కౌన్సిలర్లు గోపు గోపి,ఎస్.పి రాజు,మాజీ కౌన్సిలర్లు ధర్మాజీ శ్రీనివాస్,నల్లూరి పోశెట్టి,ఎఫ్.ఎస్.సి.ఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్,గుర్రం సత్యం,అడప శ్రీకాంత్ వంటి ప్రముఖ నాయకులు పాల్గొని పర్యాటక కేంద్రాల పరిరక్షణకు తమ పూర్తి మద్దతు ప్రకటించారు.మున్సిపల్ యంత్రాంగం తీసుకునప్న ఈ సత్వర నిర్ణయంపై పట్టణ ప్రజలు,చరిత్రకారులు హర్షం వ్యక్తం చేశారు.

## మంత్రి ఇలాకాలో ఇసుక దందా..!

పట్టా భూముల పేరుతో తప్పుడు అనుమతులు

ఇసుక లేని చోట క్వారీ అనుమతి.. నిల్వలున్న చోట దోపిడీ

మంత్రికి సొంత శాఖాధికారులు, అనుచరుల వెన్నుపోటు?



**ప్రజాపక్షం / చెన్నూరు :** మైనింగ్ శాఖ మంత్రి సొంత నియోజకవర్గంలోనే అక్రమార్కులు హద్దులు మీరుతున్నారు. నియోజకవర్గంలో ఇసుక దందాకు తావివ్వబోమని మంత్రి బహిరంగంగా ప్రకటిస్తున్నప్పటికీ, ఆయన మాటలను సొంత శాఖాధికారులే లెక్కచేయడం లేదు. ధనార్జనే ధ్యేయంగా అక్రమార్కులతో చేతులు కలిపి, ఇసుక నిల్వలు లేని భూముల్లో అనుమతులు పొంది, నిల్వలున్న చోట అక్రమంగా తోడేస్తూ కోట్లాది రూపాయల ప్రభుత్వ సంపద ను కొల్లగొడుతున్నారు. చెన్నూరు శివారులోని కొన్ని సర్వే నంబర్ల పేరుతో అనుమతులు తీసుకుని, క్షేత్రస్థాయిలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఈ భారీ కుంభకోణం ఇప్పుడు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారిం ది.

**నిబంధనలకు తూట్లు.. మంత్రికి వెన్నుపోటు?**

అక్రమ ఇసుక రవాణాపై మంత్రి కఠినంగా వ్యవహరిస్తున్న తరుణంలో, ఆయన ముఖ్య అనుచరులతో పాటు అధికార పార్టీకి చెందిన పలువురు నేతలు, ఒక కౌన్సిలర్ అక్రమార్కులతో జతకట్టడం గమనార్హం. చెన్నూరు శివారులోని సర్వే నంబర్లు 224, 225/1, 225/2, 222/1 పరిధిలోని మత్స్య సహకార సంఘం భూముల్లో ఇసుక నిల్వలు కొద్దిమేరకే ఉన్నప్పటికీ, అక్కడ క్వారీకి అనుమతులు పొందారు. అయితే, అసలు ఇసుక నిల్వలు ఉన్న మరో ప్రాంతంలో టిజిఎండిసి అధికారులచే తప్పుడు హద్దులు ఏర్పాటు చేయించి యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్నారు. మంత్రికి తెలియకుండానే ఆయన అనుచరులు, అధికారులు కలిసి ఈ వెన్నుపోటుకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అక్రమాల్లో అధికారులకు వాటాలు..**

హద్దులు మీరి సాగుతున్న ఈ ఇసుక దందాలో అధికారులకు భారీగా ముడుపులు అందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి నిర్వాహకులకు వచ్చే పైకంతో పాటు, లోడింగ్ పేరుతో ఒక్కో లారీ నుంచి రూ. 1,500 నుండి రూ.7వేల వరకు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ అక్రమ వసూళ్లలో అధికారులకు సైతం వాటాలు ఉన్నాయని సమాచారం. పేరుకే చెన్నూరు క్వారీ అయినప్పటికీ, చింతలపల్లి గ్రామ సమీపంలో ఈ తతంగం గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం సాగుతున్న క్వారీ నిర్వహణపై, హద్దులపై సమగ్రంగా సర్వే నిర్వహిస్తే భారీ అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా మైనింగ్ మంత్రి ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న నిర్వాహకులతో పాటు, వారికి సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వానికి చెందాల్సిన విలువైన ఇసుక సంపదను రక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## 'స్నేహ సొసైటీ'ని ఏర్పాటు చేయడం అభినందనీయం: మేయర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఒక గొప్ప ఆశయంతో స్నేహ సొసైటీ మానసిక దివ్యాంగ పాఠశాలను ఏర్పాటు చేశారని నగర మేయర్ కూరగాయ ఉమారాణి అన్నారు. మామూలు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ధీటుగా స్నేహ సొసైటీ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుంటున్నారని సంతోషం వ్యక్తం చేశారు. సొసైటీకి తమ వంతు బాధ్యతగా సహకారమందజేస్తామని హామీనిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మారుతినగర్‌లోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ కన్‌స్ట్రక్షన్, సఖి వన్ స్టాఫ్ సెంటర్ సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మేయర్ ఉమారాణి ప్రముఖ సీనియర్ వైద్యనిపుణులు డాక్టర్ ప్రతిమారాజ్, విజయలక్ష్మి హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ బండారి సుజాత, అర్బన్ సీడీపీఓ సౌందర్య హాజరై మాట్లాడారు. స్నేహ సొసైటీ ఒక గొప్ప ఆశయంతో ఏర్పాటు చేసిన ఎంతో మంది దివ్యాంగ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత స్నే సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి సిద్ధయ్యదని అభినందించారు. మామూలు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ధీటుగా స్నేహ సొసైటీ పాఠశాల దివ్యాంగ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. సొసైటీ అభ్యున్నతికి తమ వంతు బాధ్యతగా సహకారమందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మ ఉఖ్య అతిథులు బైసా సంగీత, వీరనేని రమాదేవి, బొడ్డు లక్ష్మి దేవి, ఎస్. జ్యోతి, ప్రిన్సిపాల్, రాజేశ్వరిలను శాలువలు జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లత, వీరజ, సుధా, రాజ్యలక్ష్మి , సునీతలను సన్మానించామన్నారు.

## వేగవంతంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ




**ప్రజాపక్షం/కరీంనగర్:** లక్ష్యం మేరకు ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేసే ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారుల, ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో రాష్ట్ర ఎన్నిక అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులకు మ్యాపింగ్ ప్రత్యేక పై విధి విధానాలను సూచించారు. పది రోజుల్లోగా 80 శాతం లక్ష్యం మేర కు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూ చించారు. ఈ కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్ పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

**ప్రజాపక్షం/ధర్మపురి :** ఈనెల 14 నుండి ప్రారంభంకానున్న పదవ తరగతి (ఎస్సెస్సీ) వార్షిక పరీక్షల నేపథ్యంలో ధర్మపురి మండలంలోని పరీక్షా కేంద్రాలవద్ద శాంతిభద్రతల పరిరక్షణ తోపాటు ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించేందుకు బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు ధర్మపురి తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఏరు కొండ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు ఈనెల 14 నుండి ఏప్రిల్ 16 వరకు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.30 వరకు అమలులో ఉంటుందని తహసీల్దార్ తెలిపారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికల పనులను పరిశీలించిన ఎంపిడిఒ



**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎంపిడిఒ ఓదెల రామకృష్ణ జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం పర్యటించారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటిలో నిర్వహిస్తున్న డ్రై డే–ఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించి పరిశుభ్రత చర్యలను సమీక్షించారు.అనంతరం తిమ్మాపూర్ తండా గ్రామంలోని ఎంపిపిఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న మహిళా సంఘ భవనం,నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించి మిగిలి ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.మండల పంచాయతీ అధికారి మహేశ్వర రెడ్డి,సర్పంచ్ మేఘవత్ లత,పంచాయతీ కార్యదర్శులు రమేష్,నిరోష,ఏఎన్ఎమ్ లు,అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయంపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని గర్జనపల్లి గ్రామ రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ(ఎటిఎమ్ఎ) ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతులకు సహజ వ్యవసాయం ప్రాముఖ్యత, ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహం, యూరియా వినియోగాన్ని తగ్గించి సమతుల్య ఎరువుల వినియోగం పై అవగాహన కల్పించారు. వ్యవసాయంలో కొత్త పద్ధతులు అవలంబించడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు పొందవచ్చని ఎడిఎ రామారావు రైతులకు వివరించారు. ప్రభుత్వ పథకాలను రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని ఎఎంసి చైర్మన్ రాములు నాయక్ సూచించారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణ, సహజ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడే విధానాల గురించి మండల ఎంఎఒ జయ రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం రైతులు తమ సందేహాలను నిపుణులను అడిగి, వ్యవసాయంలో ఆధునిక, సహజ పద్ధతులను అనుసరించేందుకు ఆసక్తి చూపించారు. ఈ కార్యక్రమంలోవీర్నపల్లి,గర్జనపల్లిక్లస్టర్లకుచెందిన ఎఇఒలు, రైతులు పాల్గొన్నారు.

## 19 గ్యాస్ సిలిండర్లు సీజ్, 7 హోటల్స్‌పై కేసులో నమోదు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** గోదావరిఖని ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో 19 సిలిండర్లు సీజ్ చేసి,7 హోటల్స్ పై కేసులను నమోదు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ డి.వేణు ఒక ప్రకటనలో తెలిపారు.పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం గోదావరిఖని ప్రాంతంలోని వివిధ హోటల్స్‌లో తనిఖీలు నిర్వహించడం జరిగిందని,గృహ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 7 హోటల్స్ పై కేసులు నమోదు చేసి 19 సిలిండర్లు సీజ్ చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## 16 నుంచి ఒంటి పూట బడులు

జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** ఈ నెల 16 నుంచి ఒంటి పూట బడులు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని సమస్త ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు,ప్రభుత్వ ఆమోదం పొందిన ప్రైవేటు పాఠశాలలు, కెజిబివి స్కూల్స్, ఆదర్శ పాఠశాలలు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 16 నుంచి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఒంటి పూట బడులు నడపాలని తెలిపారు.పాఠశాలల్లో పదవ తరగతి పరీక్ష కేంద్రం ఉన్నట్లయితే మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాలలను నడపాలని, ఇట్టి నిబంధనలు ఏదైనా పాఠశాల యాజమాన్యం ఉల్లంఘించినట్లు దృష్టికి వస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి సర్కార్ శ్రీకారం

* 13 కోట్లతో అర్హులైన పేదలందరికీ సన్నబియ్యం పంపిణీ
* 5లక్షల ఉద్యోగాల కల్పనకు సర్కార్ కృషి
* రాష్ట్ర కార్మిక,ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసమస్యలు పరిష్కరించాలని ప్రజాపాలన కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి అన్నారు. పేద ప్రజలను ఆదుకునేందుకు రేవంత్‌రెడ్డి పలు సంక్షేమకార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బాబుజగ్జీవన్‌రామ్ భవన్‌లో 342 మందికి 3కోట్ల 42లక్షల 39వేల రూపాయల షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి పంపిణి చేశారు. కాంగ్రెస్ సర్కార్ పేదప్రజలు నివసించేందుకు ఇందిరమ్మ ఇండ్లను పెద్దఎత్తును మంజూరు చేసిందని., చాల మంది ఇళ్లు కట్టుకోవటం తమకు ఏంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. సిద్దిపేటలో సైతం అనేక మంది ఇల్లుకట్టుకోవటం తనకు సంతోషాన్ని కల్గించిందన్నారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని. కాంగ్రెస్ సర్కార్ వచ్చాన అర్హులైన వారందరికి రేషన్‌కార్డులు మంజూరు చేసి సన్నబియ్యం అందచేస్తుందన్నారు. ప్రజలకు ఉపయోగపడేలా పథకాలు పెట్టి లబ్దిదారులకు అందచేస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్ర ప్రభుత్వం అప్పుల ఊబిలో కూరుకపోయిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు గత ప్రభుత్వం చేసిన అప్పులు,వడ్డీలు సైతం కాంగ్రెస్ సర్కార్ చెల్లిస్తుందన్నారు. గత సర్కార్ ఏన్నో హామీలను విస్మరించిందన్నారు. డబుల్‌బెడ్‌రూం తో పాటు నిరుద్యోగ భృతిని సైతం విస్మరించిందన్నారు. కాంగ్రెస్ సర్కార్ అధికారం వచ్చాక వేలాది ఉద్యోగాలను కల్పించిందన్నారు. రూ.13వేల కోట్లతో నిరుపేదలకు సన్నబియ్యం అందిస్తుందన్నారు. అర్హులైన వారందరికి పింఛన్లు మంజూరు చేస్తుందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమ్మిట్ ద్వార 5లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు కృషిచేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 119 అడ్వాన్ టెక్నాలజీ కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగ,ఉపాధి కల్పించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట మున్సిపాల్టీలో 18 కోట్లతో రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సిద్దిపేట కాంగ్రెస్ ఇంచార్జీ పూజల హరి కృష్ణ, ఆర్డీఓ సదానందం, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## 16న అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమం

సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**ప్రజాపక్షం/కరీంనగర్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారం వేసేందుకు పెట్రోల్ వంటగ్యాస్ ధరలు పెంచిందని, పెంచిన ధరలు తగ్గించాలని రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 16న సిపిఐ ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాలను ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రపంచంలో అగ్రరాజ్యమని చెప్పుకునే అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్ పై దాడుల మూలంగా ప్రపంచంలోని అన్ని దేశాల్లో ఆ ప్రభావం పడుతుందని, ప్రధానంగా ఆహార కొరత, ఆయిల్ కొరత ఏర్పడుతుందని,అంతర్జాతీయ స్థాయిలో సంక్షోభం ఏర్పడుతుందని,భారత దేశానికి పెట్రోల్, డీజిల్ దిగుమతులు తగ్గే ప్రమాదం ఉందని, దాన్నీ దృష్టిలో పెట్టుకొని కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు,వంట గ్యాస్ ధరలు పెంచి సామాన్య పేద, మధ్యతరగతి ప్రజలపై పెను భారం మోపుతుందన్నారు. ఇప్పటికే పెట్రోల్, వంట గ్యాస్ కొరత ఏర్పడిందని తక్షణమే కేంద్ర ప్రభుత్వం ధరలు తగ్గించా లని ఈ నెల 16న సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తుందని, కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో జరిగే నిరసన కార్యక్రమాలలో ప్రజలు, సిపిఐ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని, కరీంనగర్ లో జరిగే కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నేత,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పాల్గొంటారని పంజాల శ్రీనివాస్ తెలిపారు.

## చైన్ స్నాచింగ్ కేసు ఛేదించిన పోలీసులు

ఐదుగురు నిందితుల అరెస్ట్

**ప్రజాపక్షం/కరీంనగర్:** తిమ్మాపూర్ మండల పరిధిలో సంచలనం సృష్టించిన ఆర్ఎంపి వైద్యుడిపై దాడి, చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేధించారు. ఈ నేరానికి పాల్పడిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి కారు, బంగారు గొలుసు,నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం కమిషనరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన తమ్మనవేని కొమురయ్య (56) ఆర్ఎంపిగా పనిచేస్తున్నారు. నిందితులు పెనుగొండ అబినైజర్ (19), గుండ్లపల్లి, పంబాల నాగరాజు (19), గుండ్లపల్లి, మాచర్ల రామ్ చరణ్ గౌడ్ (19), నుస్తులాపూర్, మరో బాల (మైనర్) నిందితుడు స్థానిక ప్రాంతానికి చెందిన వారు కాగా, గుజ్జేటి మధువర్ధన్ (19), పెద్దపల్లి జిల్లా బొట్లవనపర్తికి చెం దిన వారని, వీరు జల్సాలకు అలవాటు పడి, గతంలో అద్దెకు తీసుకున్న ఎర్టిగా కారు డ్యామేజీకి సంబంధిం చి యజమానికి చెల్లించాల్సిన రూ.40,000 ల కోసం దొంగతనానికి పథకం వేసి, ఒంటరిగా తిరిగే కొమురయ్య మెడలోని బంగారు గొలుసును లక్ష్యంగా చేసుకుని, మార్చి 11న కరీంనగర్‌లో కారును అద్దెకు తీసుకుని మాటు వేశారు. అదే రోజు రాత్రి 11:30 గం టల సమయంలో కొమురయ్య నేదునూర్ నుండి మోటార్ సైకిల్‌పై వస్తుండగా, నిందితులు కారులో వెంబడించి, నేదునూర్ శివారులోని మామిడి తోట వ ద్ద అడ్డుకుని, కళ్ళలో కారం చల్లి భయభ్రాంతులకు గురిచేసి మెడలోని తులం బంగారు గొలుసు, వెయ్యి రూపాయల నగదు దోచుకుని పరారయ్యారు. ఈ ఘ టనపై తిమ్మాపూర్ సి.ఐ. సదన్ కుమార్ తన సిబ్బంది తో దర్యాప్తు చేపట్టగా..శుక్రవారం ఉదయం 8:00 గంటలకు ఇందిరానగర్ క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు ని ర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా వచ్చిన స్విఫ్ట్ డిజైర్ కారును ఆపి తనిఖీ చేయగా ఐదుగురు నిందితులు పట్టుబడ్డారు. వారి వద్ద నుండి నేరానికి ఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కారు, ఒక తులం బంగారు గొలుసు,4 మొబైల్ ఫోన్లు, వెయ్యి రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లుసిపి పేర్కొన్నారు. విచారణలో చేసిన నేరాన్ని అంగీకరించడమే కాకుండా, కోహెడ మండలంలో ఒక కరెంటు మోటారు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని సిపి తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన కరీంనగర్ రూరల్ ఎసిపి విజయ కుమార్, తిమ్మాపూర్ సి.ఐ సదన్ కుమార్, ఎల్. ఎం.డి. కాలనీ ఎస్.ఐ అన్వర్, చిగురుమామిడి ఎస్ఐ, కానిస్టేబుళ్లను సిపి అభినందించారు.

## బీడీ కార్మికులకు పెరిగిన కరువుభత్యం



**ప్రజాపక్షం/కోరుట్ల :** తెలంగాణ రాష్ట్రం లో బీడీ కార్మికులకు పెరిగిన కరువుభత్యంను బీడీ యజమానులు వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు కోరారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కోరుట్ల డివిజన్ కేంద్రంలో ని బీడీ కార్మిక సంఘం ఎఐటియుసి కార్యాలయంలో మాట్లాడుతూ 1994 సంవత్సరంలో బీడీకార్మికుల ఐక్య పోరా టం చేసి కరువు భత్యాన్ని అమలు చేయాలని ఒప్పందం కుదిరింది. ప్రతి ఏడాదికి ఒకసారి బీడీ యజమాన్యాలు అమలు చేస్తున్నారు. 2025 జనవరి నెల నుండి డిసెంబర్ 31 వరకు వినిమయ ధరల సూచిక ప్రకారం 1913 పా యింట్ల నుండి 1968 పాయింట్లు కు పెరిగింది అనగా 55 పాయింట్లు అవుతుంది. ఒక పాయింట్ కు పది పైసల చొప్పున 5 రూపాయల 50 పైసలు అదనంగా పెరుగుతుంది. దీని ప్రకారం గత సంవత్సర కూలి వీడిఏ ఇతర బెనిఫిట్‌ను కలుపుకొని బీడీ కార్మికులకు ఒక వెయ్యి బీడీలు చుట్టినందుకు 268 రూపాయల 31 పైసా చెల్లించవలసి ఉంటుంది అలాగే నెలసరి ఉద్యోగులకు బీడీ చాటల్ వాళ్ళ బీడీప్యాకర్స్‌కు ప్రతి నెల వేతనంతో 165 రూపాయలు కరువు భత్యం కలుపుకొని చెల్లించబడుతుంది వెంటనే అమలు చేయాలని బీడీ యజమానులకు వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చెన్న విశ్వనాథం, సహాయ కార్యదర్శులు మునుగూరి హనుమంతు ,వెన్న మహేష్, జిల్లా కోశాధికారి ఎండి ముక్రం పాల్గొన్నారు.

## మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల :** మహిళలు స్వయం శక్తితో ఎదిగి సమాజానికి స్ఫూర్తిగా నిలువాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహిళా ఉద్యోగులకు అవార్డులను ఎమ్మెల్యే సంజయ్ కుమార్, అదనపు కలెక్టర్లు బిఎస్ లత, రాజగౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి, ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి ల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేసి షాలువాలతో స న్మానించి మాట్లాడారు. మహిళల శక్తి సామర్థ్యాలు అనంతమని వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజ్ కుమార్, బిసి వెల్ఫేర్ అధికారి సునీత, మెప్మా ఏవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

**గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై ర్కార్ ప్రత్యేక దృష్టి**

జగిత్యాల పట్టణానికి చెందిన 4 గురు గల్ఫ్ కార్మికులు గల్ఫ్ లో మరణించగా వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున 20 లక్షల రూపాయల విలువగల ప్రొసీడింగ్ కాపీలను భాధిత కుటుంబ సభ్యులకు జగిత్యాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అందజేశారు. అనంతరం జగిత్యాల పట్టణ, అర్బన్, రూరల్ మండలానికి చెందిన 10 మంది ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరైన 10 లక్షల రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అందజేశారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, ఎమ్మార్వో రామ్మోహన్, సీనియర్ నాయకులు, సర్పంచ్‌లు,కౌన్సిలర్లులు పవిత్ర మహేష్, హరీష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

సిరిసిల్ల అశోక్ నగర్ లోని అంగన్వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల పట్టణం అశోక్ నగర్ లోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హాజరు రిజిస్టర్ తనిఖీ చేసి, మొత్తం ఎందరు పిల్లలు ఉన్నారు? రోజూ ఎందరు వస్తున్నారో ఆరా తీశారు. పలువురు పిల్లల తల్లులతో మాట్లాడి.. గుడ్డు, పోషకాహారం ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లల ఎత్తు, బరువు కొలిచిన వివరాలు, ఆన్లైన్ అలాగే రిజిస్టర్ నమోదు చేసిన వివరాలు పరిశీలించారు. కేంద్రంలో నిలువు ఉన్న గుడ్లు, బాలా అమృతం తనిఖీ చేశారు. పిల్లల ఎత్తు, బరువు కొలిచే యంత్రాల పనితీరు పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలు రోజూ వచ్చేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రజాబాట




**ప్రజాపక్షం/గొల్లపల్లి :** క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకే విద్యుత్ శాఖ ప్రజా బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీజీ ఎంపీడీసీఎల్ ఎఇరాకేష్ కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చిల్వాకోడూర్ సెక్షన్ పరిధిలోని దట్నూర్ గ్రామంలో శుక్రవారం ప్రజా బాట కార్యక్రమాన్ని చేపట్టారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఇండ్ల పై నుండి వెళ్లే విద్యుత్ లైన్‌లను మార్చేందుకు ఎస్సీ ,ఎస్టి , దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ప్రత్యేకంగా సహకరించి సుమారు రూ.5 లక్షల అంచనా వ్యయంతో నిధులు మంజూరు చేయగా అట్టి పనులను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు .చిల్వాకోడూర్ ఏ ఈ రాకేష్ కుమార్, మహేష్ సబ్ ఇంజనీర్, విద్యుత్ శాఖ సిబ్బంది,సర్పంచ్ బెక్కం గంగయ్య,ఉపసర్పంచ్ జక్కుల తిరుపతి,వార్డ్ సభ్యులు గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

## ఎల్‌పిజి గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేదు

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి




**ప్రజాపక్షం/ సిద్దిపేట :** గృహావసరాలకు,కెజిబివి, గురుకులాలు. సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలకు కొరత కాకుండ వంట గ్యాస్ సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి గ్యాస్ డీలర్లకు సూచించారు. శుక్రవారం ఎల్‌పిజి గ్యాస్ డీలర్లు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎల్‌పిజి గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాలేదని, ఇకముందు కూడ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది వంటగ్యాస్ సరఫరా చేయాలని డీలర్లను ఆదేశించారు. యుద్ధ వాతావరణంలో ఇతర దేశాల నుండి ఎలాంటి ఇబ్బంది కలుగకుండ ప్రభుత్వం ఇంధనమును దిగుమతి చేసుకొని సరఫరా చేస్తుందన్నారు. ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, కెబిజివి ,ప్రభుత్వ పాఠశాలలకు, ఆసుపత్రులు, అనాథశ్రమాలు,వృద్ధాశ్రమాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండ గ్యాస్ సరఫరా చేయాలన్నారు. గృహావసరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండ గ్యాస్ సరఫరా చేయాలన్నారు.సమయానికి గ్యాస్ డెలివరీ బాయ్స్‌ను పర్యావేక్షించాలన్నారు. ఏదైన సమస్య వస్తే జిల్లా పౌరసరఫరా అధికారి ధృష్టికి తీసుకారావలన్నారు.గ్యాస్ స్టాక్, డెలివరీ రిజిస్టర్‌ను ఖచ్చింతంగా మెయిన్‌టెయిన్ చేయాలన్నారు. రెవెన్యూ, సివిల్ సప్లయ్,విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తారన్నారు. గ్యాస్‌సిలిండర్ సరఫరాలో తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రజలకు అవసరమగు గ్యాస్ ప్రభుత్వం సరఫరా చేస్తుంది:** ప్రభుత్వం జిల్లాకు అవసరమైన వంట గ్యాస్ సరఫరా చేస్తుందని..ప్రజలెవ్వరు వంటగ్యాస్ కొరకు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. శుక్రవారం కలెక్టర్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో ఇ 3లక్షల 32వేల 850 డోమెస్టిక్ వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని. 1500 కమర్షియల్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. గతంలో ప్రభుత్వం సరఫరా చేసిన విధంగా ఇప్పుడు కూడ జిల్లాకు అవసరమైన గ్యాస్ ఏలాంటి ఇబ్బందులు లేకుండ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఎప్పటిలాగే జిల్లా ప్రజలకు అవసరమైన స్థాయిలో వంట గ్యాస్ సరఫరా చేస్తున్నందున ప్రజలు అనవసర భయందోళనకు గురై ఎక్కువ సిలిండర్లు బుక్ చేసుకోవద్దు అన్నారు. ఎక్కువ సిలిండర్లు బుక్ చేసుకోవటం వల్ల ఇబ్బందులు తలేత్తున్నాయని కాబట్టిలో ప్రజలు వంటగ్యాస్‌లో ఏలాంటి ఆందోళనకు గురికావద్దని సూచించారు. కమర్షియల్ వంట గ్యాస్‌ను సైతం సరఫరా చేస్తామని కలెక్టర్ వెల్లడించలచారు.

## నేడే సాయుధ పోరాట అమర యోధుల78వ వర్ధంతి సభ

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** భూమి కోసం భుక్తి కోసం పేద ప్రజల కోసం సాయుధ పోరాటం చేసి అమరులైన కామ్రేడ్‌ల 78వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సిపిఐ పార్టీ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యుడు మాజీ ఎమ్యెల్యే చాడ వెంకటరెడ్డి హాజరుకానున్నట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్ సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 1948 వ మార్చి 14న హుస్నాబాద్ మండల మహ్మదాపూర్ గ్రా మంలోని భూఘన్‌గుట్టల్లో ఎన్‌కౌంటర్‌లో మరులైన భారతకమ్యూనిస్టు పార్టీ కరీంనగర్ జిల్లా మొట్టమెదటి కార్యదర్శి అమరజీవి అనభేరి ప్రభాకర్‌రావుతోపాటు12 మంది అమరులైనారు. వారి జ్ఞాపకార్థం అమరుల స్తూపం వద్ద 78వ వర్థంతి సందర్భంగా 14తేదీన శనివారం నివాళ్లు అర్పించి,వారి సమాధుల వద్ద పూల మాలలతోశ్రద్ధాంజలి ఘటించిన అనంతరం సభనిర్వహించడం జరుగుతుందని సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి గడిపె మల్లేశ్ తెలిపారు.జిల్లా కార్యదర్శి మంద పవన్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాలశ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ జాగీరు సత్యనారయణ, తెలంగాణ సాయుధ పోరాట యోధుల కుటుంబ సభ్యుడు జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు సిపిఐ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమంను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

"ప్రపంచ ప్రఖ్యాత పాప్ ఐకాన్ మైకేల్ జాక్సన్ కోసం ఐకానిక్ డాన్స్ మూవ్స్ రూపొందించిన లెజెండరీ కొరియోగ్రాఫర్ విన్సెంట్ పాటర్సన్, భారతీయ స్టార్ కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్ పై ప్రశంసలు కురిపించారు."

# రీల్

## కుటుంబ నేపథ్యంలో 'కార్మేని సెల్వం'

పాత్వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్, బడవ గోపీ, కోతండం, కరణ్ చక్రవర్తి, శంకర నారాయణ్ వి, హరిత పరాకోడ్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఈ చిత్రం థియేటర్స్ లోకి రాబోతుంది. డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలు ఉన్నాయి అని సముద్రఖని వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైన టీజర్ సినిమాపై క్యూరియాసిటిని పెంచుతుంది. అధిక ఖర్చులు, భారీ లోన్లు, క్రిప్టో పెట్టుబడులు, త్వరగా ధనవంతులు కావాలనే ఆశతో చేసే ప్రయత్నాలు వంటి విషయాలను వివిధ కోణాల్లో చూపిస్తూ నేటి సమాజంలో డబ్బు పట్ల ఉన్న ఆలోచనలను చూపించిన విధానం ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా ఈఎంఐలు, క్రెడిట్ కార్డ్ ఆధారిత జీవనశైలి, డబ్బు కోసం మనుషులు తీసుకునే నిర్ణయాలు కథలో కీలక పాత్ర పోషించబోతున్నాయని అర్థమవుతుంది. సముద్రఖని కుటుంబంతో కనిపించే సన్నివేశాలు హృదయానికి హత్తుకునేలా ఉంటాయి. లక్ష్మీ ప్రియా చంద్రమౌళి ఆయన భార్యగా, చిన్న కుమారుడితో కుటుంబ జీవితం చూపిస్తుండగా, మరోవైపు విదేశాల్లో ఒంటరిగా కనిపించే కొన్ని షాట్లు కథపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. గౌతమ్ వాసుదేవ్ మీనన్ పాత్రను గోప్యంగా ఉంచడం కూడా ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతోంది.



## డాల్బీ ఫార్మేట్‌లో 'పెద్ది'

రామ్ చరణ్ పాన్ఇండియా యాక్షన్ డ్రామా పెద్ది. పోస్ట్‌ప్రొడక్షన్, ప్రమోషనల్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. బుచ్చి బాబు సనా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం అత్యాధునిక డాల్బీ సినిమాస్ ఫార్మెట్లో కూడా విడుదల కానుంది. రామ్ చరణ్ మాస్ రగ్గడ్ అవతార్ను డాల్బీ సినిమాస్ ఫార్మెట్ లో చూడడం ప్రేక్షకులకు మరింత గ్రాండ్ ఎక్స్ పీరియన్స్ అందించనుంది. పెద్ది వంటి భారీ యాక్షన్, ఎమోషన్ కలిగిన సినిమాను డాల్బీ సినిమాస్‌లో చూడడం ప్రేక్షకులకు పూర్తిగా లీనమయ్యే అనుభూతిని ఇవ్వనుంది. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్లో రామ్ చరణ్ రగ్డ్ అవతార్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. చేతిలో బ్యాట్ పట్టుకుని, ఇంటెన్స్ లుక్తో కనిపిస్తున్న ఆయన క్యారెక్టర్ సినిమాలో పవర్‌ఫుల్ యాక్షన్‌ను సూచిస్తోంది. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఎ.ఆర్ రెహమాన్ అందించిన సౌండ్‌ట్రాక్స్ మెగా చార్ట్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. చికిరి చికిరి, రైరై రా రా పాటలు వరల్డ్ వైడ్ వైరల్ అయ్యాయి. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. శివ రాజు కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ ఇతర ప్రముఖ పాత్రలను పోషిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ ఆర్.రత్నవేలు, ఎడిటర్ నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా.



## థ్రిల్లర్‌గా 'దిష్టిబొమ్మ'

కె.ఎస్.సినిమాస్ బ్యానర్ పై పుండాల ఉమాపతి సమర్పణలో శ్రీ అలిమేలు మంగమ్మ వారి ప్రొడక్షన్స్ లో ఆర్.గోపు నిర్మాణంలో రాబోతున్న చిత్రం దిష్టి బొమ్మ. ఆర్.గోపు బాలాజీ దర్శకత్వంలో , పుండాల ఉమాపతి, ఆర్.గోపు నిర్మాతలుగా ఉమేష్ రాయల్, గాయత్రి , మౌనిక, మురళి, అమిదాబ్, ముఖ్య పాత్రలుగా ఈ సినిమా రూపొందించబడింది.ఈ సినిమా ఫస్ట్ లుక్ , ట్రైలర్ ను ప్రముఖ దర్శకులు వి.ఎన్ ఆదిత్య విడుదల చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''త్వరలో విడుదల కాబోతున్న దిష్టి బొమ్మ సినిమా సక్సెస్ అవ్వాలని, అందరికీ మంచి పేరు రావాలని తెలిపారు. దర్శకుడు ఆర్. గోపు బాలాజీ, హర్రర్ లో ఎవ్వరూ టచ్ చెయ్యని ఒక సరికొత్త పాయింట్‌తో ఈ సినిమా ఉంటుందని చిత్ర నిర్మాతలు తెలిపారు.




## 'ఇడిసెల్లిపోయావా' పాట ఆవిష్కరణ

హీరో శ్రీరామ్ నటిస్తున్న కొత్త సినిమా 'మా రాముడు అందరివాడు'. ఈ చిత్రాన్ని అనుముల ప్రొడక్షన్స్, శ్రీరామ్ క్రియేషన్స్ బ్యానర్స్ పై అనుముల లక్ష్మణరావు, పల్లకొండ శ్రీరాములు నిర్మిస్తున్నారు. యద్దనపూడి మైకేల్ దర్శకత్వం వహిస్తున్నారు. నిర్మాత అనుముల లక్ష్మణరావు ఈ చిత్రంలో విలన్ గా నటిస్తున్నారు. శ్రీరామ్ సరసన స్వాతి హీరోయిన్ గా కనిపించనుంది. సుమన్, సమ్మెట గాంధీ, నాగ మహేష్, బాహుబలి ప్రభాకర్, ఆనంద్ భారతి, జబర్దస్ అప్పారావు, చిట్టి బాబు, గడ్డం నవీన్, కీలకపాత్రలు పోషిస్తున్నారు. త్వరలో 'మా రాముడు అందరివాడు' సినిమా పాన్ ఇండియా రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా ఈ సినిమాలోని 'ఇడిసెల్లిపోయావా..' సాంగ్ లాంఛ్ చేశారు. ఈ పాటకు డైరెక్టర్ యద్ధనపూడి మైఖేల్ సాహిత్యాన్ని అందించి, నల్లగొండ నర్సారెడ్డితో పాడారు. 'ఇడిసెల్లిపోయావా..' సాంగ్ లాంఛ్ కార్యక్రమంలో హీరో శ్రీరామ్, నిర్మాత, నటుడు అనుముల లక్ష్మణరావు, డైరెక్టర్, సాంగ్ రైటర్ యద్ధనపూడి మైఖేల్, సింగర్ నల్లగొండ గద్దర్ నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు. 'మా రాముడు అందరివాడు' సినిమాలో తండ్రిని కోల్పోయిన కొడుకు అలాగే గొప్ప వ్యక్తిని కోల్పోయామని ఊరి ప్రజలు కలిసి విషాదంతో పాడుకునే ఒక అద్భుతమైన పాట 'ఇడిసెల్లిపోయావా..'. ఈ పాట చాలా బాగుందని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశంసించారు. 'ఇడిసెల్లిపోయావా..' పాటను, పాట పోస్టర్స్ ను ఆయన లాంఛ్ చేసి, సాంగ్ విన్నారు.




## 'యూత్' ఫస్ట్ లుక్ పోస్టర్ లాంఛ్

కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్సి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ 'యూత్'. ఈ చిత్రాన్ని ఇదే పేరుతో ఈ2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. త్వరలోనే 'యూత్' మూవీ తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను హీరో కిరణ్ అబ్బవరం లాంఛ్ చేశారు. యూత్' మూవీని తెలుగులోకి తీసుకొస్తున్న వినీత్, సందీప్ కిరణ్ అబ్బవరంతో చాలాకాలంగా ట్రావెల్ చేస్తున్నారు. కిరణ్ వారికి సపోర్ట్ గా నిలుస్తూ ఈ మూవీని ప్రమోట్ చేస్తున్నారు. యూత్' ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తుంటే మంచి యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ లా అనిపిస్తోంది. మలయాళ బ్లాక్ బస్టర్ ప్రేమలు తెలుగులోనూ ఘన విజయాన్ని అందుకుంది. అలాగే ఇలాంటి తరహా కంటెంట్ తోనే వచ్చిన లిటిల్ హారట్స్ కూడా పెద్ద సక్సెస్ దక్కించుకుంది. ఇప్పుడు తెలుగు ఆడియెన్స్ కు కావాల్సిన యూత్ ఫుల్ రొమాంటిక్ ఎంటర్ టైనర్ జానర్ లో వస్తున్న 'యూత్' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ తోనే అలాంటి వైబ్స్ క్రియేట్ చేస్తోంది.కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్సి యాదవ్, మీనాక్షి దినేష్, నటిస్తున్నారు.



## 'వృషకర్మ' కోసం నాగ చైతన్య మేకోవర్

నాగ చైతన్య మిథికల్ స్పెక్టకిల్ 'వృషకర్మ' కోసం చాలా హార్డ్ వర్క్ చేస్తున్నారు. 'విరూపాక్ష'తో బ్లాక్ బస్టర్ సాధించిన కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ వి సిసి , సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి, బాపినీడు ఈ వెంచర్ను సమర్పిస్తున్నారు. బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'వృషకర్మ' గ్లింప్స్ అన్ని ప్లాట్‌ఫామ్‌లకు, ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందనను పొందింది. వెంటనే వైరల్ అయ్యి భారీ సంచలనాన్ని సృష్టిస్తోంది. ఇంటెన్స్ విజువల్స్, పవర్ ఫుల్ వరల్ బిల్డింగ్ అందరినీ ఆశ్చర్యపరిచాయి, సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. ఈ రఫ్ అండ్ రగ్డ్ లుక్ సినిమాలో ఉండబోయే హైఆక్టేన్ యాక్షన్తో పాటు ఎమోషనని సూచిస్తోంది. ఇది చైతన్య కెరీర్‌లో ఇప్పటివరకూ ఎన్నడూ కనిపించని ఇంటెన్స్ ఆన్స్క్రీన్ అవతార్లలో ఒకటిగా నిలవనుంది.



## ఖమ్మంలో ఘనంగా 'మాంగళ్య షాపింగ్ మాల్' ప్రారంభం

సినీ నటి శ్రీలీల సందడి

-నమ్మకానికి మారుపేరు మాంగళ్య : మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తూ నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ ప్రజల అదరాభిమానాలు పొందిన మాంగళ్య షాపింగ్ మాల్ ఇప్పుడు ఖమ్మంలో 30వ శాఖను ఘనంగా ప్రారంభించింది. శుక్రవారం ఈ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సినీ నటి శ్రీలీల హాజరై జ్యోతి ప్రజ్వలన, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వస్త్ర వ్యాపార రంగంలో దశాబ్దాల అనుభవంతో నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు మాంగళ్య షాపింగ్ మాల్ అందిస్తుందని తెలిపారు. మూడు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో ప్రజలకు అత్యుత్తమమైన వస్త్రాలను అందిస్తున్నారన్నారు. మాంగళ్య యాజమాన్యం పివిఎన్ మూర్తి, కాసం నమఃశివాయ బ్రదర్స్ కలిసి కృష్ణా జిల్లాగా వస్త్ర వ్యాపారం చేస్తున్నారన్నారు. త్వరలో తమిళనాడు రాష్ట్రంలో కూడా మాంగళ్య షాపింగ్ మాల్ విస్తరించనున్నారన్నారు. సినీ నటి శ్రీలీల మాట్లాడుతూ ఖమ్మం ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌ను ఆదరిస్తారని నమ్మకం ఉందన్నారు. ఖమ్మం ప్రజల ఆశీర్వాదలతో ఈ మాల్ మరింత విజయవంతమవుతుందన్నారు. వస్త్ర ప్రియులకు నూతన మోడల్స్‌ను ఎప్పటికప్పుడు అందిస్తూ మాంగళ్య ప్రజల అభిమానాన్ని చూరగొందన్నారు. మూడు రాష్ట్రాల్లో ఇది విస్తరించిందని 30వ షాపును ఖమ్మంలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మాంగళ్య షాపింగ్ మాల్‌లో వస్త్రాలు కొనుగోలు చేయాలని శ్రీలీల తెలిపారు. ఉగాది రోజే తాను నటించిన ఉస్తాద్ భగత్‌సింగ్ విడుదలవుతుందని దానిని కూడా ఆదరించాలని తెలిపారు. షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నర్సింహమూర్తి, కాసం నమః శివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ లు మాట్లాడుతూ ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరలో అందించడమే మాంగళ్య షాపింగ్ మాల్ విజయ రహస్యమని తెలిపారు. మా సొంత హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఆధునీక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్ చేసి వస్త్ర వ్యాపారంలో ముందంజలో ఉన్నామన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్‌లో పురుషులు, యువత, పిల్లల కోసం తాజా ఫ్యాషన్ కలెక్షన్స్, వివాహాలు, ఇతర శుభ కార్యలకు ప్రత్యేకమైన వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మా వద్ద రూ. 99 నుంచి లక్ష వరకు ధరల శ్రేణి వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖమ్మం ప్రజలు కూడా మాంగళ్య షాపింగ్ మాల్‌ను ఆదరిస్తారని వారు ఆకాంక్షించారు.



**సినీ నటి శ్రీలీల సందడి :**

మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ఖమ్మం విచ్చేసిన సినీ నటి శ్రీలీల సందడి చేశారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు శ్రీలీలను చూసేందుకు తరలి వచ్చారు. షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన అనంతరం అభిమానులకు నమస్కరించి చేతులు ఊపుతూ వారిలో ఉత్సాహాన్ని నింపింది. అభిమానులతో కలిసి సెల్ఫీలు దిగి సందడి చేసింది.

## నేషనల్ మొబిలిటీ సమ్మిట్ ద్వారా నూతన రవాణా విధానాలు

రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సెకండ్ నేషనల్ మొబిలిటీ సమ్మిట్ ద్వారా నూతన రవాణా విధానాలు, టెక్నాలజీలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ సమ్మిట్‌ను ఈ నెల 17న హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, జెటిసి చంద్రశేఖర్ గౌడ్, ఎలేట్స్ టెక్నో ప్రతినిధులు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేషనల్ మొబిలిటీ సమ్మిట్‌లో భారతదేశంలోని రవాణా రంగం, స్మార్ట్ మొబిలిటీ, ఎలక్ట్రిక్ వాహనాలు, నగర రవాణా అభివృద్ధి వంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఎలేట్స్ టెక్నోమీడియా నిర్వహిస్తున్న కార్యక్రమంలో తెలంగాణ రవాణా శాఖ ముఖ్య భాగస్వామిగా ఉందని, హైదరాబాద్‌లో నిర్వహించనున్న నేషనల్ మొబిలిటీ సమ్మిట్ 2026 దేశంలో సస్టైనబుల్, స్మార్ట్ ట్రాన్స్‌పోర్ట్ అభివృద్ధికి ముఖ్యమైన వేదికగా నిలవనుందన్నారు. ఈ సమ్మిట్‌లో ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం, గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్, కార్బన్ ఉద్గారాల తగ్గింపు పై విస్తృత చర్చలు జరుగుతాయని, స్మార్ట్ మొబిలిటీ టెక్నాలజీలు ఎఐ ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, డిజిటల్ టికెటింగ్, డేటా ఆధారిత ఫ్లీట్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారని పేర్కొన్నారు. మెట్రో, బస్సులు, ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు ఇతర రవాణా విధానాలను కలిపే మల్టీమోడల్ కనెక్టివిటీ అవసరాన్ని సమ్మిట్‌లో ప్రధానంగా చర్చించబోతున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ సమ్మిట్‌లో కేంద్ర, వివిధ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రవాణా శాఖ అధికారులు, నగర అభివృద్ధి సంస్థలు, ఆటోమొబైల్, ఇవి కంపెనీలు టెక్నాలజీ సంస్థలు, స్టార్టప్‌లు, పెట్టుబడిదారులు, అకాడెమిక్ నిపుణులు పాల్గొంటారని తెలిపారు. సుస్థిర నగర రవాణా, ఎలక్ట్రిక్, గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్, మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ (మెట్రో, బస్సులు, క్యాబ్స్ సమన్వయం), డిజిటల్ టికెటింగ్, స్మార్ట్ ట్రాఫిక్ సిస్టమ్స్ చివరి మైలు కనెక్టివిటీ అంశాలు ప్రధానంగా చర్చించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.



## యువజన సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

కల్లూరు ధర్మేంద్ర

**ప్రజాపక్షం/హైదరాబాద్:** యువజన సమస్యలను పరిష్కరించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ప్రశ్నించే యువతే దేశ భవిష్యత్తు అని అన్నారు. ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ సి గ్రౌండ్స్ లో జరుగుతున్న 'భగత్ సింగ్ ప్రీమియర్ లీగ్(బిపిఎల్) టోర్నీ' రెండవ రోజు శనివారం జరిగిన కార్యక్రమానికి ధర్మేంద్ర ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అవినీతి, నిరుద్యోగం, విద్యా వ్యా పారీకరణ, మాదకద్రవ్యాల వ్యాప్తి వంటి సమస్యలపై యువత ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రశ్నించని యువత బాని సత్వానికి లోనవుతుందని, దేశంలో పెరుగుతు న్న నిరుద్యోగం, విద్యార్థులపై పెరుగుతున్న భా రాలు, యువతను మాదకద్రవ్యాల బారిన పడే విధంగా చేస్తున్న శక్తులను ఎదిరించడం ప్రతి చై తన్యవంతమైన బాధ్యత అని చెప్పారు.




## విపక్షాలు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

మంది సంతకం చేసేందుకు ఆసక్తిని వ్యక్తం చేశారని చెప్పాయి. సిఇసి జ్ఞానేశ కుమార్‌పై మొత్తం ఏడు అభియోగాలను విపక్షాల ఎంపిలు నమోదు చేశారు. వాటిలో ముఖ్యంగా ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (స ర్) ప్రక్రియలో బిజెపికి అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపిస్తున్నాయి. విధి నిర్వహణలో పక్షపాత ధోరణి ఎన్నికల్లో అవకతవకలపై దర్యాప్తునకు ఉద్దేశపూర్వకంగా అడ్డుపడటం, పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడం వంటివి ఆరోపణలు ఉన్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తి తొలగించే విధానమేభారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5) ప్రకారం, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను సుప్రీంకోర్టు న్యాయ మూర్తిని తొలగించడానికి అనుసరించే ప్రక్రియ ఉంటుంది. ము ందు పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో సిఇసి తొలగింపు తీర్మాన నోటీసులు ఇవ్వాలి. అందుకోసం లోక్‌సభలో నోటీసు ఇవ్వడానికి కనీసం 100 మంది స భ్యులు, రాజ్యసభలో ఇచ్చేందుకు 50 మంది సభ్యులు సంతకం చేయాలి. ఆమోదం పొందాలంటే ఆయా సభల్లోని మొత్తం సభ్యుల్లో సగం కంటే ఎ క్కువ మంది, హాజరై ఓటు వేసిన వారిలో కనీసం 2/3 వంతు మంది మద్దతు ఇవ్వాలి.

## తక్షణమే భూదాన యజ్ఞ బోర్డు

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. అఖిల భారత సర్వ సేవా సంఘం చేసిన సిఫార్సుల మేరకు సంబంధిత భూదాన చట్టం, నిబంధనల ప్రకారం నూతనంగా భూదాన యజ్ఞ బోర్డును ఏర్పాటు చేసి, భూమిలేని నిరుపేదలకు భూదాన భూములను పంపిణి చేయాలని అజీజ్ పాషా కోరారు. ఆర్.శంకర్ నాయక్ మాట్లాడుతూ పేదలకు పంపిణి చేయాల్సిన వేలాది ఎకరాల భూములను భూబకాసురుల కోరల్లో చిక్కుకుని, అన్యాక్రాంతమైతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భూదాన భూముల్లో అక్రమంగా ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు, పరిశ్రమలు, డైరీ ఫాములు వెలిశాయన్నారు. భూదాన భూ మాఫియా కింగ్‌గా పేరొందిన భూదాన యజ్ఞ బోర్డు మాజీ చైర్మన్ రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది పేదల నుండి కోట్ల రూపాయలను దండుకుని భూదాన భూములపై ఇప్పటికి నకిలీ ప్రొసీడింగ్స్ జారీ చేస్తున్నారనిఆరోపించారు. భూదాన భూముల మొత్తం దస్తావేజులు, ప్రొసీడింగ్స్ పత్రాలు సిబిసిఐడి ఆదీనంలో ఉన్నాయన్నారు. భూదాన యజ్ఞ బోర్డు కార్యాలయంలో కూర్చొని ప్రొసీడింగ్స్ జారీ చేసి, భూదాన భూములను పంపిణి చేసే హక్కు ఆ మాజీ చైర్మన్ కు లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని శంకర్ నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర కార్యదర్శి వై. గిరి ప్రసాద్, నాయకులు ఎస్. యాదమ్మ, బి. భాస్కర్, ఎస్. మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె సైరన్ (మొదటి పేజీ తరువాయి)

2017లో రిటైరైన కార్మికులకు ఫిక్సేషన్లు జరిగినా, నేటివరకు వారికి సెటిల్మెంట్స్ చేయలేదని ఆయన తెలిపారు. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో ఆర్‌టిసి కార్మికులకు అందజేయాలని వారు డిమాండ్ చేశారు. వైస్ చైర్మన్ ఎం. థామస్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ఆయన ముఖ్యమంత్రి అయి రెండున్నర సంవత్సరాలు గడిచినా విలీన ప్రక్రియ నేటివరకు మొదలు కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ నేటివరకు నెరవేరకపోవడంతో కార్మికులలో అసంతృప్తి నెలకొందని ఆయన తెలియజేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జెఎసితో చర్చలు జరపి, తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది కార్మికులు పాల్గొని, సమ్మెకు సిద్ధం అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

## ప్రతిదాడులు..

(మొదటి పేజీ తరువాయి)

కొద్ది గంటల్లోనే దాదాపు 50 డ్రోన్లను గాల్లోనే కూల్చివేశారు. ఇవి సౌదీ అరేబియా తూర్పు, మధ్య ప్రాంతాల వైపు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇక దుబాయ్‌లో కూడా ఒక చిన్న ఘటన చోటుచేసుకుంది. గాల్లో అడ్డుకున్న క్షిపణి అవశేషాలు ఒక భవనంపై పడటంతో పరిశ్రమల ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు చెప్పారు. పొగ మాత్రం నగరంలో ప్రసిద్ధి చెందిన బుర్జ్ అల్ అరబ్ హోటల్ వరకు కనిపించింది. ఇక లెబనాన్ రాజధాని బీరూట్‌లో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ఒక కారుపై జరిగిన దాడిలో ఒక వ్యక్తి మరణించాడు. అదే సమయంలో ఇరాన్ మద్దతు ఉన్న హెజ్‌బొల్లా ఉత్తర ఇజ్రాయెల్‌పై రాకెట్లు ప్రయోగించింది. ఈ దాడిలో సుమారు 58 మంది గాయపడ్డారు. ఇక ఇరాక్‌లోని ఎర్బిల్ వద్ద జరిగిన డ్రోన్ దాడిలో ఒక ఫ్రెంచ్ సైనికుడు మరణించినట్లు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మాక్రాన్ ప్రకటించారు. ఈ పరిణామాలు చూస్తే, ఈ యుద్ధం మెల్లగా మధ్యప్రాచ్యంలోని అనేక దేశాలకు వ్యాపించే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మొత్తం మీద పశ్చిమాసియా అట్టుడుకుతుండగా, మధ్యప్రాచ్యంలోని ఇతర ప్రాంతాలకు కూడా యుద్ధం వ్యాపిస్తున్నది.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com